# జనబలం

ప్రజలే ప్రభువులు

మార్చి 2024 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-



## ఎంఎస్‌పీకి చట్టబద్ధత రైతుకి, దేశానికీ హానికరం

**అభివృద్ధి కోసం పాలన**

**వ్యవసాయం : ఎక్కడ తప్పు జరిగింది**

**భారత ప్రజాస్వామ్యం మహిళా ప్రాతినిధ్యం**

**ఎలక్టోరల్ బాండ్లు: సుప్రీంకోర్టు తీర్పు**












# లోక్‌సత్తా పార్టీ నాయకత్వ శిక్షణా శిబిరం

తెలంగాణలో లోక్‌సత్తా పార్టీ చట్టబద్ధపాలన, మంచి ప్రమాణాల ఆరోగ్యం, నాణ్యమైన విద్య, చిన్న పట్టణాల అభివృద్ధి - యువతకు నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు, స్థానిక ప్రభుత్వాల సాధికారత, రైతుకు ఆదాయం, ఆర్.టి.ఐ - హక్కుగా పౌర సేవలు - సిటిజన్ చార్టర్లు మొదలైన కీలక అంశాలపై భవిష్యత్తు కార్యాచరణను ప్రారంభించింది. ఈ అంశాలపై రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన నాయకులతో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో శిక్షణా శిబిరం నిర్వహించారు. సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఈ ఎజెండాను రాష్ట్రంలో ఇంటింటికీ తీసుకెళ్లాలని, ముఖ్యంగా యువతలో ఈ అంశాల గురించి అవగాహన కలిగించాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం సమగ్రంగా చర్చించి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జరిగిన చర్చల వివరాల్ని, ఎజెండా అంశాల్ని, జిల్లాలవారీ కార్యాచరణను సమగ్రంగా వచ్చే సంచికలో ప్రజలందరికీ తెలియచేస్తాం. ఇందుకోసం నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పేరుపేరునా కోరుతున్నాం. శిక్షణా శిబిరానికి లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు నేతృత్వం వహించగా, ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, సీనియర్ నేతలు బండారు రామ్మోహనరావు, కటారి శ్రీనివాసరావు, భాస్కరరావు, సరోజాదేవి తదితరులు ఎజెండా అంశాలపై అవగాహన కల్పించారు.



# జనబలం

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

మార్చి 2024

సంపుటి 25 సంచిక 03


## జనబలం చందా రుసుము వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




## లోపలి పేజీలలో..


- ➥ జబ్బు కంటే ప్రమాదకరం ఎం.ఎస్.పి ఔషధం 5
- ➥ ఎం.ఎస్.పికి చట్టబద్ధత రైతుకి, దేశానికీ హానికరం 7
- ➥ వ్యవసాయ రంగం : తప్పు ఎక్కడ జరిగింది? 14
- ➥ ఉచిత బస్సు ప్రయాణం.. మహిళా సాధికారిత 17
- ➥ భారత రాజకీయాలు– మహిళల ప్రాతినిధ్యం 21
- ➥ సరైన తీర్పు.. కానీ సమస్యను పరిష్కరించలేదు 28
- ➥ చట్టబద్ధ పాలనని సమూలంగా.. వ్యవస్థని గందరగోళం చేయకుండా మార్చాలి 32



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

సంపాదకీయం

# అప్పుల భారతం!

దేశాన్ని స్థిరమైన ఆర్థిక వ్యవస్థగా నిలబడుతున్నామని, వృద్ధి పథంలో పురోగమిస్తున్నామని తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి గట్టిగా నొక్కి చెప్పారు. తుది బడ్జెట్ ఎన్నికల అనంతరం ఎలాగూ వస్తుంది కాబట్టి పెద్దగా ప్రయోగాలు చేయకుండానే ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం పొందడానికే పాలకపక్షం ఈ బడ్జెట్ లో ప్రాధాన్యం ఇచ్చింది.

వేర్వేరు రాష్ట్రాల ఎన్నికలు, స్థానిక ఎన్నికలు, రాజ్యసభ ఎన్నికలు వంటివి మనదేశంలో నిరంతరం వస్తూనే ఉంటాయి. ఎన్నికల వాతావరణం లేని సందర్భం అంటూ ఎప్పుడూ ఉండదు. మరోసారి ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు రాబోతున్నాయి. అందువల్ల బడ్జెట్ సందర్భాన్ని ప్రచారం కోసం వాడుకోవడానికి పాలక, ప్రతిపక్షాలు ప్రయత్నించడం సహజం. కానీ ఎన్నికల కోసమే అయినప్పటికీ మన చర్చలో ప్రజల్ని కలవరపరిచే దేశ ఆర్థిక స్థితిగతులను గురించిన అంశాలను తీసుకురావలసిన అవసరం మిగిలే ఉంది.

గత ఐదేళ్ళకాలంలో, ముఖ్యంగా కరోనా మహమ్మారి మన ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీసిన కాలంలో మన జీవన స్థితిగతులు అల్లకల్లోలం అయ్యాయి. ఆర్థికవ్యవస్థ తీవ్రమైన కుదుపులకు గురయ్యింది. జిడిపి వృద్ధి రేటు పతనం అయ్యింది. వస్తూత్పత్తి క్షీణించింది. ఉపాధి కల్పన దిగజారిపోయింది. దిగుమతులు పెరిగాయి. ద్రవ్యలోటు పెరిగిపోయింది. అన్నిటికంటే ప్రభుత్వం చేసిన అప్పులు ఆందోళన కల్గించే స్థాయికి పెరిగిపోయాయి. ప్రస్తుతం మనదేశం చేసిన అప్పులు జిడిపి నిష్పత్తి 80 శాతాన్ని మించి పోయిందని గణాంకాలు చెబుతున్నాయి.

అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇచ్చిన వివరాలను బట్టి మనదేశం చేసిన అప్పులు 2004 నాటికి జిడిపి లో 84.4 శాతానికి ఉండేవి. ఆ తర్వాత ఆ నిష్పత్తి 67.7 శాతానికి తగ్గింది. 2019 నాటికి మరోసారి అప్పులు జిడిపి నిష్పత్తి 70.4 శాతానికి, ఆ తర్వాత 75 శాతానికి పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అదే నిష్పత్తి 82.4 శాతానికి పెరిగింది.

ప్రభుత్వం చేసే అప్పుల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న రుణాలు, కుదువ అప్పులు, ప్రజల పొదుపు సొమ్మునుండి వాడుకున్న చేబదుళ్ళు, ఆహార సంస్థకు, ఎరువులు, చమురు కంపెనీలకు జారీచేసిన ప్రత్యేక సెక్యూరిటీలు వంటివన్నీ ఉంటాయి. వీటికి ప్రభుత్వం ప్రతి ఏటా వడ్డీలు చెల్లించాల్సి ఉంటుంది. బడ్జెట్‌లో మూలధన పెట్టుబడికి, వడ్డీల చెల్లింపులు అవరోధం కాకుండా ఉంచడానికి ఎఫ్.ఆర్.బి.ఎం. వంటి నియంత్రణలు ఉంటాయి. కానీ చాలా ఏళ్ళుగా నియంత్రణలను ఉల్లంఘించి అప్పులు చేయడం ప్రభుత్వాలకు ఒక ఆనవాయితీగా మారిపోయింది.

మన బడ్జెట్ పత్రాలను పరిశీలిస్తే 2013-14 నాటికి మన అప్పు జిడిపిలో 50.5 శాతం వరకూ ఉండేది. 2019-20 నాటికి 50.7 శాతానికి, 2020-21 నాటికి 60.8 శాతానికి పెరిగింది. 2024-25 సంవత్సరానికి మన అప్పులు బడ్జెట్లో 40 శాతానికి తగ్గించాలని లక్ష్యం పెట్టుకున్నా ప్రస్తుతం అవి 56 శాతం వరకూ ఉన్నాయి. 2018-19 సంవత్సరానికి మొత్తం మన అప్పులు 90.84 లక్షల కోట్లు ఉండగా, ప్రస్తుతం అవి రెట్టింపై 183.67 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. వడ్డీ చెల్లింపుల నిష్పత్తి కూడా ప్రస్తుతం 3.6 శాతంగా ఉంది.

ఆదాయ వ్యయాల మధ్య వ్యత్యాసం బాగా పెరిగిపోతున్నది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొత్తం ఆదాయ, వ్యయాలను లెక్కిస్తే వాటి మధ్య వ్యత్యాసం 2018-19 లో 5.8 శాతం ఉండగా, 2019-20 నాటికి 7.2 శాతానికి, 2021-22 నాటికి 10.4 శాతానికి పెరిగింది. ప్రభుత్వం కొంతమేరకు రోడ్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఖర్చును పెంచిన మాట నిజం. అలాగే ప్రజల ఆదాయ, వినియోగ మద్దతు పథకాలకు సంబంధించిన వ్యయాన్ని పెంచిన మాట కూడా నిజమే.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్యలోటు కూడా ఆందోళన కలిగించే స్థాయిలోనే పెరుగుతోంది. ప్రస్తుతం ద్రవ్యలోటు 3.4 శాతం ఉంది. ఫలితంగా అప్పుల భారాలు, వడ్డీల భారాలు, ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, మనల్ని పట్టి పీడిస్తున్నాయి. ప్రపంచ ఆర్థికవ్యవస్థకు భారత్ తరపున అందించాల్సిన తోడ్పాటులో ద్రవ్య స్థిరీకరణ, పర్యావరణ అనుకూల కేటాయింపులు పెంచాల్సి ఉంటుంది. మూలధన పెట్టుబడి పెంచడానికి అప్పులు పెద్ద వేగ నిరోధకంగా ఉన్నాయి.

ప్రాతిపదిక అంకెలను తారుమారు చేయడం, గణాంకాలను తొక్కిపెట్టి ఉంచడం, వంటివి మన సమస్యలకు పరిష్కారం చూపవు. తనకు బాగా ఇష్టమైన అజెండా అంశాలు ఎన్ని ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలవడానికి అవి చాలవని పాలక పక్షానికి బాగా తెలుసు. ప్రజల జీవన స్థితిగతులను మెరుగు పరిచామని చెప్పుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని కూడా తెలుసు. అందుకు సంబంధించిన వాస్తవాలు, అవసరాలు ఎన్నో ముందుకు వస్తున్నాయి.

దేశంలో 80 కోట్ల పేద కుటుంబాలకు ప్రతినెలా ఐదుకిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని రానున్న ఐదేళ్లకూ పొడిగిస్తూ ఇటీవల కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వికసిత భారత్ గురించి ఎంతగా చెప్పినప్పటికీ ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ పథకం మన ఆర్థిక వ్యవస్థలోని మరో కోణాన్ని వెల్లడిస్తున్నది! అసలు సమస్యలపై చర్చలు చేయాల్సిన అవసరాన్ని ఇది గుర్తు చేస్తున్నది.

డి. సోమ సుందర్

# జబ్బు కంటే ప్రమాదకరం ఎం.ఎస్.పి ఔషధం

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-**

పంజాబ్ రైతుల ఆందోళన భారతీయ వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను లేవనెత్తుతోంది.

స్వతంత్రం వచ్చాక అనుసరించిన అసంబద్ధమైన లైసెన్స్-పర్మిట్-కోటా రాజ్యవ్యవస్థకి దశాబ్దాల తరబడి బాధితులు మన రైతులు. వారి జీవితాలను పణంగా పెట్టి వ్యవసాయోత్పత్తుల ధరల్ని తగ్గించటమే ధ్యేయంగా సాగురంగంలో మన విధాన నిర్ణేతలు వ్యవహరించారు. నిరంతరం ఉప్పు, నిప్పుగా వ్యవహరించే పార్టీలు ఈ విషయంలో మాత్రం విభేదాలను అధిగమించి రాజకీయాలకతీతంగా ఏకమయ్యాయి. ధరల పెరుగుదలకు అవసరమైన పద్ధతుల్నీ, ప్రోత్సాహకాల్నీ ఎన్నడూ పనిచేయనివ్వలేదు. రైతుల్ని ఒక పద్ధతి ప్రకారం పేదలుగా, నిరంతరం చేయి జాచి అర్థించేవారుగా తయారుచేశారు. రవాణా, నిల్వ, అమ్మకాలపై అసంబద్ధమైన, అహేతుకమైన, అవినీతిమయమైన నియంత్రణల వల్ల మార్కెట్లు అపసవ్యంగా మారి ధరల అంతరాలు సాధారణమయ్యాయి. తక్కువ ధరలతో బలవంతంగా ఆహారధాన్యాలను సేకరించటం వల్ల రైతులు పేదరిక విషవలయంలో కూరుకుపోయారు. అవినీతి నిండిన నియంత్రణ, సేకరణ, ప్రజా పంపిణీ లొసుగులమయమై దళారీల్ని పెంచింది. ఖజానాకి నష్టాలు కలిగించటంతోపాటు రైతుల నడ్డి విరిచింది. దేశంలోపల రవాణా, అమ్మకాలపై ఆంక్షల వల్ల ఆహారధాన్యాలు గుట్టలుగా పేరుకుపోయాయి, కొన్ని ప్రాంతాల్లో ఇవి ధరల్ని కుంగదీయగా, ఇంకొన్ని చోట్ల కొరతలు సృష్టించాయి, ధరల్ని పెంచాయి. పంట ధరలపై ఎటువంటి ప్రభావం ఉంటుందన్న ఆలోచన కూడా లేకుండా ఎగుమతుల్ని తరచూ నిషేధించారు. మరోవంక, కొరతలున్న చోట మాత్రం దిగుమతుల్ని సుంకాల పరమైన రక్షణ ఏర్పాట్లు లేకుండా స్వేచ్ఛగా అనుమతించారు. ఉదాహరణకు వంటనూనెలు. రైతులకు ఆదాయం లేకుండా, దేశం భారీ దిగుమతులపై నిరంతరం ఆధారపడాల్సి వచ్చేలా వ్యవహరించారు.

నిల్వ ఉండే ఉత్పత్తుల విషయంలో కూడా ధరల ఒడిదుడుకుల్ని తట్టుకుని రైతులు నిలబడగలిగేలా సరైన ఏర్పాట్లు లేవు. నిల్వ సామర్థ్యం, రుణ సదుపాయం చాలా తక్కువగా ఉన్నాయి. శీతల నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్ లేక కుళ్లిపోయే పంటల్లో 30 శాతం వృధా అవుతున్నాయి. చాంతాడంత పొడవున్న, అసమర్థమైన మార్కెట్ గొలుసు వల్ల వినియోగదారులు చెల్లించే డబ్బులో అత్యధికంగా దళారీలకే పోతోంది. రైతులకు కేవలం 25-30% దక్కుతోంది. మార్కెట్ గొలుసును కుదించి, రవాణాను మెరుగుపరిచే రిటైల్ చెయిన్లు మార్కెట్‌లోకి కాగితంపై



అనుమతించారు తప్ప ఆచరణలో నిలువరిస్తున్నారు. దీంతో, ఉత్పత్తుల రవాణాకి సౌకర్యాలు, నిల్వ, ప్రాసెసింగ్, ఎగుమతుల మార్కెట్‌లోకి అర్థవంతమైన స్థాయిలో ప్రవేశించటానికి అవకాశాలు వ్యవసాయ రంగానికి కరువయ్యాయి. ఈ రకంగా గ్రామీణ, వ్యవసాయ రంగాలను కుంగదీసిన భారతదేశ ప్రభుత్వాల వైఫల్యాల జాబితాకు, అవసరమైన పనులు చెయ్యకుండా, అనవసర జోక్యాలతో కలిగించిన నష్టానికి అంతం లేదు. వీటి వల్ల రైతులకు కలిగిన నష్టం హృదయాన్ని ద్రవింపచేస్తుంది.

పరిష్కారం మార్కెట్లను మరింత తారుమారు చేయటం, వ్యవసాయోత్పతుల సేకరణ, ఎంఎస్.పి (కనీస మద్దతు ధర)ను చట్టబద్ధం చేయటంలో లేదు. 2006 ప్రాంతం వరకు ఆహారధాన్యాలను తక్కువ ధరనిచ్చి బలవంతంగా సేకరించటం నిబంధనగా ఉండేది. అప్పట్నుంచి కొన్ని రకాల ఆహారధాన్యాలకు ఎం.ఎస్.పిని మార్కెట్ ధరల కంటే ఎక్కువగా పెంచారు. దీంతో సేకరణకి డిమాండ్ పెరుగుతూ వచ్చింది. అంతకుముందు ప్రభుత్వ జోక్యం చాలామేరకు మార్కెట్ ధరలను అణగదొక్కగా, ఇప్పుడు ఆహారధాన్యాల తప్పనిసరి సేకరణ ధరల సంకేతాల్ని అపసవ్యం చేసింది. ధరల పెరుగుదలకు అవరోధమయ్యే మూర్ఖమైన ప్రోత్సాహకాన్ని సృష్టించింది. దీంతో, మనం అవసరాలకి మించి ఆహారధాన్యాల ఉత్పత్తి చేస్తున్నాం, మార్కెట్‌లో నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవంక ఇతర



రకాల ఆహార వినియోగం పెరిగి బియ్యం, గోధుమ వంటి ధాన్యాల తలసరి వినియోగం తగ్గుతోంది. పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలకు డిమాండ్ వేగంగా పెరుగుతుండగా, మరింత ఎక్కువ మంది రైతులు మరింత ఎక్కువ గోధుమలు, వరి పండించటానికి ప్రోత్సాహకాలనిస్తున్నారు! వరి సాగు విస్తీర్ణం సుమారు తొమ్మిది రెట్లు, 5 మిలియన్ హెక్టార్ల నుంచి 44 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. గోధుమ మూడు రెట్లు, 9.8 నుంచి 29.8 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. ఈ సంవత్సరం మన ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో 330 మిలియన్ టన్నులు ఉంది. కాబట్టి ఎం.ఎస్.పి, ధాన్యం సేకరణ కేవలం ఒక సంక్షోభ పరిస్థితికి తాత్కాలిక అత్యవసర చర్య మాత్రమే తప్ప, రైతులకి, దేశానికి దీర్ఘకాల ప్రయోజనాలని చేకూర్చదు. ఆచరణ సాధ్యంకాని ధరలతో విధిగా ఆహారధాన్యాల సేకరణ చేయాలనే వాదనలో ఎటువంటి తర్కం గానీ, హేతుబద్ధత గానీ లేవు. రైతులకు మంచి ధర రావటానికి, మారుతున్న డిమాండ్ సరళికి అనుగుణంగా పంటల వైవిధ్యీకరణకు ప్రభుత్వాలు ఆచరణసాధ్యమైన, హేతుబద్ధమైన, తెలివైన విధానాలను రూపొందించాలి.

ధరల సంకేతాలకు వ్యతిరేక దిశలో వ్యవహరించటం, మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా మూర్ఖమైన ప్రోత్సాహకాలను కొనసాగించటమంటే, రైతులను శాశ్వతంగా ఆచరణసాధ్యంకాని ఆర్థిక భారంతో ప్రభుత్వం అందించాల్సిన సాయంపై ఆధారపడేవారుగా తయారుచేయటం. 2023-24 తాత్కాలిక బడ్జెట్ అంచనాల ప్రకారం, యూనియన్ ప్రభుత్వ స్థూల ఆదాయాలన్నీ కలిపినా రాష్ట్రాలకు బదిలీ చేసే మొత్తం నిధులు, వడ్డీ చెల్లింపులు, జీతాలు, పెన్షన్లకే అరకొరగా సరిపోతోంది. సబ్సిడీలకు (ఎక్కువగా ఎరువులు, ఆహారం), వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కూడా దేశం అప్పులు చేయాల్సి వస్తోంది. మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు వ్యవసాయోత్పత్తులను సేకరించటానికి చట్టబద్ధత ఇచ్చి నిరంతరం కొనసాగించటానికి అవసరమైన భారీ మొత్తాల్ని కేటాయించటానికి ఖజానాలో డబ్బు ఉంటే గదా!


సమాధానం ఏమిటి? పంట ధరల్ని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణల్ని తొలగించటం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించటం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, రుణ వ్యవస్థల్ని బలోపేతం చేయటం, అదనపు విలువను ప్రోత్సహించటం, మార్కెట్ గొలుసును కుదించటానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులను పెంచటం మాత్రమే పరిష్కారం. 2020లో అమలు చేసిన వ్యవసాయ చట్టాలు రైతులకు మెరుగైన ధరలు ఇప్పించే సరైన దిశలో ఉన్నాయి. కానీ మన బహిరంగ చర్చ, రైతుల్ని ఒప్పించే శక్తి లేని నాయకత్వం, పార్టీల తాత్కాలిక రాజకీయం వల్ల 2021లో అవి వెనక్కి వెళ్లాయి.

మన నిరసనలు, ఆందోళనల రాజకీయాల్లో రైతుల సంక్షేమం, దేశ దీర్ఘకాల ప్రయోజనాలు ఎలా విస్మరణకు గురయ్యాయో పంజాబ్ రైతుల డిమాండ్లు తేటతెల్లం చేస్తున్నాయి. రుణ మాఫీ, డబ్ల్యు.టి.ఓ నుంచి ఉపసంహరణ, విద్యుత్ చట్టం ఉపసంహరణ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రద్దు వగైరా డిమాండ్లు చూస్తే రైతుల నిజమైన సమస్యను నిష్ప్రయోజనకర రీతిలోకి మళ్లించారని స్పష్టమవుతుంది. రైతులకి ఎక్కువ ఆదాయాలతో మెరుగైన భవిష్యత్తును నిర్మించటానికి బదులు పిడివాదం, బూజుపట్టిన ఆలోచనాధోరణులతో ఇంకా అదే తరహా విఫల, తిరోగమన విధానాల కోసమే వాదిస్తున్నారన్నది సుస్పష్టం. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ నేపథ్యంలో జాతీయ స్థాయి ప్రభుత్వం బియ్యం ఎగుమతిని నిషేధించింది. అలాగే చవకగా దిగుమతి అయ్యే పామ్‌ఆయిల్‌పైన సుంకాలని తొలగించటంతో మన రైతులకి రక్షణ లేకుండా పోయింది; కిలో ఆయిల్‌పామ్ పళ్ళ ధర రు.23 నుంచి ప్రస్తుతం రు.12కి పడిపోయింది. పంజాబ్ రైతుల డిమాండ్లు అటువంటి అంశాల్ని కనీసం ప్రస్తావించకపోవటాన్ని చూస్తే, ఒక నిర్దిష్టమైన స్థానిక సమస్యను జాతీయ సమస్యగా మారుస్తున్నారని, నిరసనకారుల నాయకులు, వారి తరపున మాట్లాడుతున్నవారికి నిజంగా రైతుల సంక్షేమానికి అవసరమైన ఒక సమగ్ర ఎజెండా లేదని స్పష్టమవుతుంది.

గ్రామీణ ప్రాంతంలో, వ్యవసాయంలోని నిజమైన సంక్షోభంపై ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఒక దీర్ఘకాలిక, సమగ్ర వ్యూహాన్ని వెలువరించాలి. వ్యవసాయానికి ఒక సమగ్ర విధానంతోపాటు, మనం పాఠశాల విద్య నాణ్యత, జేబుఖర్చు లేకుండా ఆరోగ్యం అందించటంపై, వ్యవసాయేతర రంగాలలో ఉపాధి అవకాశాలకు గ్రామాలకు సమీపంలో చిన్న పట్టణాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. భారత్‌లో 45% మందిని 18-20% జీడీపీ వాటా గల వ్యవసాయం పోషించటం సాధ్యం కాదు. పంజాబ్ రైతుల డిమాండ్లలో చాలా వరకు అసంబద్ధమైనా, ఆ ఆందోళన ఒక మేలుకొలుపు కావాలి, గ్రామీణ, వ్యవసాయ రంగ సంక్షోభాన్ని దృఢ నిశ్చయంతో పరిష్కరించాలి. ❖

# ఎం.ఎస్.పికి చట్టబద్ధత రైతుకి, దేశానికీ హానికరం

*పంజాబ్, చుట్టుపక్కల రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల రైతుల 'ఢిల్లీ చలో' ఆందోళన నేపథ్యంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఇంటర్వ్యూ నుండి కొన్ని ముఖ్యాంశాలు. JP loksatta యూట్యూబ్ చానల్ కోసం సాయి పృథ్వీ ఈ ఇంటర్వ్యూ చేశారు:*



**హర్యానా, పంజాబ్ రైతుల ఢిల్లీ చలో కార్యక్రమంలో ఒక ముఖ్యమైన డిమాండ్ కనీస మద్దతు ధరను (ఎం.ఎస్.పి) చట్టబద్ధం చేయటం. దీన్ని ఎలా చూడాలి సర్, రైతులకు దేశానికి లాభం కలిగేలా ఈ అంశాన్ని ఎలా పరిష్కరించవచ్చు?**

జేపీ: మనందరం వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చాం. నా మట్టుకు నేను పల్లెటూళ్లో పెరిగా. తెలుగు మీడియం స్కూల్‌లో చదువుకున్నా. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చా. ఇప్పటికి కూడా మా అమ్మగారు వ్యవసాయం చేయిస్తారు. వ్యవసాయం నుంచే నాకు ఆదాయం వస్తోంది. కాబట్టి వ్యవసాయంలో ఉన్న సమస్య, రైతుకున్న కష్టాలు, కన్నీళ్లు మనందరికీ తెలుసు. భారతదేశంలో అందరికంటే దయనీయంగా ఉన్న పరిస్థితి రైతులది. ఎందుకంటే, అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి. వ్యవసాయ వినిమయాల ఖరీదు పెరిగిపోతూ వాళ్లు ఏ వస్తువు కొన్నా ఖర్చు ఎక్కువవుతోంది. చదువు కావాలి పిల్లలకు అంటే, ప్రభుత్వ స్కూల్‌లో డబ్బులు ఖర్చు పెట్టినా చదువు అందక ప్రయివేటు స్కూళ్లకు పంపటం శక్తికి మించిన భారమవుతోంది. ప్రతి కుటుంబం ఒక్కో బిడ్డ మీద రూ.50-70 వేల దాకా ఖర్చు చేస్తోంది. కుటుంబంలో ఆరోగ్యం కావాలంటే వేలకువేలు ఖర్చయిపోతున్నాయి. ప్రభుత్వం చేయాల్సిన పనులు చేయటం లేదు. వ్యవసాయంలో ఏ రకమైన మిగులు కనిపించటం లేదు. అందుకే నూటికి 60 మంది రైతులు ఆ ఊళ్లో ఉండకుండా అవకాశం వస్తే పారిపోదాం అనుకుంటున్నారు వ్యవసాయం వదిలేసి. వ్యవసాయ కుటుంబాల్లోని యువతలో గత్యంతరం లేనివాళ్లు తప్ప నాకు తెలిసి కావాలని వ్యవసాయంలో మనసు పెట్టి ఉన్నవాళ్లు దాదాపు లేరు. వ్యవసాయంలో బతుకుతెరువు అని నమ్మకంతో చేసేవాళ్లు కరువవుతున్నారు.

ఎందుకంటే, ప్రపంచమంతా వ్యవసాయం చాలా కష్టమైన పని, మన దేశంలోనే కాదు. ప్రకృతి మీద ఆధారపడినది. ఒక సంవత్సరం ప్రకృతి కరుణిస్తుంది, ఇంకో సంవత్సరం చీడపీడలొస్తాయి, మార్కెట్‌లో ఉత్పత్తి, డిమాండ్ ఎప్పుడు మారతాయో తెలియదు. డిమాండ్ మారకపోయినా ఉత్పత్తి తగ్గుతుంటుంది. మన ప్రమేయం లేకుండా ధర పడిపోతుంది విపరీతంగా. ఎన్ని లక్షలు ఖర్చు పెట్టినా కూడా డబ్బులేమీ రావు. కొన్నిసార్లు రైతులు ఉత్పత్తి చేసింది మార్కెట్‌లోకి తీసుకెళ్తే అక్కడ రవాణా ఖర్చులు కూడా అందక, మళ్లీ తిరిగి తీసుకెళ్లే ఓపిక లేక అక్కడే పడేసి వస్తున్నారు. కన్నీళ్లతో వస్తున్నారు. ప్రపంచమంతా ఈ ఇబ్బంది ఉందిగానీ, మన దేశంలో ప్రభుత్వాల విధానాల వల్ల ఈ ఇబ్బంది తీవ్రమైంది. మన దేశంలో రెండు కారణాల వల్ల ఈ ఇబ్బంది ఎక్కువైంది. ఒకటి, ప్రభుత్వం. ఏ ప్రభుత్వాలు రైతుల్ని కాపాడాలో ఆ రైతుల్ని శపించి, రైతుల్ని కష్టాలపాలు చేశాయి. ఈ దేశంలో ప్రభుత్వాలు, ప్రభుత్వాల విధానాలు, చట్టాలు రైతులను నష్టపరిచాయి. మనం ముందు ఇది అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, నాకు బాగా గుర్తుంది. 1984లో పొడుగు పింజ పత్తి సాగు చేశారు. ధార్వార్ కాటన్ హైబ్రిడ్, వరలక్ష్మి అంటారు. అప్పటిదాకా పొట్టి పింజ పత్తి వచ్చేది. దేశవాళి పత్తి. ఆ హైబ్రిడ్ కాటన్ మొట్టమొదటిసారి వచ్చినప్పుడు నేను ఓ మారుమూల గ్రామంలో ఉన్నాను. పంటలు బాగా పండుతున్నాయి ఆ సంవత్సరం. చాలాఏళ్లు పాపం రైతులు కష్టపడ్డారు, పంటలు వేశారు, నష్టపోయి కన్నీరు కార్చారు. ఆ సంవత్సరం 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది ఎకరాకి. బాగున్నట్లు లెక్క. రేటు 1600 అయింది. ఆ రోజుల్లో 1600 క్వింటాల్‌కి మంచి రేటు కింద లెక్క. మేమంతా సంతోషపడుతున్నాం ఇన్నేళ్లకు రైతుల కష్టాలు తీరుతున్నాయని. ఎకరాకి 15 క్వింటాళ్లు చొప్పున రూ.24 వేలు వస్తే ఆరోజుల్లో మంచి ఆదాయం. ఒక రూ.10-15 వేలు ఖర్చయినా, ఎకరాకి పదివేలు మిగులుతుంది. ఇది జరిగి కరెక్టుగా 40 ఏళ్లు. కానీ ఒక్క మాటతో, ఒక్క దెబ్బతో ప్రధానమంత్రిగారు రేటును సగం చేసి పారేశారు. మనకు రూ.1600 ఉంటే, విదేశాల్లో రూ.2000 రేటు ఉంది. రేటు ఎక్కువ ఉన్నా కూడా విదేశాల నుంచి మేం కొన్ని లక్షల బేళ్లు దిగుమతి చేసుకుంటామని ఒక్క మాట అన్నారు అంతే. 1600 రేటు కాస్తా 800 అయింది. ప్రపంచంలో ఏ దేశంలో అయినాసరే రేటు బాగుంటే విదేశాల్లో అమ్ముకోవటం ప్రోత్సహిస్తామనే మాట వస్తుందిగానీ, మిమ్మల్ని చంపేయటం కోసం, మీ నడ్డి విరచటం కోసం దిగుమతి చేస్తామని ఎవడూ అనడు. భారతదేశంలో మాత్రమే సాధ్యం. ఆ దెబ్బకి మొత్తం పోయింది, పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. 10 వేలు లాభం వస్తుందనుకుంటే మూడు వేలు నష్టం వచ్చింది.

చూడండి తేడా ఎంతో. ప్రభుత్వం చేసిన పని.

2011లో తెలుగు ప్రజలందరికీ తెలుసు. మన రాష్ట్రంలో బి.పి.టి ధాన్యాన్ని తెలంగాణలో, కొంత దక్షిణ కోస్తాలో పండిస్తారు. మనం తినే అన్నం ఎక్కువగా బి.పి.టి. అక్కుళ్లు, 1061 ప్రొక్యూర్‌మెంట్‌కి పంపిస్తారు. ఆ సంవత్సరం బి.పి.టి రేటు రూ.750కి పడిపోయింది. ఎందుకు పడిపోయింది? పక్క రాష్ట్రాల్లో రూ.1200 ఉంది క్వింటాలు. కర్ణాటకకు, మనకు తేడా ఏమిటి? మధ్యలో గీత కాగితం మీద ఉందిగానీ, నేల మీద లేదు. జనం అటూఇటూ ప్రయాణిస్తుంటారు. కానీ చట్టం పేరుతో గీత గీశారు. ఇక్కడ్నుంచి ఒక బస్తా ధాన్యం అక్కడికి రవాణా చేస్తే జైల్లో పెడతాను, నేరం, నీ ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంటాను - ఇది చట్టం. దాన్ని ఉపయోగించి అప్పటి ఉమ్మడి ఏపీలో పండిన ధాన్యాన్ని పక్క రాష్ట్రానికి తీసుకెళ్లటానికి వీల్లేదు, అమ్మటానికి వీల్లేదని దుర్మార్గమైన, అన్యాయమైన ఆంక్షల్ని పెట్టింది ప్రభుత్వం. ఇక్కడ కంటే అక్కడ 60% రేటు ఎక్కువ ఉంది. అప్పుడు నేను రైతులందర్నీ సంఘటితపరచి నాయకత్వం ఇచ్చి పాదయాత్ర చేపట్టాం. దుర్మార్గపు చట్టాలతో రైతులకు సంకెళ్లు వేస్తున్నారు అనే సంకేతం ఇస్తూ చేతులకు సంకెళ్లు వేసుకున్నాం. 5-10 కిలోల ధాన్యం మూటల్ని భుజాన వేసుకుని తీసుకెళ్లాం. ఎందుకంటే ప్రజలకు అన్యాయం అర్థం కావాలి, ప్రతిఘటన రావాలి. పాదయాత్ర చేసి పక్క రాష్ట్రంలోకి తీసుకెళ్లి అమ్ముతాం, దమ్ముంటే అరెస్టు చేయండని బహిరంగంగా పిలుపునిచ్చాం. కర్నూలు నుంచి కర్ణాటక, నిజామాబాద్ నుంచి నాందేడ్‌కి పాదయాత్ర చేశాం. అక్కడి రైతుల్ని ముందుగానే సంప్రదించటంతో వాళ్లంతా సహకరించారు. మన రైతులు నష్టపోవాలని వాళ్లెవరూ కోరుకోలా. మహారాష్ట్రలో షేత్కారీ సంఘటన్ శరద్ జోషి చొరవతో సహచరులు వచ్చి కొనుక్కున్నారు. ఆ దెబ్బతో ఆంక్షలు పటాపంచలైపోయాయి. ప్రభుత్వానికి మమ్మల్ని అరెస్ట్ చేసే ధైర్యం లేకపోయింది. పది రోజుల్లో రేట్లు సమానమయ్యాయి. అక్కడ 1200 రేటు ఇక్కడ కూడా పలికింది. ఒక్క దాని వల్ల 3,600 కోట్ల రూపాయలు రైతులకు అదనంగా ఆదాయం వచ్చింది. ఒక్క పంటకు, వరి పంటలోని ఒక్క వెరైటీకి. అంటే ఈ 3,600 కోట్లు ఒక్క కలంపోటుతో ప్రభుత్వం దుర్మార్గంగా ఆపింది కదా!

అదేవిధంగా, 2011లోనే మన దేశంలో రేట్లు అంత బాగోకపోతే ఇతర దేశాల్లో బియ్యానికి రేట్లు బ్రహ్మాండంగా ఉన్నాయి. కానీ ఎగుమతుల్ని యూపీయే ప్రభుత్వం నిషేధించింది. ప్రపంచంలో ఎక్కడైనా బయట రేటు బాగుంటే అమ్ముకోండని చెబుతారు. మనం మాత్రం బయటి రేటు బాగుంటే అమ్ముకోవద్దని నిషేధించాం. అప్పుడు నేను పార్టీలందరితో కూర్చుని వాళ్లని ఒప్పించి, ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రితో కూర్చున్నాను. ఆ తేదీ కూడా గుర్తుంది. 2011, ఏప్రిల్ 27. ఆయనకు వివరాలన్నీ చెబితే అప్పుడు ఆయన పూనుకుని రిజర్వు బ్యాంకు నుంచి రిపోర్టు తెప్పించి ఆ నిషేధాన్ని తొలగించారు. అప్పట్నుంచి ఇప్పటి దాకా భారత్ ప్రపంచంలో నెంబర్‌వన్ ఎగుమతిదారు బియ్యంలో. దాన్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్. మన రేట్లు కాస్త పెరిగాయి.

మళ్లీ చూడండి ఫాస్ట్‌ఫార్వర్డ్‌గా. ఉక్రెయిన్ యుద్ధం పేరుతో మళ్లీ నిషేధించారు. ఏదో ఒక ఏడాదిపాటు రేట్లు పెరుగుతాయి అనుకోవచ్చు. కానీ ఆ నిషేధం కొనసాగుతోంది. అట్లానే వంటనూనె. భారత్ ప్రపంచం మొత్తం మీద అతి ఎక్కువ దిగుమతిదారు. ప్రతి సంవత్సరం దాదాపు లక్షన్నర కోట్ల రూపాయలు వంటనూనెల దిగుమతి చేసుకుంటున్నాం. విలువైన విదేశీ మారక ద్రవ్యం పోతోంది, మన రైతులు హతాశులైపోతున్నారు. ఎందుకని? విదేశాల నుంచి పామాయిల్ చాలా తక్కువ ధరకు వస్తోంది. వివిధ కారణాల వల్ల ఆ దేశాల్లో ఉత్పత్తి ఖర్చు చాలా తక్కువ. ఆ రేటుకి ఇక్కడ దిగుమతి చేసుకున్నాక మన రైతుల నుంచి వంటనూనె కొనేవాడు ఎవడుంటాడు? రైతులు మొత్తం పోయినట్లే లెక్క. రైతులు పోవటం కాదు, ఎల్లకాలం మనకు దిగుమతులు అవసరమవుతాయి. మన రైతులు వంటనూనెల ఉత్పత్తి మానేస్తే, దిగుమతుల మీదూ నిరంతరం ఆధారపడతాం. ఎలాగూ కార్ల నూనె దిగుమతి చేసుకుంటున్నాం. ఈ దేశంలో ఉత్పత్తి చేసే అవకాశముంటే, రైతుని చంపేసి దిగుమతి చేసుకుకోవటం ఎంత అన్యాయం. మన రైతులకి సబ్సిడీ ఇచ్చి న్యాయం చేయాలని నేను కొన్నేళ్లపాటు పోరాడాను. యూపీయే ప్రభుత్వంలో చాలాకాలం పోరాడాను దిగుమతి సుంకం పెట్టండని. దిగుమతులు వద్దని అనటంలా. ఇక్కడ మన దేశంలో వంటనూనె లేకపోతే పొట్టగడవాలి కదా మనకి. కానీ ఒక దిగుమతి సుంకం పెట్టండి. అప్పుడు మన రేటు నిలబడుతుంది. ఇప్పటిదాకా ఏం చేశారూ? దిగుమతి చేసుకున్నప్పుడు ముడి చమురు దిగుమతి చేసుకుంటే దాని మీద సుంకం వేయలేదు. రిఫైన్డ్ ఆయిల్ దిగుమతుల మీద సుంకం వేశారు. ఎందుకని? రిఫైన్డ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటే నష్టం ఎవరికి? ఇక్కడి వ్యాపారులకి. వ్యాపారులు అక్కడ నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుని శుద్ధి చేసి అమ్ముతారు. పరిశ్రమల్ని రక్షించారు. మంచిదే కానీ, రైతులు మనవాళ్లు కాదా? 2 కోట్ల 70 లక్షల మంది రైతులు ఈ దేశంలో నూనెగింజలు పండిస్తున్నారు. నేను ఏడేళ్లు పోరాటం చేస్తే నరేంద్ర మోదీ ఎన్‌డీయే ప్రభుత్వమే 2017-18లో దిగుమతి సుంకాన్ని 30-40% తీసుకొచ్చింది. అప్పట్నుంచి రేట్లు నిలబడ్డాయి. గత సంవత్సరం, రెండేళ్ల క్రితం ఉక్రెయిన్ యుద్ధం రాకమునుపు ఏపీలో ఆయిల్ పామ్ గింజలు కిలో రూ.23. బాగున్న రేటు. మోదీ ప్రభుత్వం ఉక్రెయిన్ యుద్ధం కారణంగా మళ్లీ సుంకాన్ని దాదాపు తీసిపారేశారు. ఒక 5% దాకా ఉంచారు. ఏపీలో ఆయిల్ పామ్ ధర 23 కాస్తా రూ.13 అయిపోయింది. ఒక్క కలంపోటుతో. యుద్ధం మొదలై, సంవత్సరంన్నర దాటింది. ఇంకా కొనసాగుతోంది నిషేధం. అంటే ప్రభుత్వాల చర్యలు ఎప్పుడూ పంటల ధరల్ని కింద పడేయటం తప్ప, రైతుకి లాభం రాకుండా చేయటం తప్ప,

రైతుకి ప్రయోజనం కలిగించటం కాదు. కాబట్టి మొట్టమొదట మనందరం గుర్తించాల్సింది రైతుల ఆవేదన అర్థవంతమైనది, వ్యవసాయ రంగం చాలా నష్టపోతోంది. ఒక సామెత ఉంది. చికిత్స జబ్బు కంటే ప్రమాదం కాకూడదు. జబ్బుకిచ్చే మందు ప్రాణాలు తీసేస్తే అదేం వైద్యం? ఎం.ఎస్.పికి చట్టబద్ధత ఇచ్చి, ధర ఉన్నా లేకున్నా కొనాలి అంటే అది మందు కాదు, వ్యవసాయాన్ని నాశనం చేయటం. ఈ మాట రైతుల బిడ్డగా, రైతుల కోసం జీవితమంతా పోరాడినవాడిగా చెబుతున్నా. ఇప్పుడు మీ ముందు కొన్ని విషయాలు పెట్టాను, ఇంకా చాలా విషయాలు ప్రజలకు తెలుసు. వ్యవసాయరంగంలో నేను ఎంత పాటుపడ్డానో. రైతులకు మేలు చేయటం కోసం రైతుల క్షేమం కాంక్షించే వాడిగా నిర్ద్వంద్వంగా చెబుతున్నా- రైతులకి సాయం కావాలిగానీ ఈ రూపంలో కాదు- ఎందుకు కాదు? ముందసలు మన దేశంలో మీరు కొనాలి అంటే, వస్తువు అవసరం ఉంటే గదా కొనేది.

ఏ వస్తువైనా మార్కెట్‌లో ధర పెరిగింది అంటే, డిమాండ్ ఎక్కువ ఉంది, సరఫరా తక్కువగా ఉంది. ధర తగ్గింది అంటే డిమాండ్ కంటే సరఫరా పెరిగింది. డిమాండ్ లేనప్పుడు కొనాలి అంటే, కొని ఏం చేసుకుంటాం మనం? భారతదేశంలో అసలు డిమాండ్ ఉందా? డిమాండ్ లేకుండా కొనమనటం అసంబద్ధం. మా పొలంలో కూడా, మా అమ్మగారు, నాన్నగారు కష్టపడి కొనుకున్న కొద్దిపాటి పొలంలో కూడా ఇప్పుడు ధాన్యం వేస్తున్నారు. ఎందుకంటే, డెల్టా ప్రాంతంలో పూర్వం నుంచి కూడా వరద నీటి సాగు. పక్కన వాళ్లంతా ధాన్యం వేస్తే రైతు ఆపలేడు. మన పొలంలోకి నీళ్లు వచ్చేస్తాయి. వేరే పంట వేయటానికి సాధ్యం కాదు. ఇది ఒక్కరోజున మారదు. సరే, పంట వేస్తే బాగానే పండుతోంది. పెద్ద కష్టం లేకుండానే ప్రభుత్వం మంచిరేటుకే కొంటోంది. పెద్ద డబ్బులు రాకపోయినా, మంచి రేట్లు వస్తున్నాయి. కానీ ఏమవుతోందీ, అవసరానికి మించి రైతులు ఆహారధాన్యాల్ని ఉత్పత్తి చేస్తున్నారు. దేశం మొత్తం ఎంత అవసరం ఆహారధాన్యాలు అన్నట్లయితే, బియ్యంగానీ, గోధుమగానీ సగటున ఒక మనిషికి రోజుకి 2500 కేలరీలు ఆహారంలో కావాలి. అది ఒక ఎదిగిన మనిషికి, ఆరోగ్యంతో ఉన్న మనిషికి. కానీ మన దేశంలో 30 శాతం మంది పైగా 15-18 ఏళ్ల వయసులో ఇప్పుడిప్పుడే పెరుగుతున్న జనాభా. జనాభా పెరుగుదల తగ్గుతోంది, జనాభా తగ్గటంలా, మహిళ సంతానోత్పత్తి రేటు తగ్గుతోంది. అంతేగానీ, జనాభా తగ్గలా. కొంతకాలం పోయాక 15-30 ఏళ్లు పోయాక తగ్గటం మొదలవుతుంది. కాబట్టి 40 శాతానికి, వృద్ధాప్యంలో ఉన్నవారికి నాలుగవ వంతు సరిపోతోంది. పూర్వం అంతంత అన్నం తినేవాళ్లు, ప్రస్తుతం యువత కూడా తక్కువ తింటున్నారు. ఎందుకు? మిగతావి తింటున్నారు. మాంసకృత్తులు, పండ్లు తినాలి. కూరగాయలు తినాలి. గుడ్లు కావాలి. పాలు కావాలి. పెరుగు కావాలి. మాంసం కావాలి. ఆహారపు అలవాట్లు, అభిరుచులను బట్టి పౌష్టికాహారం కావాలంటే ఇవన్నీ బ్యాలెన్స్ చేసుకోవాలి. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటే, మీకు 40% పిల్లలున్నప్పుడు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లు ఎక్కువ తిననప్పుడు, 2000 కేలరీలు సగటున సరిపోతాయి.

ఆహారంలో 60% మించి పిండిపదార్థాలు అక్కర్లేదు. అంటే 1200 కేలరీలు మనిషికి ఆహారధాన్యాల రూపంలో. మిగతా రూపాల్లో పప్పులు, మాంసంకృత్తులు, గుడ్లు, చేపలు, ఇతర ఆహారం కావాలి. 1200 కేలరీలు ప్రతి ఒక్కరికీ ఇవ్వాలంటే 1 గ్రాము కార్బోహైడ్రేట్‌కి 4 కేలరీలు. అంటే, 300 గ్రాములు కావాలి సగటున. 142 కోట్ల జనాభాకి 154 మిలియన్ టన్నులు కావాలి. కానీ మన దేశంలో ఉత్పత్తి ఎంతో తెలుసా? 330 మిలియన్ టన్నులు. 15 కోట్ల 40 లక్షల టన్నులు అవసరమైతే 33 కోట్ల టన్నులు ఉత్పత్తి చేస్తున్నాం. ఏం చేద్దాం? ఇంకా పెరుగుతోంది. తెలంగాణలో పదుల వేల కోట్లు రూపాయలతో ఖర్చు ఎక్కువపెట్టి సాగునీరు తీసుకొస్తే, దాదాపు అందరూ ధాన్యం వేశారు. విజయవాడనుంచి హైదరాబాద్‌కి రోడ్డు ప్రయాణంలో వస్తుంటే, చాలాచోట్ల పొగమంచు ఎందుకు వస్తోంది? మీకు పైనుంచి చల్లబడ్డగాలి కిందకు వచ్చినప్పుడు కింద నీళ్లున్నట్లయితే ఆ నీళ్ల నుంచి తేమను తీసుకుంటుంది. హ్యుమిడిటీ అంటాం. వాయువులో తేమ 100% ఉంటే పొగమంచు అవుతుంది. ఎందుకొచ్చిందీ తేమ? చుట్టుపక్కల ఎటుచూసినా వరి పంట. ఎందుకంటే మనకు సాగునీరు అంటే ధాన్యం, ఎందుకంటే ప్రభుత్వం కొనసాగిస్తున్న విధానాలు తప్పు. తినేవాడు లేడు, రేటు పడిపోతోంది. ప్రభుత్వాన్ని కొనమని గొడవ చేస్తున్నాం. అవసరానికి మించి మనం ఉత్పత్తి ఎక్కువ చేస్తున్నాం. అదే సమయంలో పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు, మాంసం, చేపల కొరత ఉంది. మాంసం కిలో రూ.600-700. అక్కడా కొరత. కాబట్టి అవసరం లేక. డిమాండ్ పడిపోతున్నప్పుడు దాన్నే ఉత్పత్తి చెయ్యి కొంటాననేది అసంబద్ధం. తాత్కాలికంగా సరే ఏదోకటి చేయాలి. చట్టబద్ధంగా చేయటమనేది రైతుకి ఉరి. దేశానికి ఉరి.

రెండోది, మనం గుర్తించాల్సింది, ఎంఎస్‌పి అనేది ఎప్పుడొచ్చింది? 1965-66లో వచ్చింది. బీహార్‌లో, దేశంలో చాలాచోట్ల ఆహారం కొరత ఉన్నప్పుడు, వ్యవసాయ విప్లవం రాకముందు, హరిత విప్లవం వచ్చే ముందు ఎలాగోలా రైతుల్ని ప్రోత్సహించాలి పండించటానికి అనే నేపథ్యంలో వచ్చింది. ధర మార్కెట్‌లో బాగుంది. ఎందుకంటే, కొరత ఉంది కదా. ఆహారధాన్యాలు పేదలకు సరిగా అందటం కోసం ప్రభుత్వం చౌకధరల దుకాణాలు- పీడీఎస్ తీసుకొచ్చింది. పౌర సరఫరాల సంస్థ పేరుతో ఓ పెద్ద యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. దాన్లో బోలెడన్ని లంచాలున్నాయి. ప్రతి చోటా లంచాలే. అది పక్కన పెడదాం. ఆ రోజుల్లో మార్కెట్‌లో రేటు చాలా ఎక్కువ ఉండేది. కొన్ని సందర్భాల్లో వివిధ కారణాల వల్ల రేటు పడిపోతే, నాకు ఏమవుతుందన్న భయం రైతుకి లేకుండా కనీస మద్దతు ధర ఇచ్చి ఇంతకు తగ్గకుండా మేం చూసుకుంటాం ఏమైనా కూడా, భయడపడబోకు అని భరోసా ఇస్తే రైతు ఇంకా ఎక్కువ ఉత్పత్తి



చేస్తాడని ఆ ఏర్పాటు పెట్టారు. కనీస మద్దతు ధర వచ్చింది మార్కెట్ ధర కంటే ఎక్కువ ఉండటం కోసం కాదు. మార్కెట్‌లో ఒకవేళ పడిపోయినా కూడా ఇంతకంటే తక్కువ ఉండదని భరోసా ఇవ్వటం కోసం. అది భరోసా ధర. 2004 సంవత్సరం దాకా ఇలా ఉంది. ఈ లోపల ఉత్పత్తి బ్రహ్మాండంగా పెరిగింది.

స్వతంత్రం వచ్చినప్పుడు ఆహార ధాన్యాల ఉత్పత్తి 5 కోట్ల 50 లక్షల టన్నులు. ఇప్పుడు 33 కోట్ల టన్నులు. ఇవాళ గొడౌన్లలో దిగుబడి సమయంలో దాదాపుగా 8-9 కోట్ల టన్నులు నిల్వ ఉంటున్నాయి. కేవలం ప్రభుత్వ గొడౌన్లలో ప్రైవేటులో కాకుండా. మన వ్యూహాత్మక నిల్వ అవసరాలకి ఇవి 4-5 రెట్లు ఎక్కువ. గతంలో ఎంఎస్‌పి కంటే మార్కెట్ ధర ఎక్కువ ఉండేది. ప్రభుత్వం బలవంతంగా, నిర్బంధంగా సేకరించేది. నేను జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు మిల్లర్లతో కూర్చుని మీరు ప్రభుత్వం, చట్టం ప్రకారం ఇవ్వాల్సిందే అంటే వాళ్ల బాధలు వాళ్లు చెప్పేవాళ్లు. నేను చేయగలిగిందల్లా ఏమిటి? మీకు లంచాలు లేకుండా చూస్తాను అని హామీ ఇచ్చాను. వాళ్లు కొనాలంటే ధాన్యానికి పర్మిట్ కావాలి. మళ్లీ దానికి లంచం, మనదేశాన్ని ఎంత విచిత్రంగా తయారుచేశామో చూడండి. ధాన్యం సేకరణకు లంచం, నిల్వ చేసేందుకు లంచం, ఒక టన్ను ప్రభుత్వానికి ఇస్తే ఒక టన్ను మార్కెట్‌లో అమ్ముకోమని పర్మిషన్ ఉండగా, ఆ పర్మిషన్ తీసుకోవటానికి లంచం. అడగండి ఎవరినైనా మార్కెట్లో. దీంతో మిల్లర్లు సతమతమయ్యేవాళ్లు. నాలాంటివాళ్లు మీకు లంచాలు లేకుండా న్యాయంగా పర్మిట్లు ఇస్తామయ్యా కానీ ప్రభుత్వానికి ఇవ్వాల్సింది ఇవ్వాలి తక్కువ రేటైనా సరే, మిగతాది మార్కెట్‌లో ఎక్కువ రేటు వస్తే అమ్ముకోండి సంతోషంగా అని చెప్పాం. కానీ ఇప్పుడేమైంది, మార్కెట్ ధర తక్కువ ఉంది, ఎంఎస్‌పి ఎక్కువైంది. కాబట్టి ఇప్పుడు మార్కెట్‌లో అమ్ముకోవాలని ఎవరూ కోరుకోవటంలా. మార్కెట్‌లో అమ్ముకోవటానికి పర్మిషన్ కోసం అడగటంలా. నాకొద్దు, మీరు కొనండి అంటున్నాడు.

కనీస మద్దతు ధర అంటే 10 టన్నులు ఉత్పత్తి అయితే 9 టన్నులు అమ్ముడుపోతే 1 టన్ను కొనటమని ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఇచ్చే గ్యారంటీగానీ, భారతదేశంలో ఉత్పత్తి చేసింది మొత్తం కొనాలి అంటే, ప్రపంచమంతా దిగొచ్చినా మీ దగ్గర కొనటానికి డబ్బుల్లేవు. సాధ్యం కాదు. ఈ సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వ ఆదాయం రూ.42 లక్షల కోట్లు. అన్ని రూపాల్లో. ఈ వచ్చిన ఆదాయంలో 22 లక్షల 74 వేల కోట్లు రాష్ట్రాలకు బదిలీ అవుతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు కావచ్చు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఇతర పథకాలు, ఇతర పద్దులు, గ్రాంట్‌లు కావచ్చు, నా సొంత అంకెలు కాదు, బడ్జెట్‌లో లెక్కలు. ఆపైన 12,90,000 కోట్లు వడ్డీ చెల్లించాలి. ఆపైన 7,68,000 కోట్లు జీత భత్యాలు సిబ్బందికి. మూడూ ఒక్కసారి కలపండి. 42 లక్షల కోట్లు దాటిపోయింది. ఇది కాకుండా ప్రభుత్వానికి బోలెడు సాదర ఖర్చులున్నాయి, ఆ పైన ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఎరువులు, ఆహారం, సంక్షేమ పథకాలు వగైరాలు. మరి మనకి రోడ్లు కావాలి, మంచి విద్య కావాలి, మంచి ఆరోగ్యం కావాలి, పెట్టుబడుల్ని ప్రోత్సహించి మౌలిక సదుపాయాలు బాగుచేయాలి. వీటన్నిటికీ డబ్బులు కావాలి. అలాంటి పరిస్థితుల్లో మీరు ఒకవేళ కొందామనుకున్నా డబ్బులు ఎక్కడున్నాయో చూపెట్టండి. నేను చెప్పిన అంకెల్లో తప్పుంటే చెప్పండి. సంతోషంగా డబ్బు ఖర్చు పెడదాం.

వ్యవసాయోత్పత్తులు అన్నీ కలిపి విలువ దేశంలో ఈవేళ 70-80 లక్షల కోట్లు. ప్రభుత్వం దగ్గర రాష్ట్రాలకు బదిలీ చేసే డబ్బులు, వడ్డీల డబ్బులు, జీతం పోగా అప్పులు మిగిలాయి. 70 లక్షల కోట్లు కాదు, 7 కోట్లు కూడా లేవు. పోనీ, అప్పోసాప్పో చేసి సాయపడదామంటే 5-10 ఏళ్ల పాటు, రైతు ఏమన్నా బాగుపడతాడా? మళ్లీ 11వ ఏడాది కూడా అయ్యా, మీరు మా దగ్గర కొనండి అంటాడు. కొనకపోతే మళ్లీ పరగడుపే. రైతుకి కచ్చితంగా సాయం కావాలి. కానీ ఈ పద్ధతిలో కాదు. ఉదాహరణకు, పండ్లు, కూరగాయలకు డిమాండ్ ఎక్కువ ఉంది. ఆ పంటలు వేసుకోవటం కోసం పెట్టుబడులు, సాగు సౌకర్యం కావాలి. దానికి మనం సాయం చేద్దాం. మన దేశంలో గొడౌన్లు కావాలి ఉత్పత్తి చేసిన సరకు డిమాండ్ వచ్చే వరకు నిల్వ చేసుకునేందుకు. నూటికి 7-8% కూడా గొడౌన్లు ఉండటంలా. ఎక్కడికక్కడ తెగనమ్ముకోవాల్సి వస్తోంది. గోదాములు, కోల్డ్ స్టోరేజిలు ఏర్పాటు చేద్దాం. ఉదాహరణకు, మిర్చి, పత్తి, పసుపు. రేటు పడిపోతుంటుంది, పెరుగుతుంటుంది. రేటు పడిపోయినప్పుడు అమ్మకపోతే డబ్బుల్లేవు, తినటానికి లేదు, మళ్లీ పంట వేసుకోవటానికీ డబ్బు ల్లేవు. కాబట్టి గతిలేక అమ్ముతున్నాడు. డిస్ట్రెస్ సేల్. అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి. ఆ టైంలో, అయ్యా, నువ్వు గొడౌన్లలో పెట్టుకో. రుణం ఇస్తా. పంట ఉంది కాబట్టి తనఖా పెట్టి తీసుకో. ఉచితంగా ఇవ్వటం లేదు కదా. రేటు పెరిగినప్పుడు అమ్ముకుని డబ్బులు మాకు ఇచ్చేయి అంటే, ఈలోగా ఇల్లు గడుస్తుంది, మంచి

రేటొస్తుంది, దేశంలో 1% కూడా ఆ రుణాలు ఇవ్వటంలా మనం. ఆ రుణమివ్వండి. దాన్లో వడ్డీ రాయితీ ఇవ్వండి. ప్రాసెసింగ్‌కి, రిటైల్ చెయ్యిన్లకి ఏర్పాటు చేయండి. చాంతాడంత పొడుగున ఉంది మార్కెటింగ్, దళారీ వ్యవస్థ కొంచెం తగ్గించే ఏర్పాటు చేయండి. ఎగుమతుల కోసం ప్రోత్సాహకాలు ఇవ్వండి, దానికి చేయాల్సిన తతంగం ఉంది. బోలెడు చేయాలి, ఇంత డబ్బు కంటే ఎక్కువ ఖర్చు పెట్టాలి. కానీ ఎలాగ? సంపద పెరిగేరీతిలో, వ్యవసాయంలో ఆదాయం పెరిగే రీతిలో, రైతులు తమ కాళ్ల మీద తాము నిలబడాల్సిన రీతిలో, రేపొద్దున మళ్లీ అర్థించాల్సిన అవసరంలేని రీతిలో. అంతేగానీ, వాళ్లను బానిసలుగా చేసి, వాళ్ల బతుకులు బాగుపడకుండా ఏదో చేస్తున్నట్లు నటిస్తే దేశమేమవ్వను? రైతుకేమవను? ఎందుకని 40 ఏళ్లు అవే విధానాలు కొనసాగించినా రైతులు బాగుపడలేదు? విధానం కొనసాగించటం మూలంగా బాగుపడిందా? ఇన్నేళ్లుగా ఎం.ఎస్.పి ఉందిగా, బాగుపడిందా రైతులకి? ఎం.ఎస్.పితో అంతా అయిపోయిందా రైతులకి? దేశం అద్భుతంగా, బ్రహ్మాండంగా ఉందా?.. కాబట్టి ఇది సరైన పద్ధతి కాదు. రైతుల్ని బాగుచేసే పద్ధతి అంతకంటే కాదు. దేశాన్ని నాశనం చేసే పద్ధతి.

చివరికి ఇంత కష్టపడి, ధాన్యాన్ని సేకరించి మనం చౌకధరల దుకాణాలకి పంపుతున్నాం. ఏపీ, తెలంగాణల్లో తెలుగువాళ్లని ఎవరినైనా అడగండి, నేను చెప్పేది తప్పయితే చెప్పండి, తప్పకుండా సరిదిద్దుకుంటాను. మీ నుంచి, వాళ్ల నుంచి వింటేనే గదా నాకు తెలిసేది. రూ.1కి మార్కెట్‌లో కిలో బియ్యం ఇస్తున్నారు, మార్కెట్‌లో రూ.30-40 ఉంది. ప్రభుత్వాలకు రూ.30-40 వేల కోట్లు ఖర్చవుతోంది. అంటే రూ.39 సబ్సిడీతో ప్రభుత్వం ఇస్తోంది. పేదలకు అందితే సంతోషమే. కానీ ఇందాక చెప్పానుగా లెక్కల ప్రకారం, ఇది తీసుకుంటున్నవాళ్లకి అవసరం లేదు. లేదంటే, వేరే తినాలనే కోర్కె ఉంది. అక్కడ తీసుకొచ్చినాళ్లు రూ.1కి ఇస్తే, వెంటనే రూ.10కి బయట అమ్ముతున్నారు. ప్రభుత్వానికి ఎక్కువ ఖర్చయి ఉండొచ్చు, కానీ నాకు రూ.1కి వస్తోంది, ఇంట్లో అందరికీ 30 కిలోలు ఇస్తే, 30కి 270 వచ్చింది కదా, నాదేం పోయె అనుకుని అమ్మేస్తున్నాడు. ప్రజలను తప్పుపట్టటంలా. ఆ 300కి కొన్నాడు కిలో రూ.15-20కి ఇంకొకరికి అమ్ముతున్నాడు. వాడికీ లాభం కదా! రూ.300కి రూ.450. ఒక్కరోజులో 150. వాడేం చేస్తున్నాడు, మళ్లీ ప్రభుత్వానికి అమ్ముతున్నాడు. ప్రభుత్వం అంటే రేవంత్ గారో, మోదీ గారో, జగన్, చంద్రబాబు జేబులో డబ్బులు కాదు. మన డబ్బు కదా. ఈ డబ్బంతా అలా పందేరం అయిపోతోంది. ఈ మొత్తం తతంగంలో సివిల్ సప్లయిస్ శాఖలోని ఉద్యోగులకి, ఎఫ్.సి.ఐలో అధికారులకి ఆమ్యామ్యాలు- కాదని ఎవరినైనా చెప్పమనండి. అందరూ తీసుకుంటున్నారని అనటంలా. నిజాయితీపరులు అన్నిచోట్లా ఉన్నారు. కానీ ఈ శాఖల్లో అవినీతి సర్వవ్యాప్తం. అక్కడ పొజిషన్ వేయాలంటే లక్షలు, కోట్ల రూపాయలు పలుకుతుంది. కొన్ని జిల్లాల్లో, ప్రొక్యూర్‌మెంట్ బాగా చేసే జిల్లాల్లో, నాకు స్వయంగా తెలుసు. ఎవడికెంత లంచం ఇవ్వాలో పాపం రైస్ మిల్లర్లకి అర్థం కావటం లేదు. ఈ గందరగోళం లేకుండా ఒక సర్క్యులర్ తయారుచేశారట. ఒక లారీ లోడ్‌కి వీడికింత, వీడికింత అని. 26 మందికి ఇవ్వాలట. అంత విశృంఖలంగా ఉంది. అంటే, ప్రజల డబ్బు ప్రజలకు వెళ్లటంలా. ప్రజల విధానాల పేరుతో కైంకర్యం అవుతోంది. సొమ్మొకపోయే శనీ పట్టె. ఇప్పుడు చూడండి. ప్రభుత్వం దగ్గర సొమ్ములు లేవు. ఈ వస్తువులకు గిరాకీ లేదు. ప్రజలు వేరే కోరుకుంటున్నారు. వ్యవసాయంలో రైతుకి దీర్ఘకాలంలో ఆదాయం పెంచకుండా ఎల్లకాలం ఆధారపడేవారుగా ఎంఎస్‌పి అంటున్నారు. అన్ని రకాలుగా కూడా ఇంతకంటే పొరపాటు ఆలోచన లేదు. తాత్కాలికంగా ఉత్పత్తి చేశారు కాబట్టి, ప్రస్తుతం కొందాం. అంతేగానీ, నేను ఉత్పత్తి చేస్తే మార్కెట్‌తో సంబంధం లేకుండా, అవసరం ఉన్నా లేకున్నా మీరు శాశ్వతంగా కొనాల్సిందే, కొనకపోతే నేను ఊరుకుకోను అని కూర్చుంటే, ఆ రోగికిచ్చే మందు విషమవుతుంది. రోగిని కాపాడటంలా.

నేను నిండు హృదయంతో చెబుతున్నా, రైతుల మనిషిగా చెబుతున్నా. రైతుల మనిషి అంటే, గుడ్డెద్దు చేల్లో పడ్డట్టుగా రైతుకు నష్టం వచ్చేది, దేశాన్ని నాశనం చేసేది కోరుకోవటం కాదు. నేను చెప్పింది ఒక్క అంకె తప్పయితే మీరు చెప్పండి. ప్రొక్యూర్‌మెంట్ అవసరం. కానీ ఇంకా 100 మెట్రిక్ టన్నులు ఉన్నా మార్కెట్‌లో డిమాండ్ ఉంది, అవసరముంది అన్నట్లయితే ధర ఎందుకు రావటం లేదు? 330 మెట్రిక్ టన్నులు చాలదు, 500 మెట్రిక్ టన్నులు చేస్తామంటే చెప్పండి ఎవరు కొంటారు, ఎలా అమ్ముకుంటారు? పంటల్లో ఉత్పత్తి ఇంకా పెరగాలి. మన వ్యవసాయోత్పత్తులు పెరగాలి. కానీ బియ్యం ఉత్పత్తి కాదు. కాబట్టి వాస్తవాల్ని చూడండి. కాస్త హేతుబద్ధంగా ఆలోచించండి, మన పరిస్థితుల్ని గమనించండి, ఆదాయం రావటం ఎట్లా అని ఆలోచించండి. రైతులు పాపం అమాయకులు కాబట్టి, ఎవరు మనల్ని మోసం చేస్తారో వాళ్లనే నమ్మే బలిపశువుల్లాంటి అమాయకులు కాబట్టి, రైతుల్ని బలి చేయవద్దు. రైతుల భుజాల మీద నుంచి మీ అస్త్రాల్ని ప్రయోగించవద్దు. రైతుల జీవితాల్ని నాశనం చేసి దేశాన్ని నాశనం చేయవద్దు. మనకి ఒక సామెత ఉంది ఇంగ్లిషులో. కొంతమంది మిత్రులుంటే శత్రువులక్కర్లా. ఇలాంటి మిత్రులుంటే రైతులకు వేరే శత్రువులక్కర్లా. ప్రభుత్వం బలవంతంగా ఎక్కువ రేటుకి కొనటమే పరిష్కారం అనే భావం ఉన్నట్లయితే, ఇక రైతులకి, వ్యవసాయానికి శత్రువులక్కర్లేదు. వీళ్లే శత్రువులు. దురుద్దేశంతో చేయకపోవచ్చు. కానీ దురుద్దేశమా, సదుద్దేశమా అనేది కాదు. మనం చేసే చర్యల వల్ల ఫలితం ఉద్దేశాలను బట్టి ఉండదు. చేసే చర్యల్ని బట్టి ఉంటుంది. గొడ్డలి చేతిలో పట్టుకుని ఇలా కొట్టాను, పొరపాటున వాడి కాలు తగిలిందండీ, ఏ దురుద్దేశం లేదు అంటే, ఉద్దేశం మంచిదే కానీ కాలుతెగిందయ్యా! కాబట్టి చాలా ప్రమాదకరమైనటువంటిది.

***సర్, పరిస్థితి ఇలా ఉంటే, రాహుల్‌గాంధీ మాట్లాడుతూ మళ్లీ***

***పార్టీ అధికారంలోకి వస్తే ఎం.ఎస్.పిని చట్టబద్ధం చేస్తామన్నారు. ఒక జాతీయ పార్టీ ఈ దృష్టితో ఆలోచించటం కరెక్టేనంటారా? దీన్నెలా చూస్తారు?***

జేపీ: కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో చాలా పెద్ద జాతీయ పార్టీ. గత వంద. నూట ఇరవై ఏళ్ల చరిత్ర మీద అపార ప్రభావం చూపిన పార్టీ. జాతీయ పోరాటానికి నాంది పలికిన పార్టీ. స్వతంత్రం వచ్చాక ఒక తరం కాలం పాటు ఈ దేశంలో రాజ్యాంగ వ్యవస్థల నిర్మాణం చేసిన పార్టీ. కొన్ని తప్పులు చేసినా సరిదిద్దుకునే ప్రయత్నం చేసిన పార్టీ. ఆ పార్టీలకు బాధ్యత ఉండాలి. చాలా ముందుచూపుతో వ్యవహరించాలి. ఎన్నికల్లో ఓట్లు వస్తాయంటే, ఏం చేసినా పర్లేదు అనే పరిస్థితి ఉన్నట్లయితే, తాత్కాలికంగా ఓట్ల కోసం దేశ ప్రయోజనాలు, రైతులు ప్రయోజనాలు నాశనం చేసే ధోరణి ఉన్నట్లయితే అది రాజకీయం కాజాలదు. చాలా ప్రమాదకరమవుతుంది. కాంగ్రెస్ పార్టీతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. మన్మోహన్‌సింగ్ కావచ్చు, ఎన్.ఏ.సి అధ్యక్షురాలు సోనియాగాంధీ గారు కావచ్చు, మరెందరో అగ్ర నాయకులు కావచ్చు. అలాగే బీజేపీలో ఉన్న అగ్ర నాయకులు కావచ్చు. ఈ పార్టీ, ఆ పార్టీ అని కాదు. పార్టీల్ని మనం గౌరవించాలి. పార్టీలు లక్షలాదిమంది ప్రజల ఆశలకి, ఆకాంక్షలకి ప్రతిబింబాలు. పార్టీల్ని తూలనాడకూడదు ఇష్టమొచ్చినట్లుగా. కానీ ఆ పార్టీలు కూడా చాలా బాధ్యతగా దేశ ప్రయోజనాల కోసం ప్రవర్తించాలి. రైతుల ప్రయోజనాల కోసం ప్రవర్తించాలి. నేను రాహుల్‌గాంధీ గారిని వినమ్రంగా ఒక్కమాట కోరుతున్నా. ఎక్కడ డబ్బులున్నాయో చెప్పండి, నేను మీ ముందు అంకెలు పెట్టాను. జయప్రకాష్ గారూ, మీరు చెప్పింది వాస్తవం కాదు, ఈ 20 లక్షల కోట్లు మా దగ్గర రహస్యంగా ఈ డబ్బుంది ప్రతి సంవత్సరం. ఆ డబ్బు ఖర్చు పెడతాం అంటారా, చెప్పండి మాకు. ఎక్కడో చూపెట్టండి. ఈ డబ్బులు ఖర్చు పెడితే ఇక రైతుల కడగండ్లు తీరిపోతాయి, ఇక రైతులకు ఇబ్బందేమీ ఉండదు, ఆదాయాలు పెరుగుతాయి అంటే, ఆ మ్యాజిక్ ఏమిటో చెప్పండి నాకు.

***2006లో ఇదేవిధంగా ఒక డిమాండ్ వచ్చింది స్వామినాథన్‌గారి ఫార్ములాతో. అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ తోసిపుచ్చారు. అదేవిధంగా, మోదీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాల్లో ఏవైతే ఉన్నాయో అలాంటి అంశాలనే 2019లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టారు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక మాత్రం వాటిని కాంగ్రెస్ వ్యతిరేకించింది. అధికార పార్టీ ఏదైతే ఎస్ అంటుందో వాటికి ప్రతిపక్షంవాళ్లు నో అనటం, ప్రతిపక్షం ఎస్ అంటే, అధికార పార్టీ నో అనటం. అంటే వ్యవసాయం, రక్షణ రంగం వంటి ప్రధాన అంశాలపై పార్టీలకు ఒక ఏకాభిప్రాయం, ఒక వైఖరి మీద ఉండటం లేదంటారా?***

జేపీ: మనకు ఏమవుతోందంటే, అధికారంలో ఉంటే ఒక మాట, బయట ఉంటే ఇంకో మాట. అధికారంలో ఉంటే బాధ్యతలు తెలిసొస్తాయి, పరిమితులు తెలిసొస్తాయి, పైనుంటే ఇష్టమొచ్చినట్లు చెప్పవచ్చు. ఇది పద్ధతి కాదు. అధికారంలో ఉన్నారా, బయట ఉన్నారా అనవసరం. మీరు విషయాన్ని, వాస్తవాన్ని చూడండి, తర్కాన్ని ఉపయోగించండి, అనుభవాన్ని చూడండి, ఇతరులు ఏం చేస్తున్నారో చూడండి, బుద్ధిని ఉపయోగించండి, పరిష్కారాన్ని అన్వేషించండి. అది ప్రగతికి మార్గం. అంతేగానీ, గుడ్డెద్దు చేల్లో పడ్డట్టుగా ప్రతిపక్షంలో ఉంటే ప్రతిదానికీ నో, అధికారంలో ఉంటే ఎస్. ప్రతిపక్షంలో ఉంటే డిమాండ్ చేసేస్తాం, అధికారంలో ఉంటే సాధ్యం కాదు. ఇవి దగాకోరు రాజకీయాలు. మన్మోహన్‌సింగ్ గారు ఆర్థికవేత్త. రైతుల హృదయం ఉన్న మనిషి. ఆయన పంజాబ్ నుంచి వచ్చారు. భారతదేశంలో వ్యవసాయాన్ని కాదనేవాళ్లు, ప్రేమించనివారు ఎవరూ ఉండరు. కానీ వ్యవసాయానికి ఏం చేయాలనేది చాలా సంక్లిష్టమైన అంశం. ఉదాహరణకికి 40-45% జనాభా ఇప్పటికీ వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ప్రపంచంలోని పెద్ద దేశాల్లో అతి ఎక్కువ సంఖ్య వ్యవసాయం మీద ఆధారపడివున్నది భారతదేశంలో. మరి ఇంతమందిని వ్యవసాయంలో వచ్చే ఆదాయం పోషించలేదు. వ్యవసాయ ఆదాయం పడిపోతోంది. ఎందుకని? మన ఒంటి మీద చూడండి. మనం వాడే వస్తువులు, మన మొత్తం ఖర్చులకి, తిండి ఖర్చు, మిగతా ఖర్చు ఎంతో ఒకసారి ఆలోచించండి. కాస్త మన ఆదాయాలు పెరగ్గానే తిండి ఖర్చు నూటికి రూ.10 కూడా ఉండదు. ఈ బట్టల ఖర్చు, కళ్లజోడు, వాచీ, మొబైల్ ఫోన్, కెమెరా, ఇంటి ఖర్చు మొదలైనవి మిగతా ఖర్చు. ఆర్థిక వ్యవస్థ ఆదాయవ్యయాలు కూడా అంతే.

అదేసమయంలో వ్యవసాయం చాలా కీలకమైన అంశం. లేకపోతే ప్రాణం పోతుంది. ప్రాణం పోతుందని వ్యవసాయం, ఆహారం ఒక్కటే చాలదు మనకి. జీవితంలో చాలా అవసరాలున్నాయి మనకి. దాంతో, ఇతర దేశాల్లో ఏం చేశారూ, ఇతర రంగాల్ని బాగా పెంచి, వ్యవసాయం నుంచి వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి కల్పించారు. అందుకే అమెరికాలోనో, యూరప్‌లోనో నూటికి ముగ్గురే వ్యవసాయంలో ఉన్నారు. మన దేశంలో 40, 45 మంది ఉన్నారు. ఆ ముగ్గురిని ఎవరన్నా కాపాడాలంటే మిగిలిన 97 మంది తేలిగ్గా వాళ్లకి సాయం చేయవచ్చు. 40-45 మంది 55 మందికి సాయం చేయాలంటే, అసలే పేద దేశం, మనదేమీ డబ్బున్న దేశం కాదు, మరింత కష్టమవుతోంది. కాబట్టి ఒడుపుగా చేయాలి. కచ్చితంగా వ్యవసాయానికి సాయం అందాలి. నా జీవితమంతా దాని కోసమే పోరాడాను. కానీ ఆ సాయం విజ్ఞతతో అందాలి, వ్యవసాయంలో ఆదాయాలు పెరిగే రీతిలో అందాలి. వ్యవసాయం తన కాళ్ల మీద తాను నిలబడే రీతిలో అందాలి. అలాకాకుండా గుడ్డిగా చేసినట్లయితే వ్యవసాయం నాశనమవుతుంది, దేశమూ నాశనమవుతుంది, అందుకే ఆర్థికవేత్తలు, వ్యవసాయాన్ని ప్రేమించేవాళ్లు మాట ఒక రకంగా ఉంటుంది, ఊరికే ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి తాత్కాలిక మాయ చూపెట్టేవాళ్ల భాష ఇంకోరకంగా ఉంటుంది. రైతులకి

నిజమైన మిత్రులెవరో రైతులు గమనించాలి. అలాగే ఇది పార్టీల మధ్య పోరాటంగా చేస్తే దేశం నాశనమైపోతుంది. నేను పత్రికల్ని, ఆలోచించేవాళ్లని మనసారా కోరుతున్నాను. అలాగే రాజకీయ పార్టీలకు బాధ్యత ఉన్నది. చట్టసభలకు బాధ్యత ఉన్నది, ఊరికే నినాదాలు చెప్పొద్దు. గుడ్డెద్దు చేలో పడ్డట్లుగా మాట్లాడొద్దు. పడికట్టు పదాలు వాడొద్దు. తర్కం ఉపయోగించండి, వాస్తవాల ఆధారంగా చూడండి. ఏ రకంగా వ్యవసాయాన్ని బాగుచేయాలి, ఏ రకంగా దాన్ని గట్టెక్కించి రెంటినీ సమన్వయం చేయాలి, ఏ రకంగా తాత్కాలిక సాయం ఇవ్వాలి? ఒక పేద దేశంలో తాత్కాలిక సాయం అవసరం. సంక్షేమం అవసరం. కానీ సంక్షేమం ఒక్కటే పరిపాలన అయితే దేశం ఎల్లకాలం నిరుపేద దేశంగా మిగిలిపోతుంది. అభివృద్ధి అవసరం, పెట్టుబడులు అవసరం. రెంటినీ ఎలా సమన్వయం చేయాలి? దీనికి పెద్ద తెలివితేటలు కూడా అక్కర్లా. కాస్త తెలివితేటలున్న ప్రతి కుటుంబం చేసే పనే అది. దేశంలో కూడా ఆ పనే కావాలి. ప్రభుత్వం నాది కాదు గదా, నాదేం పోయింది, నా సొంతం కాదు  గదా, నాశనమైతే నాదేం పోయిందంటే నాశనమవుతోంది, అందరికీ నాశనమవుతుంది. మన వేళ్లతో మన కళ్లు పొడుచుకుంటున్నాం.

**రైతుల డిమాండ్లలో ఇంకొక ముఖ్యమైన డిమాండ్ రుణమాఫీలు. గతంలో, ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ వాళ్లు రుణమాఫీ ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో రుణమాఫీ హామీ జాతీయ స్థాయిలో ఒక ప్రధాన పార్టీ తీసుకొస్తుందనేది కొందరి అభిప్రాయం. అసలు రుణమాఫీ రైతులకు ఉపయోగ పడుతుందా?**


జేపీ: నేను మళ్లీ రైతుల పక్షపాతిగా చెబుతున్నా. సహకార బ్యాంకు ఎం.డిగా పనిచేసినవాడుగా చెబుతున్నా. రైతులకు కావలసింది సకాలంలో, సజావుగా రుణాల ఏర్పాటు. సరసమైన వడ్డీకి అందించాలి. సకాలంలో చెల్లిస్తే కాస్త వడ్డీ మీద రాయితీ ఇద్దాం. సకాలంలో చెల్లించేందుకు ప్రోత్సాహకాలు ఇద్దాం. కానీ సకాలంలో అందే ఏర్పాటు చేద్దాం. ఇందాక చెప్పాను, అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అని. మీరు పత్తి ఉత్పత్తి చేస్తే, పసుపు ఉత్పత్తి చేస్తే, మార్కెట్‌లో రేటు సరిగా లేని సందర్భాల్లో నిల్వ ఉండే అవకాశం లేకుండా చేశారు. అక్కడ పరపతి ఇవ్వండి. ఆ పరపతి లేక కుటుంబాలు నాశనమవుతున్నాయి, వ్యవసాయం నాశనమవుతోంది. అంతేగానీ, రైతుల్ని రుణగ్రస్తుల్ని చేసి వాళ్లని చంపేసి చచ్చిన తర్వాత శవాల మీద కన్నీళ్లు కార్చటం, శవ రాజకీయం చేయటం, లేకపోతే, రుణమాఫీ చేస్తామని దేశాన్ని భ్రష్టుపట్టించటం పరిష్కారం కాదు. ఎన్నిసార్లు మాఫీ చేశాం మనం? చౌధురి దేవీలాల్ 1980, 90ల్లో రుణమాఫీ చేశాడు. ఆ నేపథ్యంలో నేను సహకార బ్యాంకు ఎం.డిగా వచ్చాను. రూ.100 మార్కెట్‌లోకి రుణం ఇస్తే రూ.8 తిరిగొచ్చేది. రూ.92 బకాయిలు. బ్యాంకు సర్వనాశనం, నా ప్రాణమంతా పెట్టి సహకార సంఘాల నాయకులందరినీ కులాలు, ప్రాంతాల కతీతంగా కూర్చోబెట్టి వారందరి సహకారంతో మళ్లీ బ్యాంకును గట్టెక్కించాను. రుణమాఫీలు ఆ తర్వాత 98లో చేశారు. రాష్ట్రాల్లో కొన్ని చోట్ల చేశారు. మళ్లీ చేస్తామని హామీలిచ్చారు. దీనికి అంతం లేదు. రుణమాఫీలు చేస్తూ ఉంటే, క్రెడిట్ పుట్టదు. చివరికి ఏమవుతుంది, ఒకసారి మాఫీ అనగానే బ్యాంకులకు మీ మీద నమ్మకం పోయింది. డబ్బులు ఇవ్వటంలా. డబ్బులున్నవాళ్లకి ఇస్తున్నారు. బాగా పొలం ఉన్నవాడు, మంచి పంటలు వేస్తాడు, వాడి దగ్గరుంటే పర్లేదని వాడికి ఇస్తున్నారు. రైతుల బతుకు ఇట్లాగే ఉంది. దినదినగండం, నూరేళ్ల ఆయుషు. ఈ పూట ఎట్లా, ఈ పూట గండం గడిచింది, వంద రూపాయలు వచ్చింది అనుకోవటం తప్పితే మన బతుకులు పెరగాలంటే ఏం చేయాలనే ఆలోచన కరువైంది. రైతుల డిమాండ్ కోసం కూడా వెయిట్ చేయకుండా పార్టీలే ఎలాగొలా ప్రజల్ని లొంగదీసుకునేలా వ్యవహరిస్తున్నాయి. సమాజం సర్వనా శనమవుతున్నా సరే, నాలుగు ఓట్లు వస్తే చాలని ఆలో చిస్తున్నారు. రైతుల ప్రయోజనాల గురించి ఆలోచించటంలా. రైతులకి సకాలంలో, సరైన రీతిలో, సరసమైన వడ్డీకి రుణం వచ్చే ఏర్పాటు కావాలి గానీ, చీటికిమాటికీ రుణమాఫీ అంటే బ్యాంకింగ్ వ్యవస్థ నాశనమవుతుంది. చాలా అధ్వాన్న స్థితిలో ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. ఏడెనిమిదేళ్ల క్రితం బ్యాంకుల్లో వంద రూపాయలకు రూ.12 బకాయిలున్నాయి. నష్టాల్లో ఉన్నాయి చాలా బ్యాంకులు. ఇప్పుడు ఒక స్థాయికి తీసుకొచ్చాం. మళ్లీ రుణమాఫీ అంటే, వ్యవసాయాన్ని నాశనం చేయటం, ఆర్థిక వ్యవస్థను కుప్ప కూల్చటం. రైతులేం బాగుపడరు. బాగుపడితే ఇన్నేళ్లలో బాగుపడాలిగా? అదే ఇప్పుడు, మార్కెట్ రేటు కంటే ఎక్కువ రేటుకి విధిగా మేం కొంటాం, ఎలా అమలు చేస్తారో మాకు తెలియదు, రుణమాఫీ చేస్తాం అంటున్నారు. ఇవన్నీ చేశాం. ఒకసారి కాదు, చాలాసార్లు చేశాం. ఏం జరిగింది? వ్యవసాయం ఎందుకు కష్టాల్లో ఉంది? ఇదే పరిష్కారం అయితే వ్యవసా యంలో పూలు వికసించాలి గదా, వ్యవసాయం పండుగలా ఉండాలి గదా! వ్యవసాయంలో ఇంత కష్టాలు, కన్నీళ్లు ఉండకూడదు గదా! ఎందుకున్నాయి? మీ విఫల విధానాల వల్ల. అవే కొనసాగించమని పాడిందే పాటరా పాచిపళ్ల దాసుడా ఏమిటి? వ్యవసాయంలో రేటు వచ్చే మార్గముంటే చెప్పు, వ్యవ సాయంలో ఆదాయం పెరిగే మార్గమేంటో చెప్పు. రైతులు శాశ్వతంగా కన్నీళ్లు కార్చకుండా కీలకమైన వాతావరణాన్ని సృష్టించటమెట్లాగో చెప్పు. మంచి విద్య అందించకుండా, పిల్లల ఫీజుల కోసం డబ్బులు ఖర్చు పెట్టే అవసరం లేకుండా చేయి. పిల్లల ఫీజుల కోసం ప్రతి కుటుంబం ప్రతి సంవత్సరం 50–60 వేల దాకా ఖర్చు పెడుతున్నాయి. ఆరోగ్యం సరిగా అందక కుటుంబాలు గుల్లయిపోతున్నాయి. అసలు చేయాల్సిన పని చేయటంలా. రుణగ్రస్తుల్ని చేస్తోంది ప్రభుత్వాలు, రైతు నడ్డి విరు స్తోంది మీరు, మీ విధానాలు. రైతుకి రేటు లేకుండా చేస్తున్నారు. ఇవన్నీ కాదని ఒక్కళ్లనయినా గుండె మీద చేయి వేసుకుని చెప్ప మనండి. రైతుల్ని నాశనం చేసి ఆ తర్వాత మలాం పూస్తున్నాం. ఇవన్నీ ఇప్పటికైనా ఆపండి, రైతులు ధైర్యంగా నిలబడే ఏర్పాటు చేయండి, అందుకు పద్ధతులున్నాయి, అవే చెప్తున్నాను. ❖

# వ్యవసాయ రంగం : తప్పు ఎక్కడ జరిగింది?

సుమేధా కూరపర్తి

మన దేశంలో వ్యవసాయ సంక్షోభం, రైతుల కష్టాల గురించి చాలా చర్చ జరుగుతుంటుంది, కానీ నిజంగా ఆ సంక్షోభాన్ని అర్థం చేసుకోవటం చాలా అరుదు. అందుకే సానుభూతి ఉన్నా సమస్య పరిష్కారం కావటం లేదు. భారతదేశంలో వ్యవసాయ సంక్షోభం విచారకరమైన వాస్తవం. కొన్ని దశాబ్దాలుగా ఆ పరిస్థితులను మార్చటంలో విఫలమయ్యాం. ఇప్పుడు ఢిల్లీ చుట్టూ కొనసాగుతున్న రైతుల ఆందోళనలు అందుకు అద్దం పడుతున్నాయి.

ఈ సంక్షోభం వెనుక ప్రధాన కారణం, వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్నవారికి తగిన ఆదాయాన్ని అందించలేకపోవటం. 2022–23లో భారతదేశ స్థూల దేశీయ ఉత్పత్తి (జిడిపి) రూ.297 లక్షల కోట్లు. అంటే సగటు వార్షిక తలసరి ఆదాయం రూ.1,97,000. అయితే కాస్త లోతుగా పరిశీలిస్తే రైతాంగం దుస్థితి స్పష్టమవుతుంది. జాతీయ ఉత్పత్తిలో కేవలం 15%, అంటే రూ.44.5 లక్షల కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాల నుండి వస్తుంది. జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని పరిగణలోకి తీసుకుంటే, వ్యవసాయ ఆదాయంపై ఆధారపడిన వ్యక్తి సగటు వార్షిక ఆదాయం కేవలం రూ.7,000. జాతీయ సగటులో కేవలం 3.6%. వ్యవసాయం జీవనోపాధి కల్పించలేకపోతోంది.



పరిష్కారాలు చాలా సూచించారు. అయితే, వాటిలో కొన్ని ఫలితాలనిచ్చేవి, కొన్ని కచ్చితంగా ఇవ్వవు. ఈ సంక్షోభం నుండి బయటపడటం అసాధ్యం కాదు. సంక్షోభానికి మూలాలు ఎక్కడ ఉన్నాయో గుర్తించి పరిష్కరించటంలో ప్రభుత్వ పాత్ర ఏమిటో ముందు మనం అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం నిర్వర్తించాల్సిన సరైన పాత్ర గురించి పూర్తి స్పష్టత లేకుండా ప్రభుత్వ విధానం ద్వారా జోక్యం చేసుకోవటానికి ప్రయత్నించినట్లయితే, అది అసమర్థ ఫలితాలను ఇవ్వటమే కాకుండా సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నకొద్దీ, జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయరంగం వాటా తప్పనిసరిగా తగ్గుతుంది. వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా, మార్కెట్ ఆధారితంగా మార్చటం తక్షణ అవసరం. అదే సమయంలో, ఈ రంగంలో ఉపాధి తగ్గుతున్నందున మన కార్మికులు వ్యవసాయం నుండి ఇతర రంగాలకు సజావుగా మారటానికి కూడా ప్రణాళిక వేయాలి.

**సమస్య ఎక్కడ ఉంది?**

సమస్యను రెండు రకాలుగా విభజించవచ్చు – ఉత్పత్తి స్థాయి, ఉత్పత్తి తర్వాత స్థాయి. ముందుగా ఉత్పత్తి దశలో ఉన్న కొన్ని ప్రధాన సవాళ్లను చూద్దాం. చిన్న కమతాలు, ముక్కలుగా ఉన్న వ్యవసాయ భూముల కారణంగా రైతులు పెద్దఎత్తున ఉత్పత్తి చేయలేకపోతున్నారు, ఖర్చులను తగ్గించుకోలేకపోతున్నారు. భారతదేశంలో సగటు పొలం పరిమాణం ఇప్పుడు 1.08 హెక్టార్లకు పడిపోయింది. అయితే, సగటు పొలం పరిమాణం బలమైన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలైన మెక్సికోలో 20 హెక్టార్లు కాగా, బ్రెజిల్‌లో 64 హెక్టార్లు. ఆ దేశాల్లో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న కార్మికుల వాటా చాలా తక్కువ – మెక్సికోలో 13%, బ్రెజిల్‌లో 9%.

మన దేశంలో కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, అధికారిక రుణాలు ఇప్పటికీ రైతుల్లో చాలామందికి అందుబాటులో లేవు. అందువల్ల, రైతులు అనధికార రుణదాతలపై ఆధారపడవలసి వస్తోంది. రైతులు చాంతాడంత పొడవున్న, అసమర్థమైన సరఫరా గొలుసులో మొదటగా ఉండే అనధికార వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తోంది. ఇతర చోట్ల ఎక్కువ ధర లభిస్తున్నప్పటికీ, అప్పులపాలైన రైతులు తమ ఉత్పత్తిని రుణం ఇచ్చినవాళ్లకి తెగనమ్ముకోవాల్సి వస్తోంది.

విత్తనాలు, ఎరువులు, నీటిపారుదల, విద్యుత్ వంటి ఇతర పెట్టుబడి అవసరాలపై ప్రభుత్వం చాలా కాలంగా సబ్సిడీలను అందిస్తోంది. ఈ విధానాలు సరైనవా, కాదా, ఎంత సమర్థవంతంగా అమలవుతున్నాయి అనే విషయాల్ని పక్కనపెడితే, వాటి వల్ల రైతులకు ఎలాంటి నష్టం జరగటం లేదు. అనేక ఇతర సవాళ్లు ఉన్నప్పటికీ, ఆహారధాన్యాలలో దేశం స్వయంసమృద్ధి సాధించటానికి అవసరమైన ఉత్పత్తి మన రైతులు చేయగలుగుతున్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ రైతులు పండిస్తున్న ఉత్పత్తులకు అధిక ధరలు లభించకపోవటం అసలైన విషాదం. ఉత్పత్తి తర్వాత స్థాయిలో వ్యవసాయోత్పత్తుల గురించి రెండు రకాలుగా మనం పరిశీలించాలి – కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) పంటలు వర్సెస్ ఎంఎస్‌పియేతర పంటలు/ప్రభుత్వ సేకరించే పంటలు వర్సెస్ సేకరించని పంటలు.

ప్రభుత్వం సేకరించని పంటలతో ప్రారంభిద్దాం. పండ్లు, కూరగాయలు, ఎంఎస్‌పి పరిధికి వెలుపల ఉన్న పంటలు, అదేవిధంగా ఎంఎస్‌పి పరిధిలో ఉన్నా పెద్దమొత్తంలో సేకరించని పంటలు. ఈ పంటల విషయంలో రైతులు రెండు కోణాల్లో సవాలును ఎదుర్కొంటున్నారు – అసమర్థమైన చాంతాడంత సరఫరా గొలుసులు, తమకు నచ్చిన మార్కెట్‌లో

విక్రయించుకునే స్వేచ్ఛ లేకపోవటం! సరఫరా గొలుసులు ఒకేతీరుగా ఉండవు. అవి పంటపై, సాగు ప్రాంతం, వినియోగదారుల మధ్య ఉండే దూరంపై ఆధారపడి ఉంటాయి. ఆధునిక సాంకేతికతతో ఈ సరఫరాను మరింత సమర్థవంతం చేయవచ్చు. తద్వారా వినియోగదారులు చెల్లించే ధరలో అధిక వాటా దళారులకు పోకుండా రైతుకే దక్కుతుంది. అదొక్కటే కాకుండా, చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలో చట్టబద్ధంగా ఆమోదించబడిన వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీల (ఏపీఎంసీ) గుత్తాధిపత్యం పోటీని అణగదొక్కి, రైతులకు ఎక్కువ ధర లభించకుండా చేస్తోంది.

దేశంలో తగినన్ని గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీ, ఇంకా ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు లేకపోవటం వల్ల రైతులు తమ ఉత్పత్తికి అత్యుత్తమ ధర పొందలేకపోతున్నారు. నిల్వ సౌకర్యాలు ఉంటే, ధరలు తక్కువగా ఉన్న సందర్భాల్లో ధరలు పెరిగే వరకు వేచి ఉండే వీలు కలుగుతుంది, రైతు ఆదాయం పెరుగుతుంది. ఆ అవకాశం లేక, రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తెగనమ్ముకొని నష్టపోవాల్సి వస్తోంది. ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా జరిగే విలువ జోడింపు వల్ల ఆహార పదార్థాలు ఎక్కువ కాలం నిల్వ ఉండి ధర గణనీయంగా పెరుగుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ విలువను పెంపొందించటంలో సరైన గ్రేడింగ్, ప్యాకేజింగ్ వంటి సాధారణ ప్రక్రియలు కూడా చాలా ఉపయోగపడతాయి. ఈ ఏర్పాట్లు లేకపోవటంతో వ్యవసాయ ఉత్పత్తిలో ఎక్కువ భాగం వృథా అవుతోంది లేదా నష్టానికి తెగనమ్ముకోవాల్సి వస్తోంది.

మనం ప్రధాన సేకరణ పంటల విషయానికి వస్తే, ప్రస్తుత రూపంలోని ఎంఎస్‌పి వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోంది. ఎంఎస్‌పి ఒక భరోసాగా కాకుండా ఇప్పుడు మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉంటోంది. ఎంఎస్‌పి పరిధిలోని ప్రధాన పంటలు వరి, గోధుమలు. ఈ రెండింటి వినియోగం స్పష్టంగా తగ్గుతోంది. ఇటీవల విడుదల చేసిన గృహ వినియోగ వ్యయ సర్వే 2022-23 ప్రకారం, ఒక కుటుంబం ఆహారంపై ఖర్చు చేసే మొత్తం డబ్బులో తృణధాన్యాలు, పప్పుల వాటా 2004-05లో గ్రామీణ ప్రాంతాల్లో కూడా, 39% నుండి 2022-23లో 15%కి పడిపోయింది. అదే సమయంలో, పాలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, మాంసంపై వ్యయం వాటా 36 నుండి 48%కి పెరిగింది. తృణధాన్యాలు, పప్పుల వినియోగం తగ్గిందని ఈ ఫలితాలు కచ్చితంగా తేల్చిచెప్పనప్పటికీ, డిమాండ్ ఎక్కడ పెరుగుతోందో ఒరవడిని స్పష్టంగా చూపుతున్నాయి.

ఎంఎస్‌పి విధానం కొన్ని ప్రతికూల పరిణామాలు - మార్కెట్ డిమాండ్‌తో ఎలాంటి సంబంధం లేకుండా పంటల అధిక ఉత్పత్తి, దిగుబడి మొత్తం కొనుగోలు చేయటం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి, మరోవంక గిరాకీ ఉన్న ఇతర వస్తువులను ఉత్పత్తి చేయకపోవటం, సరఫరా సరిపోక డిమాండ్ ఉన్న ఉత్ప






# ఏపీలో కుల, మతతత్వాలు పెరిగాయి

ఆంధ్ర ప్రాంతంలో ఒకప్పుడు మంచి వాతావరణం ఉండేదని, ప్రస్తుతం కుల, మతతత్వాలు పెరిగిపోయాయని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. స్థితప్రజ్ఞత గల పట్టాభిరామయ్య వంటి వారిని యువ వైద్యులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ పట్టాభి. రామయ్య 50 ఏళ్ల వైద్య వృత్తి ప్రస్థానం పూర్తిచేసిన సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టాభి రామయ్య సంకల్పానికి, ఆలో చనకు, సేవకు వృద్ధాప్యం లేదని, కృష్ణాజిల్లాకు, నగరానికి వన్నె తెచ్చారని జేపీ అన్నారు. ప్రస్తుత రాజకీయాలు అత్యంత విచారకరంగా ఉన్నాయని, పదవుల కోసం పార్టీలు ఫిరాయిస్తున్నారని, ప్రజాదరణ కోల్పోయినా డబ్బు సంచులతో అధికారంలోకి వస్తున్నారని కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి రమణ ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, నైతిక విలువలు గల పట్టాభిరామయ్య లాంటి వ్యక్తులు ముందుకొచ్చి ఏమైనా చేయాలని విజ్ఞప్తి చేశారు. తాను ఈ స్థాయికి రావటం వెనక పట్టాభిరామయ్య పాత్ర ఎంతో ఉందన్నారు. నిబద్ధత, నిజాయతీ గల పరి పూర్ణుడు పట్టాభి రామయ్య అని మాజీమంత్రి కామినేని శ్రీని వాస్ ప్రశంసించారు. చేసే పని ఏదైనా నిబద్ధతతో, నిక్కచ్చిగా చేయాలని పట్టాభిరామయ్య అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, కార్యక్రమ కమిటీ సభ్యుడు బి.ఎస్.కోటేశ్వరరావు, పట్టాభిరామయ్య మిత్రబృందం, వైద్యులు పాల్గొన్నారు.

త్తుల ధరలు పెరగటం. అందువల్ల ఎంఎస్‌పి మన వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం కాదు, దీన్ని క్రమంగా తొలగించాలి.

**మనం ఏం చెయ్యాలి?**

వ్యవసాయ సంస్కరణల అంతిమ లక్ష్యం రైతుల ఆదాయాన్ని, వారి జీవన ప్రమాణాలను హేతుబద్ధమైన, స్థిరమైన పద్ధతిలో పెంచటం కావాలి. ఈ సంస్కరణల వల్ల సమాజంలోని అన్ని వర్గాలూ లబ్ధిపొందేలా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వ పాత్ర కీలకమైనప్పటికీ పరిమితమయినది. అవసరమైన ఇన్‌పుట్ మద్దతును అందించటంతోపాటు, ప్రభుత్వం స్వయంగా సృష్టించిన కొన్ని సమస్యలను సరిదిద్దాలి. బూజుపట్టిన నియంత్రణాధికారాలను ఇష్టారాజ్యంగా వినియోగించటం వ్యవసాయ మార్కెట్‌లో ప్రయివేటు రంగం ప్రవేశానికి అవరోధమవుతుంది. నిత్యావసర సరకుల చట్టం కింద వ్యవసాయోత్పత్తుల నిల్వకు పరిమితులను విధించటం ఇందుకు విధానపరమైన ఓ ఉదాహరణ. ఆ చట్టం పరిష్కారం కాకపోగా, మరింత ధరల అస్థిరతకు కారణమవుతోంది. ఏపీఎంసీ గుత్తాధిపత్యం కారణంగా ప్రయివేటు మార్కెట్ అవకాశాలు పరిమితం కావటం మరొక ఉదాహరణ.

ప్రైవేట్ రిటైల్ చెయిన్లు మార్కెట్‌లోకి ప్రవేశించేలా ప్రోత్సహించటానికి ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లపై ఆంక్షలు తొలగించాలి. అలాగే ఉత్పత్తుల నిల్వపై ఆకస్మిక పరిమితులను విధించకూడదు. ప్రైవేట్ వ్యాపారుల ప్రవేశం అంటే – కొనుగోలుదారుల మధ్య ఎక్కువ పోటీ, పరిమితమైన, మరింత సమర్థవంతమైన సరఫరా గొలుసులు, మెరుగైన గ్రేడింగ్, ప్యాకేజింగ్ సేవలు, ఆహార ప్రాసెసింగ్ సౌకర్యాలు అభివృద్ధి చెందటం, చివరకు రైతులకు మరింత మెరుగైన ధర లభించటం. అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకి సంబంధించిన విధానం హేతుబద్ధంగా, స్థిరంగా ఉండాలి. అటువంటి విధానం వల్ల వ్యవసాయంలో ఎగుమతులకు ఉన్న అపారమైన అవకాశా లను సద్వినియోగం చేసుకునేందుకు ప్రోత్సాహకం లభించి ప్రైవేట్ వ్యాపారులు ముందుకొస్తారు. కాలక్రమేణా, రైతులు ప్రభుత్వంపై ఆధారపడటం తగ్గుతుంది, ఎంఎస్‌పిని దశలవారీగా తొలగించటానికి అవకాశం కలుగుతుంది. చివరిగా, వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం కేవలం వ్యవసాయంలోనే లేదు. వ్యవసాయాన్ని మెరుగు పరచటానికి ప్రభుత్వం, సమాజం ఎలాంటి చర్యలు తీసుకు న్నప్పటికీ, జాతీయ ఉత్పత్తిలో ఆ రంగం వాటా, ఉపాధి కల్పించే సామర్థ్యం అనివార్యంగా పడిపోతుంది. కాబట్టి వ్యవసాయంపై ఆధారపడినవారిలో చాలామందికి ఇతర రంగాలలో పని చేయటానికి అవసరమైన నైపుణ్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. కోట్లాది భారతీయుల జీవితాలను మెరుగుపరిచే కృషిలో భాగంగా ఆ భవిష్యత్తు కోసం ప్రణాళిక వేయాలి. ❖


## Form IV

Statement about ownership and other particulars about Monthly magazine **Janabalam**

1.Place of Pubilcation : Hyderabad

2.Periodicity of its pubication : Monthly

3. Printers
a. Name : Dr. Jayaprakash Narayan
b. Nationality : Indian
c: Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

4. Publisher's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

5. Editior's Name : Dr.Jayaprakash Narayan
Nationality : Indian
Address : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jaya prakash Narayan, National Co ordinator , H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082

I, Dr. Jaya prakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jaya prakash Narayan
Signature of the Publisher

# ఉచిత బస్సు ప్రయాణం - మహిళా సాధికారత




తెలంగాణలో కొత్త ప్రభుత్వం వచ్చాక ఎన్నికల హామీ మేరకు ఆర్.టి.సి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసింది. ఈ హామీని స్వాగతించినవారు కూడా ఆ తర్వాత బస్సుల్లో రద్దీ చూసి అవాక్కయ్యారు. పర్లేదులే, ఓ నాలుగైదు వారాలయ్యాక ఉత్సాహం తగ్గి వారి సంఖ్య అంతకుముందులాగే ఉంటుందని పలువురు భావించారు. కలెక్షన్లు తగ్గిపోవటంతో కంగుతిన్న కండక్టర్లు కూడా అలాగే సర్దిచెప్పుకునేవారు. కానీ ఉన్నకొద్దీ మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరగటం, కేవలం మహిళలకు ప్రత్యేకించిన సీట్లకు పరిమితం కాకుండా వెనక సీట్లలోకి వచ్చి కూర్చోవటం, పురుషుల్లా ఫుట్‌బోర్డు ప్రయాణం ప్రయాణాలు చేస్తుండటంతో అసహనం పెరిగింది. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల బస్సులు ఎక్కే పరిస్థితి లేదు, పురుషుల సీట్లను కబ్జా చేస్తున్నారని రోజూ బస్సుల్లో వాదోపవాదాలు సాధారణమయ్యాయి. అర్థపర్థంలేని రీతిలో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నారని పురుష ప్రయాణీకులు తరచూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంస్థ ఎండీ సజ్జనార్ దగ్గరకు వెళ్లి తేల్చుకుందామనుకునేదాకా కొన్ని బస్సుల్లో మహిళలు గొడవపడ్డారు. ఐడీ చూసి జీరో టికెట్ కొట్టటానికి సమయం పట్టటం, ఆదాయాలు తగ్గటంతో కండక్టర్లలోనూ విసుగు మొదలైంది. ఉచితం కావటం వల్ల మహిళలు పనిలేకున్నా చుట్టాల ఇళ్లకు, గుళ్లూగోపురాలకు వెళుతున్నారని, వీళ్లతోపాటు కుటుంబసభ్యులు కూడా వెళ్తుండటం వల్ల ఆఫీసులకు సెలవు పెట్టే పురుషుల సంఖ్య పెరిగిందని కొందరంటున్నారు. ఇక సోషల్ మీడియాలో మీమ్స్ ఎకసెక్కాల గురించి చెప్పనక్కర్లేదు. ఎవరడిగారని ఈ ఉచిత ప్రయాణం పెట్టారు?

ఉచితం కొందరికే పరిమితం చేస్తే బాగుండేదని కొందరు మహిళలు సైతం అంటున్నారు. బయట అర్జంటు పని ఉండి చాలాసేపు బస్సు దొరక్క ఇబ్బందిపడ్డ ఓ మహిళ, ఓ కండక్టరన్నా, కలెక్షన్లు లేవు కదా, కనీసం జీతాలన్నా ఇస్తున్నారా? అని అడిగారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినవారిపై విధించిన పెనాల్టీ చలాన్ల డబ్బు రాయితీ ఇవ్వటం వల్ల పెద్దసంఖ్యలో ప్రజలు డబ్బు చెల్లించారని, అందువల్ల వచ్చే నెల జీతాలకు ఢోకా ఉండకపోవచ్చని కండక్టర్ జవాబిచ్చాడు. అసలా ట్రాఫిక్ ఉల్లంఘనలకు రాయితీ ఇవ్వటమే చట్టవిరుద్ధ పాలన, ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించినట్లు, ఆ డబ్బు లేకపోతే జీతాలు అందకపోయే పరిస్థితి రావటం చూస్తే ఖజానా పరిస్థితితోపాటు పాలన చేస్తున్న తీరుకు అద్దం పడుతుంది.

ఈ సమస్యల్ని అలా ఉంచితే, మహిళల ఉపాధి అవకాశాలకు, వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి ఉచిత బస్సు సదుపాయం ఏమైనా ఉపయోగపడుతోందా? అన్నది కీలక ప్రశ్న. ఉచిత ప్రయాణానికి మద్దతిచ్చినవారిలో కూడా ఎక్కువ మంది ఈ కోణంలోనే సమర్థించారు. దీని వల్ల మహిళల్లో స్వావలంబన పెరుగుతుందని, ప్రయాణాలు పెరగటం వల్ల వారి ఆత్మవిశ్వాసం ఇనుమడించటంతోపాటు భద్రతకు అవకాశాలు మెరుగవుతాయి, ఆర్థిక అవకాశాల్ని అందుకోగలుగుతారని వారు ఆశించారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల రోజువారీ సామాజిక జీవనంలో మహిళల విజిబిలిటీ పెరిగింది. అరవై రోజుల్లో 15.21 కోట్ల మంది ఉచిత ప్రయాణం చేశారని ప్రభుత్వం తెలిపింది. వీరిలో ఎంతమంది ఆర్థిక ఉత్పాదక అవకాశాల కోసం ఉచితాన్ని సద్వినియోగం గావించుకున్నారనే అంచనాలు లేవు. కొంత సమయం తర్వాత ఈ లెక్కలు తేలినా కూడా, సంపదసృష్టి వ్యవస్థలో మహిళల పాత్రను పెంచటానికి తెలంగాణలో, దేశంలో చేయాల్సింది చాలా ఉందని ప్రస్తుత పరిస్థితి హెచ్చరిస్తోంది.

మన దేశంలో పనిచేసేవారిలో మహిళల భాగస్వామ్యం కొవిడ్ కాలంలో తగ్గినా ఇటీవల గణనీయంగా పెరిగిందని, 2022-23లో 37 శాతానికి చేరుకుందని కార్మిక శక్తి నిర్ణీత కాలావధి సర్వే తెలిపింది. అయితే ఇప్పటికీ ఈ సంఖ్య 30 శాతంలోపే ఉందని, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ కార్మిక సంఘం అంచనాలు పేర్కొంటున్నాయి. శ్రామిక మార్కెట్‌లో మహిళల భాగస్వామ్యం రేటు (ఎఫ్‌ఎల్‌ఎఫ్‌పీఆర్) అంతర్జాతీయ సగటు కంటే కూడా చాలా తక్కువ ఉన్నట్లు తెలిపింది. 2000 సంవత్సరానికి ముందు మహిళల వాటా 31 శాతం దాకా ఉండగా, 2019 నాటికి 21 శాతానికి తగ్గింది. కొవిడ్ తాకిడికి గురయ్యాక 18.6 శాతానికి దిగజారిందని ప్రపంచ బ్యాంకు తెలిపింది. ది గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ ఆఫ్ ది వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2021 నివేదిక ప్రకారం ఎఫ్‌ఎల్‌ఎఫ్‌పీఆర్‌లో

156 దేశాల్లో మనం 140వ స్థానంలో ఉన్నాం.

కొవిడ్ కాలం కంటే శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగిందనటంలో సందేహం లేదు. విద్యారంగంలో పెరిగిన అమ్మాయిల భాగస్వామ్యం ఉపాధిలోకి ప్రవేశించటం ఇటీవలికాలంలో పెరిగింది. ఉద్యోగాలు, వృత్తి నిపుణుల నెట్‌వర్క్ వెబ్‌సైట్ అప్నా.కో నివేదిక ప్రకారం, గతేడాది ద్వితీయ (టైర్ 2), తృతీయ శ్రేణి (టైర్ 3) నగరాల నుంచి ఉద్యోగాల కోసం మొత్తంగా 3.2 కోట్ల దరఖాస్తులురాగా, అందులో మహిళలవి ఒక కోటి దాకా ఉన్నాయి. టైర్ 2, టైర్ 3 నగరాల్లో సగటున నిముషానికి మహిళల నుంచి 100కి పైగా ఉద్యోగ దరఖాస్తులు వస్తున్నాయని, ఉద్యోగాల నియామక ధోరణుల్లో కీలక మార్పును ఇది తీసుకొచ్చే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. అంతేకాకుండా వీరిలో 80 శాతం మంది మహిళలు కార్యాలయాలకు వచ్చి ఉద్యోగం చేసే వాటి కోసమే దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపింది. ఇంటి నుంచి పనిచేయటం వల్ల ఉద్యోగ జీవితంలో ఉన్నతికి పరిమిత అవకాశాలు ఉండొచ్చనే భావనతో ఆ తరహా ఉద్యోగాలను తిరస్కరిస్తున్నట్లు తేలిందని పేర్కొంది. 2022, 2023లో తమ ప్లాట్‌ఫాంపై నమోదైన ఉద్యోగ దరఖాస్తులు, నియామక ప్రకటనలపై విశ్లేషణ ఆధారంగా నివేదికను అప్నా.కో రూపొందించింది. సేల్స్ సపోర్ట్, ఎంటర్‌ప్రైజ్ సేల్స్, ప్రకటనలు, స్థిరాస్తి, ఇన్‌సైడ్ సేల్స్, బ్రాండ్, మార్కెటింగ్, ఇ-కామర్స్ విభాగాల్లో మేనేజర్ ఉద్యోగ ప్రకటనలు పది రెట్లు పెరిగాయని నివేదిక తెలిపింది. అయితే ఇప్పటికీ కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం మనతో పోల్చదగిన చైనాలో సగం కూడా లేదు. మనతో ఏమాత్రం పోల్చలేని బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకబడి ఉన్నాం. ఎనిమిది వందల కోట్లకు చేరిన ప్రపంచ జనాభాలో భారత్ వాటాయే అత్యధికమని, వారిలో 49 శాతం మహిళలని అంచనా. అంటే సుమారు 70 కోట్లు. వీరిని శ్రమశక్తిలో భాగస్వాముల్ని చేయకుంటే, మన దేశాభివృద్ధి ఆశించిన స్థాయిలో సాధ్యం కాదు. దేశ జీడీపీలో మహిళల వాటా 17 శాతం మాత్రమేనని, అగ్రరాజ్యాలకు దీటుగా ఆర్థిక శక్తిగా ఎదగాలనుకుంటున్న భారత్ లక్ష్యానికి అది ప్రతిబంధకమవుతుందని ప్రపంచ బ్యాంకు విశ్లేషించింది. చైనాలో ఈ వాటా 40 శాతం దాకా ఉంది. ఆసియాన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అధ్యయనం ప్రకారం వచ్చే 25 ఏండ్లలో భారత మహిళలు పురుషులతో సమానంగా ఎదిగితేనే జీడీపీలో వారి భాగస్వామ్యం 60 శాతానికి చేరుకుంటుంది. కాబట్టి అమృత కాలమనండి, కర్తవ్య కాలమనండి, పేరు ఏదైనా 2047 నాటికి యువశక్తిని సద్వినియోగం గావించుకుని భారత్ ప్రపంచ శక్తిగా ఎదగాలంటే, శ్రమ సాంద్రతలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచాలి.

మన పురుషాధిక్య సమాజం, పెత్తందారీ రాజకీయం మాత్రమే కాదు ఇక్కడ సమస్య. ఆర్థికాభివృద్ధిలో మన విధానాలు, సంపాదన పట్ల ప్రతికూల దృక్పథం, సంపద పెంచటం, పంచటం మధ్య సమతుల్యత లేకుండా వ్యవహరించటం కూడా సమస్య. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజల డబ్బును పవిత్రంగా ఖర్చు చేయటం, సంపద పెంచటం, భవిష్యత్తు తరాలకు ఆస్తుల్ని సృష్టించటం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కావాలనే ఏకాభిప్రాయం మన దేశంలో ఇప్పటికీ లేదు. దీనికితోడు ఉపాధి అంటే ప్రభుత్వోద్యోగాలు అనే భ్రమను అన్ని పార్టీలూ ప్రచారం చేస్తున్నాయి. దీనివల్ల, ప్రభుత్వం పని ఉద్యోగాలివ్వటం కాదు, ఉపాధి సమాజం నుంచి వస్తుంది, సమాజానికి అవసరమైన సేవలందించటం ద్వారా ఉపాధి లభిస్తుంది అనే వాస్తవిక దృక్పథం సమాజంలో లోపించింది. దీంతోపాటు, ప్రభుత్వం చేయాల్సిన పనులు విద్య, నైపుణ్యాలు, ఆరోగ్య రంగాల్లో ఘోరంగా విఫలమవటం, మెజారిటీ ప్రజలు నివసించే గ్రామాలు, పట్టణాల్ని పట్టించుకోకుండా మహానగరాలకే పెట్టుబడుల ప్రోత్సాహాన్ని పరిమితం చేయటం వల్ల ఉపాధి అవకాశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అభివృద్ధి జరిగిన చోట కూడా ప్రభుత్వ రాయితీలకు తగ్గ ఉపాధి అవకాశాలు లభించలేదు. ఉపాధి లేని వృద్ధి కొనసాగింది.

ఒక సమాజంగానే ఉపాధి పరంగా మూల్యం చెల్లించినప్పుడు, అందులో వివక్షకు గురవుతున్నవారు ఇంకా ఎక్కువ నష్టపోతారు. మహిళల ఆ రకంగానే నష్టపోయారు. చదువుకున్న యువతుల్లో చాలామంది ఉద్యోగం చేయడం కన్నా కుటుంబ బాధ్యతలు స్వీకరించడానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ది ఎకనామిక్ ఫోరం 2020 సర్వే ప్రకారం భారత్‌లో 15-59 సంవత్సరాల మధ్య వయస్సులైన మహిళల్లో సుమారు 60 శాతం మంది కుటుంబ బాధ్యతల్లోనే నిమగ్నమై ఉన్నారు. ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాక కూడా కార్మిక శక్తిలో మహిళల భాగస్వామ్యం భారీగా పెరగలేదు. 2004-05 మధ్య కాలంలో 14.86 కోట్ల మంది మహిళా శ్రామికులు ఉండగా, 2017-18 నాటికి వారి సంఖ్య 10.41 కోట్లకు తగ్గింది. అందువల్ల శ్రామిక శక్తిలో మహిళల వాటా పెంచటానికి అభివృద్ధికి, తాత్కాలిక పథకాలకు మధ్య సమతూకం పాటించటం, పెట్టుబడులను ప్రోత్సహించటం, నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం అందించటంతోపాటు అణచివేత నుంచి, భౌతికంగా కావచ్చు, భావజాలపరంగా కావచ్చు, బయటపడి మహిళలు ఉపాధిని అందుకోగలిగేలా చర్యలు తీసుకోవాలి, ప్రోత్సాహకాల్ని అందించాలి. పెద్ద ఆర్థిక భారం లేకుండా వారు పనిచేసే చోటుకు వెళ్లగలిగేలా, వేధింపుల బారిన పడకుండా, భద్రతకు భరోసానిచ్చేలా, అదేవిధంగా పురుషులతో వెనకబడకుండా నైపుణ్యాల అదనపు శిక్షణ, సమాన పనికి సమాన వేతనం మొదలైన చర్యలు తీసుకోవాలి. 2019-20లో సుమారు 60 శాతం మగవారు రెగ్యులర్ వేతనాలు పొందుతుండగా, మహిళల్లో ఆ సంఖ్య కేవలం 5 శాతం. ఈ శాతం ఇటీవల 20 శాతం దాకా పెరిగిందంటున్నారు.

అమ్మాయిలు కేవలం కొన్ని కోర్సులకు పరిమితం కాకుండా వారు ఆధునిక మార్కెట్‌లో పెద్దసంఖ్యలో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందగలిగేలా గణితం, సైన్స్, ఇంజినీరింగ్ వంటి

కోర్సులనూ చదివేలా ప్రోత్సహించాలి. మహిళల ప్రత్యేక అవసరాలకి, వారి పనికి మధ్య ఘర్షణ లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

అభివృద్ధిని వికేంద్రీకరించి గ్రామాల మధ్య చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా తయారుచేయాలి. పురుషుల్లాగే ప్రస్తుతం పనిచేస్తున్న మహిళల్లో ఎక్కువగా అసంఘటిత రంగంలో ఉన్నారు. స్థిర ఆదాయాలు పొందే మహిళల సంఖ్య పురుషుల కంటే ఎంతో తక్కువ కావటంతోపాటు మహిళలు అత్యధికంగా తక్కువ ఆదాయమున్న వ్యవసాయంలో ఉన్నారు. వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానించి న్యాయమైన ఆదాయం వచ్చే ఏర్పాట్లు చేయటంతోపాటు మహిళలు కావచ్చు, మగవారు కావచ్చు, ఎక్కువ మంది వ్యవసాయం మీదే ఆధారపడాల్సిన అవసరం లేకుండా మెరుగైన ఆదాయంతో నాణ్యమైన ఉపాధి అందుకునేలా వ్యవసాయేతర రంగాలను ప్రోత్సహించాలి. మగవారితో సమానంగా మహిళలు ఉపాధిలో ఎదిగితే జీడీపీలో వారి వాటా 50శాతం దాటుతుందని అంచనా. ప్రభుత్వం తాను చేయాల్సిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక వసతులు వంటి పనులను సవ్యంగా, సమర్థంగా చేయటంతోపాటు, ఆర్థికాభివృద్ధిని, క్రమశిక్షణను అత్యంత ప్రాధాన్యాంశాలుగా కొనసాగించటం, ఉపాధి ఆధారిత పెట్టుబడులను ప్రోత్సహించటం, అభివృద్ధిని వికేంద్రీకరించటం, అదే విధంగా ఒక సమాజంగా మహిళల్ని అణగదొక్కాలనుకుని మనం అణగిపోకుండా సమానత్వ భావంతో వ్యవహరించటం, తద్వారా మహిళల ఆర్థిక స్వేచ్ఛ, స్వావలంబనకు దోహదం చేయటం కోసం మన వంతు కృషి చిత్తశుద్ధితో చేయటం, ఇతరులనూ ఈ దిశగా ప్రోత్సహించటమే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవటమవుతుంది.

**ఒక సమాజంగా మహిళల్ని అణగదొక్కాలనుకుని మనం అణగిపోకుండా సమానత్వ భావంతో వ్యవహరించటం, తద్వారా మహిళల ఆర్థిక స్వేచ్ఛ, స్వావలంబనకు దోహదం చేయటం కోసం మన వంతు కృషి చిత్తశుద్ధితో చేయటం, ఇతరులనూ ఈ దిశగా ప్రోత్సహించటమే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవటమవుతుంది.**

మళ్లీ ఒకసారి మొదటి అంశాన్ని పరిశీలిద్దాం. కొన్ని దేశాల్లో ఉచిత ప్రయాణం విజయవంతమైందన్న అంచనాలున్నాయి, అలాగే మన దేశంలో తమిళనాడు, తెలంగాణ, ఢిల్లీ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల్లో అమలవుతోంది. తమిళనాడులో రోజుకు సగటున 50 లక్షల మంది మహిళలు ఆర్డినరి బస్సుల్లో ఉచిత ప్రయాణాలు చేస్తున్నారు. దీన్ని ఇంకొంత విస్తరించి, అమలుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.3,050 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. చెన్నైకి చెందిన సిటిజన్ కన్స్యూమర్ అండ్ సివిక్ యాక్షన్ గ్రూప్ ఈ పథకం అమలుపై సర్వే నిర్వహించింది. చెన్నై, కోయంబత్తూరు, సేలం తదితర నగరాల్లో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుంటున్న మూడు వేల మందితో మాట్లాడింది. ఈ పథకం వల్ల మూడింట రెండో వంతు మహిళలు నెలకు కనీసం రూ.400 ఆదా చేసుకుంటున్నట్లు సర్వేలో తేలింది. మరో 20 శాతం మంది నెలకు రూ.800, 18 శాతం మంది రూ.800 నుంచి రూ.1000 వరకు ఆదా చేసుకుంటుండగా, కొందరికి రూ.1500 వరకు మిగులుతోంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాల్లోనివారే ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. అయితే ఉచితం ద్వారా ఆదా ఉత్పాదకంగా ఎంతమేర ఉపయోగపడుతోంది, దీనివల్ల ఆటోలు, క్యాబ్‌లు వంటి ప్రయివేటు ఉపాధి పొందుతున్నవారికి ఎంత నష్టం వస్తోంది బేరీజు వేయటానికి కావలసిన వివరాలు సర్వేలో లేవు. ఉచితం అమలవుతున్న చోట్ల సాధకబాధకాలు అధ్యయనం చేయకుండా, తెలంగాణ పరిస్థితులను పరిశీలించకుండా అమలు చేయటం వల్ల విమర్శలను ఎదుర్కోవలసి వస్తోంది. ప్రజారవాణా వినియోగాన్ని పెంచటం సహా ప్రజలకు ఎంతో కొంత ఉపయోగపడే నిర్ణయమైనప్పటికీ వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయకుండా, ప్రత్యామ్నాయాల్ని ఆలోచించకుండా ఎన్నికల్లో ఇష్టారాజ్యం హామీలిస్తే సమస్యలొస్తాయని, అదేవిధంగా ఓటు వేసేటప్పుడు హామీల పర్యవసానాల్ని అంచనా వేసి నిర్ణయం తీసుకోవాలి తప్ప ఎన్నికల్లో ఆవేశంతోనో, తాత్కాలిక ప్రలోభాలకు లోనయ్యో ఓటు వేసి ఆ తర్వాత తిట్టిపోయటం ప్రజాస్వామ్యం అనిపించుకోదనే పాఠాల్ని ఈ ఉచిత హామీ నేర్పిస్తుంది. అందుకే ఈ నిర్ణయాన్ని పునస్సమీక్షించి ఆచరణసాధ్యంగా అమలు చేయటం మేలనే సూచనలు వస్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇదేమీ ప్రమాదకరమైనది కాదు. కొన్ని హామీలు మాత్రం రాష్ట్ర భవిష్యత్తుకు తీవ్ర నష్టం చేసేవి, ఏమాత్రం ఆచరణసాధ్యం కానివి. ప్రభుత్వం తీరు, ముఖ్యమంత్రి వ్యవహారశైలి పట్ల ప్రజల్లో మంచి భావం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తు తరాల ప్రయోజనాల దృష్ట్యా ఈ సమయంలోనే ఆచరణసాధ్యంగా స్పందించి హామీల అమలుపై కమిటీ వేసి, ఏవి ప్రయోజనకరమైనవో, ఆచరణసాధ్యమో వాటిని ప్రజలకు తెలియచేసి పారదర్శకంగా అమలు చేయటం మంచిది.

అదే విధంగా ఆరోగ్యంలో కొద్దిపాటి అదనపు ఖర్చు మినహాయించి ప్రభుత్వం మహిళా సాధికారత కోసం చేయాల్సిన పనులకు పెద్ద ఖర్చు కూడా అవదు. కానీ ఫలితాలు మాత్రం పెద్దఎత్తున వస్తాయి, సమాజంలో సుస్థిరాభివృద్ధికి అవసరమైన గట్టి పునాది ఏర్పడుతుంది. ఈ పనిచేస్తే అధికార పార్టీకి ఓట్లూ వస్తాయి. మహిళా సాధికారత, ప్రజాహితం కోరేవారు ప్రభుత్వం చేత ఈ పనులు చేయించేందుకు ఆలస్యం లేకుండా కార్యాచరణ ప్రారంభించాలి.

❖



INTERNATIONAL

# WOMEN'S Day

8 MARCH

**ఆర్థికాభివృద్ధి, అందులో భాగస్వామ్యం పెరగకుండా మహిళా సాధికారత సాధ్యం కాదు. అందువల్ల, ఓటర్లలో సగంమందిగా ఉన్న మహిళలూ! వచ్చే ఎన్నికల్లో ఈ ఎజెండా గల పార్టీలు, నేతలకే ఓటు వేయండి:**

- అప్పులు చేసైనా తాత్కాలిక పథకాల్ని పందేరం చేస్తాం, అందుకోసమే అధికారం అనే రకం హామీలివ్వకుండా సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకం పాటించటం
- బూటకపు చదువుల స్థానంలో మెరుగైన ఉపాధి అవకాశాలనందించే నైపుణ్యాలున్న నాణ్యమైన విద్యను  పాఠశాల స్థాయి నుంచి అందించటం
- ఉత్పాదకత శక్తిని పెంచటం కోసం ఆర్థిక భారంలేని మంచి ప్రమాణాల ఆరోగ్యం
- ఉపాధి కోసం అమ్మాయిలు ఎక్కడికైనా సురక్షితంగా వెళ్లిరాగలిగేలా కనీస చట్టబద్ధపాలన అమలు, మహిళలపై వేధింపుల దశలోనే చర్యలు తీసుకుని పెద్ద నేరాలను నివారించేలా గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టుల ఏర్పాటు

రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచటం కోసం పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించి రొటేషన్ పద్ధతికి బదులు నిజమైన మహిళా నాయకత్వం ఎదిగే ఏర్పాటు చేయాలి. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగితే పెత్తందారీ రాజకీయాన్ని మార్చగలరు. రాజకీయమంటే సేవ తప్ప నియంత్రణ, ఆధిపత్యం కాదని నిరూపిస్తారు.

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్,** ప్రజాస్వామ్య పీఠం (FDR ), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

# భారత రాజకీయాలు - మహిళల ప్రాతినిధ్యం

| సంతోషిణి |

స్వాతంత్ర్య భారతదేశం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంటరీ పద్ధతిని ఎంచుకుంది. ఈ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ఎన్నికలు, రాజకీయ పార్టీలు, పార్టీ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తాయి. ప్రజలు కనబరుస్తున్న, ఆకాంక్షల్ని వ్యక్తీకరించటం, వారి ఆసక్తులను ఏకీకృతం చేయటం కోసం రాజకీయ పార్టీలు దోహదపడతాయి. పార్టీల నుండి అభ్యర్థులుగా ఎన్నికైన ప్రతినిధులు ప్రజలచే చట్టసభలకు ఎన్నికై, వారి డిమాండ్‌లను ప్రతిబింబించి, ప్రజా ప్రయోజనం కోసం విధానాలను రూపొందించడంలో వారి గొంతుక అవుతారు.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో పటిష్టమైన, న్యాయబద్ధమైన పాలన వ్యవస్థను ఏర్పర్చడానికి సమ్మిళితత్వం ఎంతో అవసరం. రాజకీయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెంచడం వల్ల, మరింత వైవిధ్యమైన, ప్రజానుకూలమైన రాజకీయ వాతావరణాన్ని పెంపొందించే అవకాశం ఉంటుంది. భారతదేశంలో సగం జనాభా మహిళలే అయినప్పటికీ, రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం నిజమైన ప్రజా స్వామ్యం ఏర్పడటానికి అడ్డంకిగా మారింది.



మహిళా ప్రతినిధులు ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, కుటుంబ అవసరాలు, మౌలిక సదుపాయాలు, ఆర్థిక అభివృద్ధి మరియు సామాజిక సంక్షేమం వంటి సమగ్ర విధాన రూపకల్పనకు దోహదపడే అంశాలకు ప్రాధాన్యత ఇస్తారు. మహిళల హక్కులను పరిరక్షించడంలో, వారి అభివృద్ధిని పెంపొందించే నిర్ణయాలు తీసుకోవడంలో వారి భాగస్వామ్యం కీలకం. 2010లో 'రాజకీయ రిజర్వేషన్, పరిపూర్ణ ప్రాతినిధ్యం: భారతదేశ గ్రామ పంచాయతీల నుండి ఆధారాలు" అనే పరిశోధనా పత్రం 11 ప్రధాన రాష్ట్రాలను పరిశీలించి, మహిళల నాయకత్వ పదవుల్లో ఉన్న పంచాయతీలు పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల మరమ్మతు, నీటిపారుదల సదుపాయాలలో ఎక్కువ పెట్టుబడులు కేటాయించినట్లు తేల్చింది.

స్వాతంత్ర్యానికి పూర్వం భారత జాతీయ కాంగ్రెస్‌కు ముగ్గురు మహిళలు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వారిలో సరోజినినాయుడు 1925లో ఎన్నికైన మొదటి భారతీయ మహిళ. ఆమె అధ్యక్షతలో కాంగ్రెస్‌లో మహిళా విభాగం ఏర్పాటు కోసం ప్రతిపాదించారు. స్త్రీల సమానత్వం ద్వారానే నిజమైన స్వాతంత్ర్యమని చెప్పారు. 1931లో బ్రిటిష్ ప్రధానమంత్రికి రాసిన లేఖలో, పూర్తిస్థాయి వయోజన ఓటు హక్కును, మహిళలకు సమాన రాజకీయ హోదాను ఆమె డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య భారతదేశ రాజ్యాంగ సభలో, మొత్తం 299 మంది ప్రతినిధులలో 15 మంది మహిళలు ఉన్నారు. రాజ్యాంగ సభలో సభ్యులైన హన్సా మెహతా, రాజకుమారి అమృత్ కౌర్ భారత మహిళల హక్కులు, బాధ్యతల చార్టర్‌ను ప్రతి పాదించారు. యూని ఫాం సివిల్ కోడ్‌ను మరింత ముం దుకు తీసుకెళ్లారు. పూర్ణిమ బెనర్జీ, రేణుకా రే విద్యలో సమానత్వం కోసం వాదించడమే కాకుండా ప్రభుత్వ తోడ్పాటు ఉన్న సంస్థల్లో మతపరమైన బోధనలకు వ్యతిరేకంగా గొంతెత్తారు. రాజ్యాంగసభలో మహిళా ప్రాతినిధ్యం 5% ఉండగా, 1952లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 22 మంది మహిళా సభ్యులు, అంటే, 4.4% మంది ఎన్నికయ్యారు. ఈ సంఖ్య 2019లో జరిగిన 17వ లోక్‌సభ ఎన్నికల్లో 78కి పెరిగింది. ఇది సభలో సమారు 14.36%. ఈ సంఖ్య పెరిగిన ప్రాతినిధ్యాన్ని చూపించినప్పటికీ, ప్రపంచ స్థాయిలో జాతీయ శాసనసభలతో పోల్చితే భారతదేశం వెనుకబడి ఉంది. దక్షిణాఫ్రికాలో, మహిళా ప్రాతినిధ్యం 45%, ఆస్ట్రేలియాలో 38%, జర్మనీలో 35% ఉంది.

రాష్ట్ర స్థాయిలలో మహిళా ప్రతినిధుల బలం రాష్ట్రాల మధ్య గణనీయమైన తేడాను చూపుతుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 18% మంది మహిళా ఎమ్మెల్యేలు ఉండగా, మిజోరాం రాష్ట్రంలో ఒక్కరు కూడా లేరు. సగటున, రాష్ట్రాలలో కేవలం 9% మంది ఎమ్మెల్యేలు మహిళలు. స్త్రీలు రాజకీయంలో పాల్గొనటానికి సంబంధించి పరిగణించే మరొక అంశం మహిళా పోటీదారుల శాతం, ఇది పశ్చిమ బెంగాల్‌లో 11.34% ఉండగా నాగాలాండ్‌లో 2.56% వరకు ఉంది.

స్థానిక ప్రభుత్వాలు అయిన పంచాయతీరాజ్‌లో మొత్తం 31,87,320 మంది ప్రతినిధులలో 14,53,973మంది మహిళా ప్రతినిధులు. తమిళనాడు వంటి రాష్ట్రాలలో 2023 నాటికి ప్రాతినిధ్యం 50% కంటే ఎక్కువ. ఎన్నికైన మహిళా ప్రతినిధుల గణనీయ పెరుగుదలకు రాజ్యాంగం నిర్దేశించిన 33% రిజర్వేషన్లు పెద్ద సానుకూల కారణం. ప్రస్తుతం 20 రాష్ట్రాలు పంచాయతీ స్థాయిలో మహిళల కోటా గరిష్ఠ పరిమితిని 50%కి పెంచాయి.

**పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే అంశానికి సంబంధించి, సమస్యను చట్ట సవరణని దాటి రాజకీయ పార్టీలు, పార్టీ వ్యవస్థలోకి మరింత లోతుగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యలో ప్రధానమైనది రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం.**

ఇదే తరహాలో, 106వ రాజ్యాంగ సవరణ ఆమోదించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, ఎన్.సి.టి ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం సీట్లలో మూడవ వంతు మహిళలకు కేటాయించాల్సుంటుంది. మహిళా ప్రాతినిధ్యం పెంచడానికి, రాజకీయ అసమానతను తొలగించటం ఈ సవరణ లక్ష్యమని యూనియన్ ప్రభుత్వం పేర్కొంది.

అయితే, ఈ సానుకూల చర్యలు నిజమైన మహిళా నాయకత్వం ఎదుగుదలకు, వారికి సాధికారతను, విధాన నిర్ణయాల్లో అధికారాన్ని అందించేందుకు ఉపయోగపడగలవా అనేదే అసలైన ప్రశ్న. 1992 నుండి అటువంటి నిశ్చయాత్మక చర్యలు అమలులో ఉన్న పంచాయతీరాజ్‌లను ఇప్పుడు పరిశీలిస్తే రొటేషన్‌తో కూడిన రిజర్వేషన్ పద్ధతి మహిళా సర్పంచ్ పాత్రను డమ్మీ పదవిగా మార్చేసింది. అనేక సందర్భాల్లో 'సర్పంచ్ పతి' ప్రభావం కనిపిస్తుంది. మహిళా సర్పంచ్ ఎటువంటి సొంత అధికారం లేకుండా కుటుంబంలోని పురుష సభ్యుల ఆదేశాల మేరకు వ్యవహరించే ధోరణులకు దారితీసింది. రొటేషన్‌తో కూడిన రిజర్వేషన్, నాయకత్వ పరిపక్వతను అడ్డుకుంటోంది. తదుపరి ఎన్నికలో అనుభవాన్ని నిలబెట్టుకుని, దానిని ఉపయోగించే అవకాశాన్ని మహిళలు కోల్పోతున్నారు.

పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే అంశానికి సంబంధించి, సమస్యను చట్ట సవరణని దాటి రాజకీయ పార్టీలు, పార్టీ వ్యవస్థలోకి మరింత లోతుగా చూడాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యలో ప్రధానమైనది రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవటం. పురుషులు మరియు మహిళా అభ్యర్థుల గెలుపోటములలో అతి తక్కువ వ్యత్యాసం ఉన్నప్పటికీ, పోటీ చేయటానికి మహిళల నామినేషన్లు తక్కువగా ఉన్నాయి.

2014 పార్లమెంటరీ ఎన్నికలలో, పురుష పోటీదారుల గెలుపు శాతం 6.3% కాగా, మహిళల గెలుపు శాతం 9.3%. 2019లో సార్వత్రిక ఎన్నికల్లో టి.ఎం.సి పార్టీ నుండి 37% మంది మహిళలు పోటీ చేయగా, వారిలో 41% మంది విజయం సాధించారు. 17వ లోక్‌సభ ఎన్నికల్లో 8000 మంది అభ్యర్థులు పోటీ చేయగా కేవలం 716 మహిళా అభ్యర్థులు పోటీ చేశారు.

అభ్యర్థుల నామినేషన్లకు ప్రజాస్వామిక ప్రక్రియ వ్యవస్థీకృతంగా లేకపోవటం, కుటుంబ రాజకీయాలు, పితృస్వామిక భావనలతోపాటు సేవ చేయాలనే కోరిక కంటే అధికారం కోసం తపన ఎక్కువగా ఉండటం వల్ల మహిళల ప్రాతినిధ్యాన్ని మెరుగుపరిచే కేవలం చట్టపరమైన ప్రయత్నం తగిన ఫలితాన్ని ఇవ్వలేక పోతోంది. పార్టీలు ప్రయివేటు ఆస్తుల్లా మారిపోవటం, పోటీ చేసే మహి ళలను పార్టీ నాయకత్వం ఇష్టానుసారం నిర్ణయిం చటం జరుగుతోంది. అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడింది. కార్యకర్తల స్థాయిలో మహిళా నాయకుల ఆవిర్భావానికి, వారి రాజకీయ ఎదుగుదలకు ఇది అడ్డుగోడగా మారింది. ఇందిరాగాంధీ, మమతా బెనర్జీ, జయలలిత వంటి మహిళా నేతలు పార్టీని నడిపించినప్పటికీ అదో ఒక మినహాయింపుగా మాత్రమే పరిగణించవచ్చు.

పురుషా ధిపత్యంతో మహిళలను రెండవ తరగతి పౌరులుగా చూసే రాజకీయ రంగంలో నిర్మలా సీతారామన్, సుష్మా స్వరాజ్, స్మృతి ఇరాని వంటి కొద్దిమంది మాత్రమే తమ రాజకీయ ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగారు.

ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్ష్యం, తమని ఎన్నుకున్నవారి అభివృద్ధికి న్యాయంగా పాటుపడటం. ఈ ప్రజాప్రతినిధులలో మహిళా అభ్యర్థులు లేకపోవటం అనేది జనాభాలో సగభాగం ఉన్న వర్గానికి ప్రతినిధులను తగ్గించటమే కాకుండా రాజకీయ రంగంలో అసమానతని పెంచుతుంది. ప్రస్తుత రూపంలోని రిజర్వేషన్ చట్టసవరణ వల్ల మహిళల సంఖ్య గణనీయంగా పెరిగినా కృత్రిమ నాయకత్వానికి దారితీస్తుంది.

అలా కాకుండా శాశ్వత నాయకత్వాన్ని పెంపొందించాలంటే మూడు అంశాలలో మార్పులు అవసరం. మొదట, రాజకీయ సంస్కరణలో భాగంగా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం రావాలి. రెండవది, పార్లమెంటు, అసెంబ్లీ సీట్లలో 33% రిజర్వేషన్ల బదులు, పార్టీలు అంతర్గతంగా మహిళలకు పార్లమెంటులో తగిన శాతంలో టికెట్లను రాష్ట్రాలను యూనిట్‌గా చేసుకుని కేటాయించాలి. మూడవది, 73 మరియు 74 చట్ట సవరణల ద్వారా ఏర్పాటు చేసిన స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం వల్ల స్థానిక నాయకత్వం పెరుగుతుంది. ఈ మార్పుల వలన కేవలం మహిళా సాధికారత మాత్రమే కాకుండా రాజకీయ విధివిధానాలు కూడా మెరుగుపడి ప్రజాస్వామ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయి.

**(మార్చి 8 – అంతర్జాతీయ మహిళా దినోత్సవం)**

❖

# అభివృద్ధి కోసం పాలన

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



లోక్‌సభ సాధారణ ఎన్నికలకు కేవలం కొన్ని వారాల ముందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ప్రజాస్వామ్య రాజకీయాల్లో ఎంతో అసాధారణమైనది. ఎన్నికల సమయంలో బడ్జెట్ అంటే, ఓటర్లను సంతృప్తిపరచటానికి తాత్కాలిక వ్యక్తిగత సంక్షేమ పథకాల్ని, పన్ను రాయితీల్ని సొంత సొమ్మేదో దానం చేస్తున్నట్లు ప్రకటించటం మన వద్ద ఆనవాయితీ. దశాబ్దాలుగా ఈ ధోరణులకు అలవాటుపడ్డాం. అందుకు పూర్తి భిన్నంగా, వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనల్లో తాత్కాలిక ప్రయోజనాలతో ఓటర్లను ముంచెత్తే ఎటువంటి ప్రజాకర్షక చర్యలు లేవు. అదేవిధంగా, తాజా అప్పులకు అద్దం పట్టే ద్రవ్యలోటు 2023-24 ఆర్థిక సంవత్సరానికి (5.8%) అంతకుముందు నిర్దేశించుకున్న లక్ష్యం కంటే (5.9%) కూడా తక్కువగా ఉంది. నిజానికి ఈ ఏడాది అప్పులు గతేడాదితో పోలిస్తే రూ.52,000 కోట్ల మేర తగ్గాయి. వచ్చే ఏడాది ఇంకా రూ.49,000 కోట్ల దాకా తగ్గనున్నాయి. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో అప్పుల్ని నికరంగా, జీడీపీ వాటా పరంగా తగ్గించటం ఎన్నికల సమయంలో ఆషామాషీ కాదు. భారత్‌లో బహుశా దశాబ్దాలుగా చూడని విషయం. ఈ ఏడాది పెట్టుబడి వ్యయం గత సంవత్సరం కంటే 28.9% పెరిగింది. వచ్చే ఏడాది మరో 16.9% పెరుగుతుందని అంచనా. 2024-25 ఆర్థిక సంవత్సరంలో యూనియన్ ప్రభుత్వ పరిధిలో పెట్టుబడులకే రికార్డుస్థాయిలో రూ. 11,11,111 కోట్లు కేటాయించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి, ప్రయివేటు రంగంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ & డి) తోడ్పాటుకు గణనీయంగా ప్రోత్సాహం అందించారు. ద్రవ్య క్రమశిక్షణ, ఆర్థిక పటిష్ఠతకు రోడ్‌మ్యాప్‌ను కొనసాగించటం, అదనంగా తాత్కాలిక సంక్షేమ పథకాలను ప్రకటించకపోవటం, ఆస్తులు పెంచే పెట్టుబడులు ఇవన్నీ ఎన్నికల సంవత్సరం బడ్జెట్‌లో చేయటం ఒక ప్రజాస్వామ్యంలో అద్భుతాలంటే అతిశయోక్తి కాదు.

సంక్షేమం, అభివృద్ధి మధ్య ఆరోగ్యకరమైన సమతుల్యతను కొనసాగించటం ఒక సంక్లిష్ట, గందరగోళ ప్రజాస్వామ్యంలో అభినందనీయం. అందునా ఓటు కోసం ప్రజల ముందుకు వెళ్లాల్సిన కొన్ని వారాల ముందు. దీర్ఘకాలిక అభివృద్ధికి, అందుకు చెల్లించే తాత్కాలిక రాజకీయ మూల్యానికి మధ్య ఎప్పుడూ సంఘర్షణ ఉంటుంది. తాత్కాలిక సంక్షేమానికి, దీర్ఘకాలిక ప్రజాహితానికి మధ్య సమన్వయం సాధించటం ఒక పేద దేశంలో అతి పెద్ద సవాలు. ఈ కోణంలో, 2024-25 బడ్జెట్ గొప్ప విజయం సాధించింది. ఈ బడ్జెట్‌లో మూడు అంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఒకటి, దశాబ్ద కాలంగా తాము సాధించిన విజయాల్ని ప్రజలు గుర్తిస్తారు, ఆదరిస్తారు అనే ఆత్మవిశ్వాసం యూనియన్ ప్రభుత్వంలో కనిపించింది; రెండోది, ఆర్థిక సమతుల్యతను కాపాడుతూ పెట్టుబడులను ప్రోత్సహించటంలో ప్రభుత్వ అంకితభావం; మూడోది, పెట్టుబడులకు, దీర్ఘకాలిక అభివృద్ధికి ఆర్థిక స్థిరత్వం కీలకమని గుర్తించటం.

కొవిడ్ మహమ్మారి ప్రభావం తీవ్రంగా ఉన్న కాలంలో, 2021లో జాతీయ స్థాయి ద్రవ్యలోటు జీడీపీలో 9.2% గరిష్టానికి చేరింది. ఆర్థిక పటిష్ఠత విధానాల్ని కొనసాగిస్తూ, ప్రజాధనాన్ని వివేకంతో వినియోగిస్తే 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 5.1%కి, 2026 ఆర్థిక సంవత్సరంలో 4.5% కంటే దిగువకు తగ్గుతుంది. యూనియన్ ప్రభుత్వం వద్ద నిధులు పుష్కలంగా ఉన్నాయని, ఎప్పుడు అవసరమైతే అప్పుడు భారీ మొత్తాల్ని రాష్ట్రాలకు బదిలీ చేయగలదనే అపోహ చాలామందిలో ఉంది. వాస్తవమేంటంటే, 2024-25 ఆర్థిక సంవత్సరానికి యూనియన్ ప్రభుత్వ పన్నులు, పన్నేతర స్థూల ఆదాయాలు మొత్తం కలిపితే రూ.42.33 ట్రిలియన్లు. ఇందులో కేవలం రాష్ట్రాలకు చేసే బదిలీలు (ఆర్థిక సంఘం సిఫార్సులకనుగుణంగా బదిలీ, ఇతర గ్రాంట్‌లు, కేంద్ర ప్రాయోజిత పథకాలు వగైరా) రూ.22.75

ట్రిలియన్ రూపాయలు. అంటే, మొత్తం ఆదాయాల్లో సుమారు 53.7%! వడ్డీ చెల్లింపులు, జీతభత్యాల వ్యయాన్ని కలిపితే యూనియన్ సబ్సిడీల్ని కలపకుండానే వ్యయం మొత్తం స్థూల ఆదాయాల్ని దాటేస్తుంది. కాబట్టి, అభివృద్ధిని కొనసాగించాలంటే మనం ఆర్థిక పటిష్ఠతను కొనసాగించాలి.

రాష్ట్రాలకు అనేక రకాల పాలనా బాధ్యతలున్నాయి. అందువల్ల ఖజానా మీద నిరంతర ఒత్తిడి ఉంటుంది. అయితే, ఆర్థిక నిర్వహణకు సంబంధించి రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సంపన్నంగా ఉన్న కొన్ని రాష్ట్రాల్లో కూడా తాత్కాలిక సంక్షేమ చర్యలు అదుపు తప్పాయి. కొన్నిసార్లు పెట్టుబడి వ్యయం కింద కూడా అనుత్పాదక పథకాల మీద భారీ మొత్తాల్ని ఖర్చు చేస్తున్నారు. ఈ రకమైన ఆర్థిక నిర్లక్ష్యం రెవెన్యూ లోటు ఇంకా పెరగటానికి కారణమవుతోంది (ఖర్చులు ఆదాయాల కంటే ఎక్కువ కావటంతో, రోజువారీ అవసరాలకి కూడా అప్పులు తేవాల్సి వస్తోంది!). కానీ తక్కువ తలసరి ఆదాయం ఉన్న కొన్ని రాష్ట్రాలు వ్యయాల్ని సమర్థంగా నియంత్రిస్తూ ఆరోగ్యకరమైన రెవెన్యూ మిగులు సాధిస్తున్నాయి, పెట్టుబడుల్ని, అభివృద్ధిని పెంచుతున్నాయి. ఉత్తరప్రదేశ్ (2024-25 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ మిగులు రూ.74,000 కోట్లు;), ఒడిశా (2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ మిగులు రూ.23,000 కోట్లు) ఉదాహరణలు. ఆ రాష్ట్రాలు ఆరోగ్యకరమైన రీతిలో ఆర్థిక నిర్వహణ గావిస్తున్నాయి. అది కూడా ప్రజాదరణను నిలబెట్టుకుంటూ. మంచి ఆర్థిక నిర్వహణ వల్ల రాజకీయంగా నష్టపోనక్కర్లేదన్నది సుస్పష్టం.



ప్రజల్ని విభజించే అంశాలు, కులం, మతం, ప్రాంతం వంటి ఆదిమ భావోద్వేగాల నుండి మన బహిరంగ చర్చను ఆర్థిక ప్రగతి, ఉపాధి సృష్టి, పేదరిక నిర్మూలన వైపు మళ్లించాలి. రాజకీయాలంతటికీ పాలన కేంద్రబిందువు కావాలి, పాలన మొత్తం వేగంగా ఆర్థికాభివృద్ధి, ప్రగతి లక్ష్యంగా సాగాలి. అభివృద్ధికి, ప్రగతికి విజ్ఞత గల ఆర్థిక నిర్వహణ తొలి అడుగు కావాలి. మనం చేయాల్సింది ఇంకా ఎంతో ఉంది - నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం ద్వారా సామర్థ్యాన్ని, ఉత్పాదకతను, అవకాశాల్ని పెంచటం, చిన్న పట్టణాల అభివృద్ధి, గ్రామాల మధ్య పట్టణీకరణ, వేగంగా, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా వివాదాల పరిష్కారం ద్వారా న్యాయానికి భరోసా ఇవ్వటం, సమతూకం గల అభివృద్ధి, ఆరోగ్యకరమైన పోటీ, సంపద సృష్టికి అవరోధాలుగా ఉన్న విశృంఖల అవినీతి, వేధింపుల్ని నియంత్రించటం. మొత్తంగా, మనం పాలన అంతటినీ సమతుల అభివృద్ధి, అవకాశాలు, ఉపాధి, నిజమైన సంపద సృష్టి చుట్టూ తిప్పాలి. అసాధారణమైన 2024-25 యూనియన్ బడ్జెట్ ఒక సానుకూల ఒరవడికి ఆరంభం అవుతుందని ఆశిద్దాం. ❖

# ఏటా 7-8% వృద్ధి రేటు ఉంటేనే భారత్ అభివృద్ధి చెందిన దేశమవటం సాధ్యం



దేశంలో తలసరి ఆదాయం 13,000 డాలర్లకు (సుమారు 10.80 లక్షలు) చేరి 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఏటా భారత ఆర్థిక వ్యవస్థ 7-8% వృద్ధితో సాగాలని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ సి.రంగరాజన్ అన్నారు. అసమానతలు, పేదరికాన్ని తగ్గించేందుకు ఆవిష్కరణలు ఒక్కటే పరిష్కారం కాదన్నారు. వేగవంతమైన వృద్ధి రేటుతోపాటు సామాజిక భద్రత, సబ్సిడీల వంటివీ అవసరమన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే తలసరి ఆదాయం 13,000 డాలర్లుగా ఉండాలని, ప్రస్తుతం మన తలసరి ఆదాయం 2,700 డాలర్లు (సుమారు 2.25 లక్షలు)గా ఉందన్నారు. ఇక్ఫాయ్ వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ, భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి డాలర్ విలువ, ద్రవ్యోల్బణం, మారకపు రేటుపై ఆధారపడి ఉంటుందన్నారు. 'మారకపు విలువను తక్కువ స్థాయిలో ఉంచి, కరెన్సీ విలువ పెంచితే ఆదాయం పెరుగుతుంది. అప్పుడు అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు అవకాశం ఉంటుంది' అన్నారు. సాంకేతికతలు, ఆవిష్కరణలు ఆర్థిక వృద్ధికి ఊతం ఇస్తున్నాయన్నారు. గత ఒకటిన్నర శతాబ్దం, అంతకంటే ఎక్కువ కాలంలో అభివృద్ధి చెందిన దేశాల్లో సగ భాగం వృద్ధి సాంకేతికత వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థలో దిగువన ఉన్న ప్రజలకు జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు మరింత శ్రద్ధ చూపాలన్నారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చి (సీఎస్ఐఆర్) మాజీ డైరెక్టర్ రఘునాథ్ అనంత్ మషేల్కర్ మాట్లాడుతూ, సమాజంలో ఎక్కువమందికి అవసరమైన వస్తువులు, సేవల ఆవిష్కరణల ద్వారానే అత్యధిక జనాభాకు జీవనోపాధి అందించటం సాధ్యమన్నారు.

# తెలంగాణ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ 2024-25

అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు, సంక్షేమ పథకాలకు అత్యధిక కేటాయింపులతో తెలంగాణ ప్రభుత్వం 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టింది. మొత్తం రెవెన్యూ రాబడులు రూ.2.05 లక్షల కోట్లలో 25 శాతం (రూ.53,196 కోట్లు) ఆరు గ్యారంటీలకు ప్రతిపాదించింది. వీటి తర్వాత గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్, సాగునీటి పారుదల, విద్యుత్ శాఖలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ మూడు రంగాలకు గత బడ్జెట్ కన్నా నిధుల కేటాయింపులు పెరిగాయి. సాగు రంగంలో అత్యధిక భాగం రుణాలు, వడ్డీ చెల్లించేందుకే వెచ్చించనున్నారు. అభయహస్తం అమలుకు భారీగా నిధుల అవసరం దృష్ట్యా ఈ పెరుగుదల కనిపిస్తోంది. ఆసరా పెన్షన్లను రెట్టింపు చేయటంతో అదనంగా రూ.10 వేల కోట్లు ఇచ్చారు. రాష్ట్ర రాబడులను వాస్తవికంగా అంచనావేసి, అందుకు అనుగుణంగా తాత్కాలిక బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం తెలిపింది.

ప్రస్తుత బడ్జెట్ మొత్తం రూ.2.90 లక్షల కోట్లు ఉండగా, అందులో 15 వేల కోట్లకు పైగా తగ్గించి రూ.2.75 లక్షల కోట్లకే ఓటాన్ అకౌంట్‌ను రూపొందించినట్లు పేర్కొంది. జాతీయస్థాయి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయాన్ని రూ.21 వేల కోట్లకు తగ్గించింది. 2023-24 బడ్జెట్‌లో యూనియన్ నుంచి రూ.41 వేల కోట్ల వరకు గ్రాంట్ల రూపంలో నిధులు వస్తాయని గత ప్రభుత్వం అంచనా వేసింది. కానీ ఇప్పటి వరకు కేవలం రూ.13,953 కోట్లు వచ్చాయి. రాష్ట్ర ఆదాయంలో పన్నేతర ఆదాయం రూ.20,658 కోట్లు సాధించాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. భూముల అమ్మకం ద్వారా ఈ మొత్తం సమీకరించవచ్చని అంచనా వేస్తున్నారు.

జీఎస్‌టీ,అమ్మకం పన్ను, ఎక్సయిజ్ సుంకాల ద్వారా ఈ ఏడాది రూ.1.18 లక్షల కోట్ల ఆదాయం రాగా, వచ్చే ఏడాది రూ.1.38 లక్షల కోట్లు వస్తాయని భావిస్తున్నారు. యూనియన్ నుంచి పన్నుల వాటాగా 2023-24లో రూ.23,216 కోట్లు రాగా, వచ్చే ఏడాది రూ.25,639 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తమ్మీద రాష్ట్ర రెవెన్యూ రాబడి రూ.1.78 లక్షల కోట్ల నుంచి రూ.2.05 లక్షల కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నారు. గతేడాది ఆర్థిక ద్రవ్యలోటు రూ.32,556.50 కోట్లుండగా, ఈ ఏడాది రూ.33,785.83 కోట్లకు, వచ్చే ఏడాది రూ.53,227.82 కోట్లకు పెరుగుతుందని అంచనా.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం భారీగా రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి. ద్రవ్యలోటును అధిగమించేందుకు వచ్చే ఏడాది రూ.68,585 కోట్ల రుణాలు సేకరిస్తే, రాష్ట్ర ఆదాయం రూ.2,74,186.71 కోట్లకు చేరుతుంది. అయితే ఖర్చులు రూ.2,75,890.69 కోట్లు కానుండటంతో రూ.1703.97 కోట్ల లోటు ఏర్పడుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల



ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 11.3 శాతంగా ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. దేశ జీడీపీ వృద్ధి రేటు 16.1 శాతం నుంచి 8.9 శాతానికి తగ్గగా, జాతీయ వృద్ధి రేటు కంటే రాష్ట్ర వృద్ధి రేటు 2.4 శాతం ఎక్కువగా ఉన్నా, గత ఏడాది కంటే తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రాష్ట్ర తలసరి ఆదాయం అంచనా రూ.3,43,287. తెలంగాణలో ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంది. 2023 డిసెంబర్‌లో రాష్ట్ర ధరల సూచి 6.65 శాతం కాగా, దేశ సగటు 5.69 శాతం. అధిక ద్రవ్యోల్బణ రాష్ట్రాల్లో తెలంగాణ అయిదో స్థానంలో ఉంది.


**మొత్తంగా వివిధ రంగాలకు కేటాయించిన నిధులు (రూ. కోట్లలో):**
పంచాయత్ రాజ్: 40,080,
నీటిపారుదల: 28,024,
సాంఘిక సంక్షేమం: 21,874,
విద్యారంగం: 21,389,
వ్యవసాయం: 19,746,
విద్యుత్ సంస్థలు: 16,825,
గిరిజన సంక్షేమం: 13,313,
మునిసిపల్ విభాగం: 11,692,
వైద్య రంగం: 11,500, బి.సి సంక్షేమం: 8,000, గృహ నిర్మాణం: 7,740, పరిశ్రమల శాఖ: 2,543, విద్యుత్ – గృహజ్యోతి: 2,418, మైనారిటీ సంక్షేమం: 2,262, బి.సి గురుకుల భవనాల నిర్మాణం: 1546, సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల భవనాల నిర్మాణం: 1250, మూసీ రివర్ ఫ్రంట్: 1000, ఐటీ శాఖ: 774, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు: 500, విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు: 500.

# ఏపీ అంచనా వ్యయం రూ.2,86,389 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,86,389.27 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అందులో తొలి నాలుగు నెలలకు రూ. 88,215 కోట్లతో ప్రతిపాదించారు. ఏప్రిల్, మే, జూన్, జులై నెలల్లో సాధారణ ప్రభుత్వ ఖర్చులకు, రెగ్యులర్ పథకాలకే ప్రస్తుత శాసనసభ ఆమోదం తెలుపగా, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడే ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోవాలి.

ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2.79 లక్షల కోట్లున్న బడ్జెట్ అంచనాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.2.86 లక్షల కోట్లకు పెంచారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే అంచనాలకు తగ్గ ఆదాయాలు లేకపోవటంతో బడ్జెట్‌లో పెద్దగా మార్పులు చేయకుండానే రూపొందించినట్లు కనిపిస్తుంది. అయితే ఈసారి కూడా అంత ఆదాయం సాధ్యమా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.2,05,352.18 కోట్ల రెవెన్యూ రాబడులు వస్తాయని ఆర్థిక మంత్రి అంచనా వేశారు. ఇంత వచ్చే ఆస్కారం లేదని అంతకుముందు సంవత్సరాల గణాంకాలు చూస్తే అర్థమవుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వాస్తవంగా వచ్చిన రెవెన్యూ రాబడి సుమారు రూ. 1.57 లక్షల కోట్లు కాగా, 2023-24 బడ్జెట్‌లో రూ.2.06 లక్షల కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేశారు. తొలి పది నెలల్లో కాగ్‌కు సర్కారు సమర్పించిన లెక్కల ప్రకారం వచ్చిన రాబడి రూ.1.19 కోట్లే. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కలిపి సుమారు మరో రూ.77 వేల కోట్ల ఆదాయం అంచనా వేస్తున్నారు. 2022-23 వాస్తవ లెక్కలను ఆర్థిక మంత్రి సభకు సమర్పించారు. ఆ సంవత్సరం రెవెన్యూ లోటు అంచనా రూ.17,036.15 కోట్లుగా నాడు ప్రతిపాదించారు. ఏడాది తర్వాత రూ.29,107.56 కోట్లకే పరిమితం చేస్తున్నామని చెప్పారు. వాస్తవ లెక్కలు తేలేసరికి అది రూ.43,487.49 కోట్లకు పెరిగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటును రూ.24,758.22 కోట్లకే పరిమితం చేస్తామని చెబుతున్నారు. ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.60,153.58 కోట్లుగా చూపుతూ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.55,817.50 కోట్లకు పరిమితం చేస్తామని మంత్రి తెలిపారు.

2024-25లో మొత్తం రూ.71 వేల కోట్ల మేర బహిరంగ మార్కెట్ రుణాలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. బడ్జెట్‌లో చెప్పినదాని కంటే ఎక్కువ అప్పులు చేస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2022-23లో రూ.55 వేల కోట్ల



బహిరంగ మార్కెట్ రుణాలు తీసుకుంటామని ప్రతిపాదించి, రూ.57,487 కోట్ల మేర సేకరించింది. 2023-24లో రూ.63 వేల కోట్లు ప్రతిపాదించగా, సవరించిన అంచనాల ప్రకారం ఇది రూ.69 వేల కోట్లకు చేరవచ్చని ప్రస్తావించారు.

గత అయిదేళ్లలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పాలన వల్ల రాష్ట్రంలో శ్రేయో రాజ్య స్థాపన జరిగిందని ఏడు అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి వివరించారు.

**రంగాలవారీ కేటాయింపులు (రూ. కోట్లలో):**

విద్య - 33,898,
వైద్య, ఆరోగ్యం - 17,916,
గ్రామీణాభివృద్ధి - 17,816,
పట్టణాభివృద్ధి - 9,546,
వ్యవసాయం, అనుబంధ రంగాలు - 14,236,
సాగునీరు -12,038,
గృహ నిర్మాణాలు - 7,062, విద్యుత్ రంగం - 6,595, రవాణా - 10,334, పరిశ్రమలు, వాణిజ్యం, మౌలిక సదుపాయాలు - 3,940, సంక్షేమం - 44,668, బి.సి సంక్షేమం - 29,001.31, ఎస్.సి సంక్షేమం - 9,291.55, ఎస్.టి సంక్షేమం - 4,133.73, మైనారిటీల సంక్షేమం - 2,242.36

**బడ్జెట్ స్వరూపం:**

**మొత్తం బడ్జెట్ : రూ.2,86,389 కోట్లు**
**రెవెన్యూ వ్యయం : 2,30,110 కోట్లు**
**మూలధన వ్యయం : 30,530 కోట్లు**

❖

# నేతల రాజకీయ పరిభాషపై అభిశంసన

తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న భాష పట్ల మేధావులు, సామాజికవేత్తలు, న్యాయ కోవిదులు, కవులు, రచయితలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాక్షేత్రంలో ఉన్నవారు వాడే భాష సభ్యంగా ఉండాలని స్పష్టం చేశారు. 'తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిభాష' అంశంపై హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పాల్గొన్నవారంతా.. ఏపీ, తెలంగాణల్లో రాజకీయ నాయకులు, వారి అనుచరులు వాడుతున్న భాషను నిరసిస్తూ అభిశంసన పత్రాన్ని విడుదల చేశారు.

నాయకుల ప్రసంగాలు, చర్చల్లో పరస్పర నిందలు ప్రధానం కావటం బాధాకరమన్నారు. రాజకీయాలతో సంబంధంలేని కుటుంబసభ్యులను కూడా దుర్భాషలాడుతున్నారన్నారు. సభ్యత, బాధ్యత గల పౌరులంతా ఈ తరహా అభ్యంతర భాషను అభిశంసించాలన్నారు.

సంస్కారరహితంగా ఎవరు మాట్లాడినా వారిపై నిరసన తెలియచేస్తామని ప్రకటించారు. పత్రికలు, ఛానళ్లు కూడా నాయకుల అభ్యంతర వ్యాఖ్యలను ప్రచారం చేయకూడదని, అటువంటివి బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై త్వరలో అన్ని మీడియా కార్యాలయాలకూ లేఖలు రాస్తామన్నారు. పరస్పర గౌరవంతో ఆరోగ్యకరమైన చర్చ జరగాల్సిన ప్రజాస్వామ్య దేశంలో తిట్ల దండకాలకు చోటు ఉండకూడదని ఆకాంక్షించారు. దుర్భాషలాడుకునే కుసంస్కృతికి వ్యతిరేకంగా పౌరస్పృహను పెంచేలా తెలుగు రాష్ట్రాల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ



కార్యక్రమంలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గోద రఘురాం, విశ్రాంత ఐఏఎస్‌లు కాకి మాధవరావు, సుజాతారావు, ప్రొఫెసర్ హరగోపాల్, సామాజిక కార్యకర్త సుధ గోపరాజు, ప్రముఖ కవులు శివారెడ్డి, అందెశ్రీ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఈనాడు ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు వల్లీశ్వర్, కె.శ్రీనివాసరెడ్డి, మాశర్మ, డానీ, ఎమెస్కో విజయ్ కుమార్, ప్రముఖ రచయిత డి.చంద్రశేఖరరెడ్డి, మల్లేపల్లి లక్ష్మయ్య, మాడ భూషి శ్రీధర్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, విశ్లేషకుడు తెలకపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ దుష్ప్రచారంతో సమాజంలో విభజనలు

భారత్ సహా పలు దేశాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రభావం, తప్పుడు సమాచారవ్యాప్తి పెరిగిపోనున్నాయని, అది కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాల అర్హతను, చట్టబద్ధతను శంకించటానికి దారి తీస్తుందని ప్రపంచ ఆర్థిక వేదిక అంతర్జాతీయ వార్షిక నష్ట ప్రమాద నివేదికలో హెచ్చరించింది. గత సెప్టెంబర్‌లో 1,400 మంది నిపుణులు, విధానకర్తలు, పరిశ్రమాధిపతులను సర్వే చేసి ఈ నివేదికను రూపొందించింది. వచ్చే రెండేళ్లలో ఎన్నికల వేళ దుష్ప్రచారం, దాని ఫలితంగా సమాజం భిన్న వర్గాలుగా చీలిపోవటమే అతి పెద్ద ముప్పుగా తేల్చింది. దీంతోపాటు అంటువ్యాధులు, అక్రమ ఆర్థిక కార్యకలాపాలు, ఆదాయ అసమానతలు, కార్మిక కొరతను స్వల్పకాలిక ముప్పులుగా వర్గీకరించింది. వచ్చే పదేళ్లలో వాతావరణ వైపరీత్యాలను తీవ్ర ముప్పుగా డబ్ల్యూఈఎఫ్ నివేదిక పరిగణించింది.

## ఆహార కల్తీకి అడ్డుకట్టపై పార్టీలు హామీ ఇవ్వాలి

దేశంలో ఆహార కల్తీ అతి పెద్ద సమస్యని, దీనికి అడ్డుకట్ట వేస్తామని పార్టీలు మ్యానిఫెస్టోలో హామీ ఇవ్వాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి డిమాండ్ చేశారు. ఎఫ్‌జీజీ ఆధ్వర్యంలో 'ఆహార కల్తీ నియంత్రణ' అంశంపై హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. దేశంలోని 19 నగరాల్లో కల్తీ సమస్య ఉండగా, హైదరాబాద్‌లో అధికంగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ సమస్యపై పార్టీల్ని ప్రజలు ప్రశ్నించాలన్నారు. గృహ విజ్ఞాన కళాశాల మాజీ డీన్ ప్రొఫెసర్ విజయా ఖాదర్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా.ఎన్. కిషన్‌రావు, డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ విజయ్‌కుమార్, ఎఫ్‌జీజీ కార్యదర్శి సోమ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సరైన తీర్పు.. కానీ సమస్యను పరిష్కరించలేదు


రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చిన పేర్లు రహస్యంగా ఉంచే ఎన్నికల బాండ్ల ప్రకటనను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం సరైనదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. కోర్టు తన పరిధిలో సరైన మాట చెప్పింది కానీ, అది సంక్షోభాన్ని పరిష్కరించలేదన్నారు. డబ్బు లేకుండా రాజకీయ పార్టీలు పనిచేయలేవని, అయితే ఆ డబ్బు చట్టబద్ధంగా ఉండాలని మొట్టమొదట వాదించి అందుకోసం చట్టం సాధించింది ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా అన్నారు. తెహల్కా కుంభకోణం నేపథ్యంలో రాజకీయ చర్చను ఒక అవకాశంగా మలిచి అన్ని పార్టీలనూ ఒప్పించి ఈ చట్టాన్ని తేగలిగామన్నారు. పి.వి నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, జార్జి ఫెర్నాండెజ్, అప్పటి న్యాయశాఖా మంత్రి అరుణ్‌జైట్లీ, ఎల్.కె అద్వానీ, మన్మోహన్‌సింగ్ మొదలైనవారితో సమావేశమయ్యామన్నారు. ఎన్నికల్లో భారీ ఖర్చుకి ఈ నిధులు సరిపోకపోయినా, ఆ సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించలేకపోయినా, కనీసం పార్టీల్ని సక్రమంగా నిర్వహించటం కోసమైనా చట్టబద్ధంగా నిధులొచ్చే ఏర్పాటు ఉండాలని వారిని ఒప్పించామన్నారు. పార్టీల విరాళాలపై కాంగ్రెస్ పార్టీ మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో కమిటీ వేయగా, లోక్‌సత్తా ప్రతిపాదించిన అంశాల్నే కమిటీ నివేదికగా ఇచ్చిందన్నారు. ఆ నివేదికను వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం 2003లో ఆమోదించి చట్టంగా తెచ్చిందన్నారు. ఇలా ఒక పార్టీ, అందులోనూ ప్రధాన ప్రతిపక్ష పార్టీ అంతర్గత కమిటీ నివేదికను ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదించి చట్టం తేవటం దేశ చరిత్రలో యాభై, అరవై ఏళ్లలో జరిగిన దాఖలాలు లేవన్నారు. పెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఇప్పటికీ ఇలాంటి చట్టం లేదన్నారు. ఈ చట్టం ప్రకారం వ్యక్తులు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలకు నూరు శాతం పన్ను రాయితీ ఉంటుందని, కంపెనీలయితే మూడేళ్ల లాభాల సగటులో 5% మేర ఇవ్వవచ్చని, ఇందుకు నూరుశాతం పన్ను రాయితీ ఉంటుందన్నారు. చట్టం అమల్లోకి వచ్చాక బీజేపీ అగ్రనేత ఎల్.కె అద్వానీ తమ పార్టీకి ఇక చెక్కుల ద్వారానే విరాళాలు తీసుకోవాలని నిర్ణయించారని, అయితే చెక్కు ద్వారా అనగానే, అధికార పార్టీ అయినా కూడా బీజేపీకి విరాళాలు ఒక్కసారిగా పడిపోయాయన్నారు. ఈ విషయాన్ని అద్వానీ, అరుణ్ జైట్లీ చాలాసార్లు స్వయంగా చెప్పారన్నారు. మన దేశంలో ప్రభుత్వాలు తలచుకుంటే వ్యాపారాల్ని దెబ్బతీయగలవు కాబట్టి ఏ పార్టీకి అధికారికంగా విరాళాలిస్తే తమ మీద కక్ష సాధిస్తారోనన్న భయంతో చెక్కు ద్వారా ఇవ్వటానికి కంపెనీలు భయపడ్డాయన్నారు. దీంతో లెక్కచూపని నగదు విరాళాలు పెరిగాయన్నారు. మోదీ నేతృత్వంలో ఎన్‌డీయే ప్రభుత్వం



అధికారంలోకి వచ్చాక సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేసిందని, అయితే విరాళాలు నల్లడబ్బు లేకుండా, చట్టబద్ధంగా ఉండటం కోసం తన న్యాయవాద బుర్రతో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఎన్నికల బాండ్ల విధానాన్ని తీసుకొచ్చారన్నారు. దీనివల్ల సమస్య యధాతథంగా కొనసాగుతోందన్నారు. గోప్యత సమస్యను పరిష్కరించటానికి మన దేశంలో చట్టబద్ధపాలనను సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రస్తుతం బడితె ఉన్నవాడిదే బర్రె అనే పరిస్థితి ఉందన్నారు. అధికారంలో ఉన్న నాయకులు ఎంత శక్తిమంతులైనా, తమకు నచ్చినవారి పట్ల ఆశ్రిత పక్షపాతంతో వ్యాపారావకాశాల్ని కట్టబెట్టకుండా, తమను వ్యతిరేకించేవారి వ్యాపారాల్ని నాశనం చేయలేని విధంగా చట్టం అందరికీ సమానంగా అమలవ్వాల్సుందన్నారు.

ఇదేసమయంలో ఎన్నికల్లో అసలు సమస్య విరాళాల ద్వారా వచ్చే డబ్బు వల్ల కాదని, ప్రధాన పార్టీలు ఎన్నికల్లో చేసే ఖర్చులో విరాళాల వాటా చాలా తక్కువని జేపీ వివరించారు. ఈ ఖర్చులో చాలావరకు అక్రమమైనది, లెక్కలు చూపనిదన్నారు. అదేవిధంగా, ప్రభుత్వమే పార్టీల ఎన్నికల వ్యయాన్ని భరించాలనే వాదన అర్థరహితమైనదని తెలిపారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించే నాయకత్వ సామర్థ్యం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవాళ్లకి ప్రభుత్వం డబ్బులిచ్చి ప్రచారం కల్పిస్తుందా? ప్రధాన పార్టీల అభ్యర్థులైనాసరే వాళ్లు ఖర్చు పెట్టే కోట్ల రూపాయల్ని ప్రభుత్వం ఇస్తుందా? అని ప్రశ్నించారు. ఓట్ల కొనుగోలు, ప్రలోభాలకు డబ్బు వెదజల్లాల్సిన అవసరం లేకుండా

ఎన్నికల సంస్కరణలు తేవటమే ఈ సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. దీంతోపాటు చట్టబద్ధపాలనను కనీసం ఆర్థిక కార్యకలాపాల్లో అమలు చేసినా పార్టీల ఎన్నికల విరాళాల సమస్య కొలిక్కి వస్తుందన్నారు.




రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు యూనియన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. రహస్యంగా విరాళాలు ఇవ్వటానికి వీలు కల్పించే ఈ పథకం సమాచార హక్కును ఉల్లంఘించటమే కాకుండా, రాజ్యాంగంలోని 19(1)(ఎ) అధికరణం కింద పేర్కొన్న భావ ప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. దీనిని వెంటనే నిలుపుచేయాలని ఆదేశించింది. విరాళాలిచ్చినవారి పేర్లు రహస్యంగా ఉంచటం వల్ల ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా ఉల్లంఘించినట్లువుతుందని తెలిపింది. రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు ఇవ్వటానికి వీలుగా కంపెనీల చట్టంలోని సెక్షన్ 182 (1)లోని నిబంధనను తొలగించటం ఆర్టికల్ 14కి విరుద్ధమని వ్యాఖ్యానించింది. డబ్బు ప్రభావం ఎన్నికల ఫలితాల వరకే పరిమితం కాకుండా ప్రభుత్వ నిర్ణయాలపైనా పడుతుందని పేర్కొంది.


ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కూడా నిధులిస్తుండటం వల్ల క్విడ్ ప్రో కో తరహాలో కొందరు లబ్ధి పొందటానికి ఆస్కారం ఎక్కువగా ఉంటుందని వ్యాఖ్యానించింది. బాండ్ల ముసుగులో అధికార పార్టీలు నిధుల కోసం ప్రజలపై, సంస్థలపై ఒత్తిడి తీసుకువచ్చే అవకాశముందని పేర్కొంది. ఎన్నికల బాండ్ల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌పై అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఎన్నికల బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు అందిన విరాళాలను వెల్లడించాలని 2019 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులను వెలువరించింది. ఎన్నికల బాండ్లు జారీ చేసిన ఎస్‌బీఐ.. ఆ తేదీ తర్వాత రాజకీయ పార్టీలకు అందిన విరాళాల వివరాలన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి మార్చి 6వ తేదీలోగా సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. వీటిని ఎన్నికల సంఘం మార్చి 13 లోగా తన వెబ్‌సైట్‌లో ఉంచాలని స్పష్టం చేసింది.

పార్టీలకు ఇచ్చే విరాళాలపై పరిమితి విధిస్తూ 1985లో చేసిన సవరణ ద్వారా కంపెనీల చట్టంలో సెక్షన్ 293-ఎ చేర్చారు. గడచిన మూడు ఆర్థిక సంవత్సరాలలో వచ్చిన నికర లాభ సగటులో 5% వరకే విరాళాలు ఇచ్చేందుకు అందులో వీలు కల్పించారు. నష్టాల్లో ఉన్న కంపెనీలు, డొల్ల కంపెనీలు విరాళాలు ఇవ్వకుండా ఈ నిబంధన రూపొందించారు. ఇలాంటి కంపెనీల ఏర్పాటును నిరుత్సాహపరచటానికే తాజాగా కంపెనీల విరాళాలపై పరిమితిని తొలగించినట్లు సొలిసిటర్ జనరల్ చేసిన వాదన ఆమోదయోగ్యంగా లేదని ధర్మాసనం పేర్కొంది. యూనియన్ చేసిన సవరణ ద్వారా ఏ కంపెనీ అయినా ఎలాంటి జవాబుదారీతనం లేకుండా తన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ద్వారా రాజకీయ పార్టీలకు అపరిమితంగా విరాళాలు ఇవ్వటానికి వీలుపడుతోంది.

పార్టీల నిధుల సమాచారం ఓటర్లకు అందుబాటులో ఉంటే విధాన నిర్ణయాలు, ఆర్థిక విరాళాల మధ్య సంబంధాన్ని వారు అంచనా వేసుకోగలుగుతారని తెలిపింది. ఈ పథకం కింద ఇప్పటి వరకు 30 విడతల్లో సుమారు 28 వేల బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. వీటి మొత్తం విలువ రూ.16,518 కోట్లు. ఎవరు విరాళాలిచ్చారో పార్టీలకు తెలిసే అవకాశం లేదన్న ప్రభుత్వ వాదనతో ధర్మాసనం ఏకీభవించలేదు. రాజకీయ విరాళాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే శక్తి ఒక వ్యక్తి కంటే కంపెనీకి చాలా ఎక్కువ ఉంటుంది, రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళం వెనక ప్రయోజనాన్ని చూసినా రాజకీయ ప్రక్రియపై కంపెనీల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని వ్యాఖ్యానించింది.

# ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసానికి రాజకీయ పార్టీల నిధుల్లో పారదర్శకత కీలకం

ఎలక్టోరల్ బాండ్ల ద్వారా భారతదేశంలోని రాజకీయ పార్టీలు విరాళాలను స్వీకరిస్తాయి. రాజకీయ నిధులకు పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వ ఆర్థిక చట్టం 2017లో భాగంగా ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టింది. అవి 1,000 రూపాయల




నుండి 1,00,00,000 రూపాయల వరకు ఉంటాయి. దాత ఎవరనేది లబ్ధిదారునికి (రాజకీయ పార్టీ), ప్రజలకు తెలియదు. ఇతర పార్టీలు దాతల్ని వేధించకుండా రక్షించడానికే ఈ విధానం తెచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

ఎలక్టోరల్ బాండ్‌లు రాజ్యాంగవిరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 'ఎ' ని ఉల్లంఘిస్తున్నాయని 15 ఫిబ్రవరి 2024న సుప్రీంకోర్టు పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) ప్రకారం సమాచార హక్కు ప్రాథమిక హక్కు. 1976లో రాజ్ నారాయణ్ వర్సెస్ ది స్టేట్ ఆఫ్ ఉత్తరప్రదేశ్ కేసులో, ఆర్టికల్ 19 ప్రకారం సమాచార హక్కును ప్రాథమిక హక్కుగా పరిగణిస్తామని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.

**ఝాష కొర్ర**

రాజకీయ నిధులు, సంస్కరణలపై చట్టాన్ని రూపొందించటంలో డా.జేపీ కీలక పాత్ర పోషించారు. 2003లో వచ్చిన ఈ చట్టం లెక్కచూపని లేదా చట్టవిరుద్ధమైన నిధులను నిరోధించగలదు. రాజకీయ పార్టీలకు చట్టబద్ధంగా నిధులు సమీకరించే అవకాశం అందిస్తుంది. మాజీ ప్రధాని సహా ప్రధాన రాజకీయ నేతలు, మంత్రులు, ప్రతిపక్ష పార్టీల సభ్యులు మొదలైనవారందరితో కలిసి పనిచేసి రాజకీయ నిధుల కోసం ఒక చట్టబద్ధ ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుకి డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చాలా కృషి చేశారు. చట్టబద్ధ రాజకీయాలకూ డబ్బు అవసరమని, అయితే ఆరోగ్యకకరమైన ప్రజాస్వామ్యానికి చట్టబద్ధ డబ్బు అవసరమని పార్టీల్ని ఒప్పించారు. సామాన్య ప్రజలు క్రౌడ్ ఫండింగ్ నమూనాలో రాజకీయ నిధులిచ్చేలా పార్టీలు వారిని ఇన్‌స్పైర్ చేయగలగాలని జేపీ తెలిపారు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో జవాబు దారీతనం, విశ్వాసం కోసం రాజకీయ నిధులలో పారదర్శకత చాలా కీలకం. తమ ప్రతినిధులకు ఎవరు నిధులు సమ కూరుస్తున్నారో తెలుసుకునే హక్కు ఓటర్లకు ఉంది.

ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఇచ్చిన మొత్తాలను పక్కనపెడితే ప్రచారం, ఇతర రాజకీయ కార్యకలాపాలకు పెద్ద మొత్తంలో లెక్కలోకిరాని డబ్బు ఖర్చు చేస్తున్నారు. ఎన్నికల బాండ్లను రాజ్యాంగవిరుద్ధం అని ప్రకటించటం మాత్రమే కాకుండా, లెక్కకురాని రాజకీయ నిధుల సమస్యని పరి ష్కరించటం కూడా బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించటానికి కీలకం. ❖

## ఓటును సద్వినియోగం చేద్దాం

'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' నినాదంతో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) రాష్ట్ర స్థాయి కళాజాత కార్యక్రమాన్ని విశాఖపట్నం నుంచి ప్రారంభించింది. పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజ మహేంద్రవరం, అమలాపురం, భీమవరం, ఏలూరు, మచిలీ పట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాయచోటి, కడప, పుట్టపర్తి, అనంతపురం, నంద్యాల, కర్నూలులో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో రాష్ట్ర స్థాయి కళాబృందం నృత్య నాటికలు, గేయాలు, జానపదాలు, గజల్స్‌తో ఓటర్లను జాగృత పరు స్తున్నారు. మంచి నాయకులను ఎన్నుకోవటం ద్వారా మాత్ర మే సమస్యలు పరిష్కరించుకోగలం. ఓటును సద్విని యోగం చేసుకుని సమర్థమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలి అని సీఎఫ్‌డీ సంయుక్త కార్యదర్శి వి.లక్ష్మణరెడ్డి కార్యక్రమ ప్రారంభానికి ముందు విజయవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ధన ప్రభావం, మద్యం పంపిణీ లాంటి ప్రలోభాలను తగ్గించటానికి కృషి చేస్తామని ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఎన్.రంగయ్య, ప్రముఖ విద్యావేత్త ఎం.సి దాస్ మాట్లాడుతూ, ఎంపీ స్థానానికి వంద కోట్లు, ఎమ్మెల్యేగా గెలవ టానికి రూ.30 కోట్లు ఖర్చు చేసే స్థితిని తీసుకొచ్చారని విమర్శిం చారు. కులం, మతం, ప్రాంతం, వర్గం, డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, సేవా తత్పరులను, అభివృద్ధి చేసే వారిని గెలిపించాలని కోరారు. ప్రముఖ్య వ్యక్తిత్వ వికాస నిపుణుడు ప్రత్యూష సుబ్బారావు, నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు ఓటు ప్రాముఖ్యంపై మాట్లాడారు. ❖

ఎన్నికలవేళ ఆలోచిద్దాం:

# మన పార్టీలు, ప్రభుత్వాలు, ప్రభుత్వ సిబ్బంది ఈ మూడు వ్యవస్థల తప్పనిసరి ఉమ్మడి గురుతర బాధ్యతలు

## - కారుమంచి గణేష్ ,లోక్‌సత్తా పార్టీ, తెలంగాణ

ఎన్నికలొస్తున్నాయి. ప్రభుత్వాలు చేయాల్సిన పనుల్లో ఇప్పటిదాకా వాయిదా వేయటం వల్ల మనం తీవ్రంగా నష్టపోతున్నవి, తక్షణం చేయాల్సినవి ఏమిటి? మనం ఎన్నుకునే పార్టీలు, ప్రతినిధులు ఈ బాధ్యతల్ని ఎంత సవ్యంగా నెరవేర్చగలరు? ఓటు వేసే ముందు మనలో ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయం.

ముందుగా మన బతుకులకు నిజమైన జవసత్వాలు ఇచ్చేందుకు మనల్ని పాలించే రాజ్యాధినేతలు, రాజ్య సిబ్బంది అనునిత్యం ప్రాధాన్యత, ప్రామాణికం, ప్రాతినిధ్య-భాగస్వామ్యంతో చేయవలసిన తక్షణ మూడు అంశాలు ఇవే:

1.బతుకు భయంలేని బతుకు తెరువు నివ్వగలుగుతూ, పౌరులంతా తలెత్తుకొని ఆత్మవిశ్వాసంతో ఆత్మగౌరవంతో బతకగలిగే, ఎవ్వరితోనయినా పోటీపడే అవకాశాన్ని అందించే అసలయిన, సమగ్రమైన, సుసంపన్నమైన, సరళమైన ఎంతవరకూ చదువుకుంటే అంతవరకూ చదవగలిగే నచ్చిన విద్య ప్రభుత్వ బాధ్యతతో!

2. ఏ కులంలో, ఏ కుటుంబంలో పుట్టినా, మనం, నివారించదగ్గ వ్యాధుల వలన అకాల మరణం లేదా తీవ్ర అనారోగ్యానికి అయ్యే ఖర్చుల కారణంగా అప్పుల పాలయి, పేదరికంలోకి జారిపోయే దుర్భర పరిస్థితులు దాపురించే భయం లేని, జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా అందించే సంపూర్ణ, సమగ్ర, పరిశుభ్రమైన నచ్చిన ఆసుపత్రిలో నచ్చిన వైద్యుడితో ఉచితంగా పొందగలగే ప్రభుత్వ-ప్రయివేటు ఆరోగ్యం!!

3. నష్టాలు- అప్పుల భయాలు కారణంగా పొట్ట చేత పట్టుకొని




సుదూర ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు తరలిపోవాల్సిన దుస్థితి, లేదా పంట పండే సారవంతమైన వ్యవసాయ భూమిని తెగనమ్ముకొని, అదీ కుదరకపోతే వదులుకొని వేరే బతుకుతెరువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన భయంలేని, తను పండించిన పంట మార్కెట్లో ఎక్కడయినా లాభసాటి ధరకు అమ్ముకోగలిగే మార్కెట్ సదుపాయం, తద్వారా అత్యుత్తమ లాభసాటి ధరను సునాయాసంగా పొందగలిగే ఏర్పాట్లు, అప్పుల భయంలేని లాభసాటి వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్- శీతల గిడ్డంగులు, నష్టపరిహారం రాదనే భయంలేని పంట బీమా, అధిక వడ్డీల భయంలేని సముచిత రాయితీలతో కూడిన పంట పెట్టుబడులు, సానుకూల సహజ నీటి వనరులు, భూసారాన్ని మన ఆరోగ్యాన్ని నాశనం చేయని ఎరువులు, పురుగుమందులను సకాలంలో అందించగలిగిన సమగ్ర ఉత్తమ వ్యవసాయం!!!

ఇవి ప్రభుత్వాల మొదటి ప్రాధాన్యతలు కాలేని ఏ దేశమూ చరిత్రలో అభివృద్ధి చెందిన దాఖలాలు లేవు. అందువల్ల ఆలోచించి ఓటు వేద్దాం, అభివృద్ధి సాధించుకుందాం.

❖

## ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రజా మేనిఫెస్టో




ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ప్రజల నుండి, ప్రజా సంఘాల నుండి సరికొత్త ప్రజా మేనిఫెస్టో కావాలని ఉత్తరాంధ్ర చర్చా వేదిక కో కన్వీనర్ భీశెట్టి బాబ్జీ అన్నారు. శ్రీకాకుళంలో పంచాది రాంబాబు అధ్యక్షతన వివిధ రంగాల ప్రజా సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బాబ్జీ మాట్లాడుతూ కొత్త పరిశ్రమలు తేవాలని, ఉన్న పరిశ్రమలు పనిచేయాలని, వలసలు నిరోధించాలని కనీసం ఆలోచన మన నేతల్లో లేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి, వంశధార రెండో దశ, గజపతినగరం బ్రాంచ్ కాలువ, వంశధార నాగావళి అనుసంధానం, మహేంద్ర తనయ రిజర్వాయర్, మద్దువలస రెండో దశ, తారక రామతీర్థ సాగర్ ప్రాజెక్టు పనులతోపాటు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికాక ప్రతి చేతికి పని, ప్రతి చేనుకు నీరు లేని పరిస్థితి దాపురించి ఉత్తరాంధ్ర వ్యవసాయం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల ముందు ప్రజా మేనిఫెస్టో పెట్టి దానిపై రాజకీయ పార్టీలు కదిలివచ్చేలా ఉత్తరాంధ్రలోని ప్రజాసంఘాలు పోరాడాల్సిన అవసరముం దన్నారు.సమావేశంలో బి.జగదీష్, గౌరీశంకర్, జానకిరామ్, కె.బాలరాజు, లక్ష్మణ్, యు.శివతేజ, సప్రజారౌతు, రవితేజ, చిన్నయరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధికి

# చట్టబద్ధ పాలన కీలకం

**డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్, లక్ష్మీనారాయణలతో సుమేధ కూరపర్తి ముఖాముఖి (మొదటి భాగం)**




**ప్రశ్న : చట్టబద్ధ పాలన అంటే ఏమిటి? సామాన్యుడి రోజువారీ జీవితానికి చట్టబద్ధపాలనకి ఎలాంటి సంబంధం ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టబద్ధపాలన అవసరం.. ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధపాలనకి ఉన్న సంబంధం ఏమిటి?**

**లక్ష్మీనారాయణ:** దేశ సమైక్యత..సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడడం, ఆర్థిక సమతుల్యత..స్థిరత్వం, చట్టబద్ధపాలన ఇవి సాధారణంగా ప్రభుత్వాల ముఖ్యమైన బాధ్యతలు. అభివృద్ధికి చట్టబద్ధపాలనకు(రూల్ ఆఫ్ లా) సంబంధం లేదని చాలా మంది భావిస్తుంటారు. కానీ ఎక్కడైతే శాంతి ఉంటుందో అక్కడ అభివృద్ధి ఉంటుంది. శాంతి ఎక్కడ ఉంటుంది? ఎక్కడైతే న్యాయం ఉంటుందో అక్కడ ఉంటుంది..న్యాయం ఎక్కడ ఉంటుంది? చట్టబద్ధపాలన అమలవుతున్న చోట న్యాయం ఉంటుంది. కాబట్టి సమాజాభివృద్ధి అనేది రూల్ ఆఫ్ లా మీద ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఒక రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలు కాకపోతే.. ఆ రాష్ట్రానికి పెట్టుబడులు రావు. ఆ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ ముందుకు రారు. ఎందుకంటే ఆ రాష్ట్రంలో రేపు ఏం జరుగుతుందో తెలియదు. కాబట్టి ఆ విధమైన అనిశ్చిత పరిస్థితిలో ఆ ప్రాంతం అభివృద్ధి కాదు. కాబట్టి నా దృష్టిలో రూల్ ఆఫ్ లా చాలా ముఖ్యమైంది.

**జేపీ:** పూర్వకాలంలో రాచరికంలో, నిరంకుశ దేశాల్లో, మధ్య యుగంలో, భూస్వామ్య వ్యవస్థలో కూడా మొట్టమొదట ప్రభుత్వం చేసింది ఏమిటి? శాంతిభద్రతలను కాపాడడం, న్యాయం ఇవ్వడం. ఇవి లేకపోతే సమజంలో స్థిరత్వం లేదు. అరాచకత్వం వర్ధిల్లుతుంది. సకాలంలో న్యాయం అందాలి. అదీ వేగంగా, సమర్థంగా, ఖర్చు లేకుండా పరిష్కారం దొరక్కపోతే డబ్బున్న వాడిదే రాజ్యం అవుతుంది. రూల్ ఆఫ్ లా కావాల్సింది ప్రధానంగా సామాన్యుల కోసం. ఇది డబ్బున్న వాళ్ల కోసం కాదు. డబ్బున్న వాడు లంచం ఇచ్చి పనిచేయించుకుంటాడు. అధికారంలో ఉన్నవాడు పలుకుబడితో పనిచేయించుకుంటాడు. సామాన్యులకు ఆ అవకాశం లేదు. ఆ హక్కులు రక్షించే అవకాశం లేకపోతే నేరం చేయకపోయినా వారి మీద నేరం మోపి శిక్షిస్తారు. లేకపోతే వారి హక్కుల్ని కాలరాసి, వారి హక్కుల్ని ఇంకొకళ్లకి కట్టబెడతారు. అందువల్ల రూల్ ఆఫ్ లా అనేది సంపన్నుల విషయం కాదు..సామాన్యులది. రెండో అంశం..ప్రజాస్వామ్యం ఇంతటితో పరిమితం అయితే చాలదు. ప్రజాస్వామ్యంలో మనం ఆలోచించాల్సింది. చట్టం.. ఉన్నవాడికి







చట్టం కాకూడదు. బడితె ఉన్నవాడిదే బర్రె కాకూడదు. మీరు ఇవాళ రష్యా చూడండి..పుతిన్‌ను ఎవరైనా ఎదిరిస్తే వాడి ప్రాణాలు పోతాయి. ఆయన ప్రధాన ప్రత్యర్థిని జైల్లో పెట్టి నానాచిత్రహింసలు పెడుతున్నారు. చాలా మంది ప్రత్యర్థులను చంపేశారు. దేశం లోపల, బయట కూడా వారిని చంపేశారు. అది రూల్ ఆఫ్ లా కాదు. పాకిస్తాన్‌లో 1970వ దశకంలో భుట్టో జనాకర్షణ ఉన్న నాయకుడు..ఆయన్ను పదవినుంచి దించేసి ఉరితీసేశారు..అది రూల్ ఆఫ్ లా కాదు. అధికారంలో ఉన్నా లేకపోయినా ఏ కులం అయినా..మతమైనా చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందన్న నమ్మకం కలగాలి. చట్టాన్ని మించి ఎవరూ పెద్దవాళ్లు కాకూడదు. చట్టం అందరికంటే పెద్దగా ఉండాలి. మనదేశంలో కాగితం మీద ఉన్నా కూడా వాస్తవానికి లేదు. అది లేకపోతే సమాజం అల్లకల్లోలం కావడమే కాకుండా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతోంది. రూల్ ఆఫ్ లా.. ఆ భాష సామాన్యులకి అర్థం కాకపోవచ్చు. మన హక్కుల్ని అందరికీ సమానంగా కాపాడడం అన్నది, సమర్థంగా న్యాయం ఇవ్వడం అన్నది ఆధునిక సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు ప్రాణం. చట్టబద్ధ పాలనని సమూలంగా, వ్యవస్థని గందరగోళం చేయకుండా మార్చాలి. సమతూకం పాటించాలి.

**ప్రశ్న : పోలీసు వ్యవస్థపై నమ్మకం కలగాలంటే మనం ఏం చేయాలి?**

**లక్ష్మీనారాయణ:** పోలీసుస్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, బాధితుల గోడును పట్టించుకోవడం.. ప్రొసీజర్‌ను ఫాలో అవుతున్నామా? లేదా? అనేది చాలా ముఖ్యం. నేరాలు జరగకుండా చూడడం పోలీసుల ప్రధాన విధి. సీఆర్‌పీసీలో సెక్షన్ 106 నుంచి 110 వరకు ఈ అంశం గురించే ప్రస్తావించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిని బైండోవర్ చేయొచ్చు. అటువంటి సమాజాన్ని ఏర్పాటు చేస్తే నేరాలు తగ్గుతాయి. దీన్ని మనం నిర్లక్ష్యం చేస్తే నేరాలు పెరుగుతాయి. అప్పుడు సమాజంలో అలజడి రేగుతుంది. మనకు దాని నుంచి వెంటనే ఫలితం వస్తుందా లేదా అనేది కూడా ముఖ్యం. నేరం జరిగిన తర్వాత వెంటనే ఆ కేసును రిజిస్టర్ చేసి విచారణ అనంతరం కోర్టులకు పంపి సత్వర న్యాయం అందిస్తే ప్రజలకు కూడా విశ్వాసం పెరుగుతుంది. పోలీసు స్టేషన్‌కు వెళితే చివరకు మాకు న్యాయం జరిగిందనే భావన కలుగుతుంది. ఇప్పుడు ఏమైంది..కేసుల పెండింగ్ అనేది సంవత్సరాల తరబడి పెరిగిపోతోంది..మనదేశంలో సుమారు నాలుగు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫలితంగా వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లిపోతోంది. దీనివల్ల సమాంతర వ్యవస్థ అభివృద్ధి చెందుతోంది. ముంబయి లాంటి ప్రాంతాల్లో అండర్‌వరల్డ్ డాన్ వ్యవస్థ అదే. సత్వర న్యాయం కోసం అలాంటి వారిని ఆశ్రయిస్తుంటారు. అందువల్ల అందరి సహకారంతో మార్పులు తీసుకురావాలి. మహారాష్ట్రలో ఓ విధానం ప్రారంభించారు..ఏయే గ్రామాల్లో అసలు ఫిర్యాదులే లేవో..వాటిలో కొన్ని వ్యవస్థలను ఏర్పాటు చేశారు..పోలీసు, రెవెన్యూ వీళ్లందరూ కలిసి గ్రామాల్లో జరుగుతున్న చిన్న చిన్న సంఘటనలను అక్కడే పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. కోర్టుల్లో కూడా కేసుల సత్వర పరిష్కారం అవసరం. ఏదేశంలో అయితే చట్టాలు ఎక్కువ ఉంటాయో..అక్కడ గవర్నెన్స్ తక్కువ ఉంటుంది. మనం ఏం చేస్తామంటే ప్రతిదానికి చట్టం చేస్తాం..చట్టం చేసినంత మాత్రాన దాని నుంచి బయటకు వస్తామని లేదు. ఉదాహరణకు..వరకట్న నిషేధ చట్టం చేశాం. ఏమైంది? సమాజంలో మార్పు వచ్చిందా? కాబట్టి తక్కువ చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తూ సమాజంలో మార్పు తీసుకురావడం అనేది చాలా ముఖ్యం.

**జేపీ:** కన్యాశుల్కం నాటకం చదివితే పోలీసు కానిస్టేబులు ఎంత బెదిరిస్తాడో అర్థం అవుతుంది. గ్రామాల్లో ఇప్పటికి కూడా చాలా మంది తల్లులు పిల్లలు మాట వినకపోతే అదిగో పోలీసు అంటారు. అంటే పోలీసు వాళ్లంటే భయం అనేది సమాజంలో ఒక సంస్కృతిలో భాగం అయింది. ప్రజాస్వామ్య రాజకీయంలో పరిపాలనా యంత్రాంగం, ప్రభుత్వం చాలా చేయాలని అనుకున్నప్పటికీ చాలా వాటిలో విఫలం అవుతున్నాయి. దీంతో సహజంగానే ప్రజల్లో వ్యతిరేకత, ఉద్యమాలు, ఆందోళనలు వస్తాయి. ఏ సమస్య వచ్చినా కూడా శాంతిభద్రతల సమస్యగా మారిపోతుంది. నిజానికి అది పోలీసు సమస్య కాకూడదు. సరైన పరిపాలన ఉంటే, అధికార వికేంద్రీకరణ ఉంటే..సమర్థంగా స్పందించే తత్వం ఉంటే వెంటనే దాన్ని సరిచేసే మార్గం ఉన్నట్టయితే అది శాంతిభద్రతల సమస్య కాకూడదు..పోలీసుల సమస్య కాకూడదు. మనం ఏం చేశాం..ఒక వర్షం వచ్చింది..వరదలు వచ్చాయి.. శాంతిభద్రతల సమస్య. ట్రాఫిక్

బాగోలేదు.. శాంతిభద్రతల సమస్య. చివరికి ప్రభుత్వం మీద ఏ కోపం ఉన్నా కూడా యూనిఫారంలో ఉన్న పోలీసుల మీద కసి అనే పరిస్థితి వచ్చేసింది. దీన్నుంచి బయటపడాలి. పోలీసులను విలన్లుగా చిత్రీకరిస్తే కాసేపు మనకు ఆవేశం చల్లారొచ్చు కానీ..పోలీసులు లేని లోకాన్ని ఊహించండి.. హైదరాబాద్ నగరంలో పది రోజుల పాటు పోలీసులు లేరు.. ఏమవుతుంది..అల్లకల్లోలం అయిపోతుంది.. ఇక పరిష్కారం ఏంటి? మూడు అంశాలను ఆలోచించాలి.

**పోలీసు యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ వ్యవస్థతో ప్రమేయం లేకుండా బయటపెట్టాలంటే ఏ ప్రభుత్వమూ ఒప్పుకోదు. నేనూ ఒప్పుకోను. ఎందుకంటే ప్రజల గోడు పట్టించుకోని పోలీసు యంత్రాంగం ఇప్పుడున్న పోలీసు యంత్రాంగం కంటే ప్రమాదకరం అవుతుంది. కాబట్టి ఆచరణ సాధ్యం కాదు.**

1.మనందరికీ ఉన్న ఆందోళనలో కొంత వాస్తవం ఉంది. పోలీసు అధికారులు నాయకులకు లేదా పై అధికారుల అడుగులకు మడుగు లొత్తుతున్నారు..ఆ కారణంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు.

అది లేకుండా చేయడం ఎలా? మొత్తం పోలీసు యంత్రాంగాన్ని చేయలేం. నేరపరిశోధనలో కనీసం పెద్ద నేరాలు. అంటే ఐదేళ్ల లేదా మూడేళ్ల కంటే శిక్ష ఎక్కువ పడే నేరాలు. అటువంటి నేరాలకు సంబంధించి అయినా స్వతంత్రంగా ఒక వ్యవస్థ ఏర్పాటు చేద్దాం. మనకు సీబీసీఐడీ అని ఒకటుంది. అలాంట దాన్నే బలోపేతం చేసి ఒకస్థాయి దాటిన కేసులన్నీ ఆటో మెటిక్ గా వాళ్లే పరిశోధన చేపట్టే ఏర్పాటు చేయొచ్చు. అది సాధ్యమే. అంతేకాని పోలీసు యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ వ్యవస్థతో ప్రమేయం లేకుండా బయటపెట్టాలంటే ఏ ప్రభుత్వమూ ఒప్పు కోదు. నేనూ ఒప్పుకోను. ఎందుకంటే ప్రజల గోడు పట్టించుకోని పోలీసు యంత్రాంగం ఇప్పుడున్న పోలీసు యంత్రాంగం కంటే ప్రమాదకరం అవుతుంది. కాబట్టి ఆచరణ సాధ్యం కాదు. కనీసం ఒకస్థాయి నేరాల నేరపరిశోధనని పూర్తి గా వేరు చేసి, అక్కడ రాజకీయం నీడ ఏమాత్రం లేకుండా చేయడం.

**రెండోది..**అంతమాత్రం చేత సామర్థ్యం పెరుగుతుందా? లక్ష జనాభాకి మన దేశంలో ఉన్న పోలీసుల సంఖ్య 100 నుంచి 120 మంది. వాళ్లలో చాలా మంది మిగతా పనులకు ఉపయోగపడుతున్నారు. పోలీసు పనిచేయడం లేదు. ప్రపంచంలో లక్ష జనాభాకి 250 మంది పోలీసులు ఉన్నారు. అంతకాకపోయినా సంఖ్యను పెంచాలి. శిక్షణ బాగా ఇవ్వాలి. మొబిలిటీని పెంచాలి. సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తేవాలి. ఫోరెన్సిక్ లేబోరేటరి చాలా తక్కువ ఉన్నాయి. సాంకేతిక విజ్ఞానం-సామర్థ్యం పెంచాలి. **మూడోది..** జవాబుదారీతనం. ఇప్పుడు రాజకీయనాయకుల మాట వింటున్నారని భయపడుతున్నాం. అసలు ఎవరి మాటా వినకపోతే ఆ పోలీసు వ్యవస్థ చాలా ప్రమాదకరం అవుతుంది. కాబట్టి పక్షపాతం లేకుండా, రాజకీయ జోక్యం లేకుండా జవాబుదారీతనంగా చేయడం ఎలా? స్వతంత్ర ప్రతిపత్తి..జవాబుదారీతనంతో కూడుకున్నది.. అన్ని పోలీసు పనులు కాకుండా కొద్దిగా పెద్ద నేరాలు పరిశోధించే వ్యవస్థను పూర్తిగా రాజకీయవ్యవస్థ నుంచి




బయటపెట్టడం..వారి శక్తి సామర్థ్యాలు పెంచడం..ఈ మూడు కలిపి చూస్తే పరిష్కారం వస్తుంది. కానీ కొంతమంది, పోలీసులను ముఖ్యమంత్రి చేతిలో నుంచి తీసిపారేయండి..అని అంటుంటారు. ఏ ముఖ్యమంత్రీ ఒప్పుకోడు..ఒప్పుకోరాదు కూడా. కొన్ని దేశాల్లో నేను చూశాను..ఆ దేశ రాష్ట్రపతి కంటే పోలీసు కమిషనర్ అంటే ప్రజల్లో భయం ఉంది. అది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. పోలీసులు అంటే సమాజం మొత్తం గడగడలాడుతుంటే అది ప్రజాస్వామ్యానికి క్షేమకరం కాదు. కాబట్టి ఈ మూడింటిని సమన్వయం చేయాలి. ఇప్పుడు మీరు గమనిస్తే హైదరాబాద్ నగరం కావొచ్చు..మిగతా ప్రాంతాల్లో కావచ్చు.. సమర్థులు.. నిజాయితీ పరులైన అధికారులకు కొదవ లేదు. కింది స్థాయిలో ఉన్నారు..డీజీపీ స్థాయిలోనూ ఉన్నారు.. మధ్యలోనూ ఉన్నారు. వాళ్లు ఎక్కడ వీలైతే అక్కడ ప్రయత్నిస్తున్నారు.. ఫలితాలొస్తున్నాయి. కానీ సంస్థాగతంగా, దీర్ఘకాలంగా, సమగ్రంగా జరగడం లేదు. వాళ్ల చేతుల్లో ఉన్న వరకు చేస్తున్నారు.

ఈ మొత్తం జరగాలంటే మన సమాజం పూనుకోవాలి. ఇది రాజకీయంలో ఉన్న వాళ్లు వదిలేసుకోరు..సమాజం నుంచి ఒత్తిడి రావాలి. మనం ఏం చేస్తున్నాం..ఒక నేరం భయంకరంగా జరిగితే ఆ తర్వాత లబోదిబోమంటున్నాం. ఈ మధ్య కాలంలో ఏం అవుతుందీ. ఏదైనా జరిగితే కాల్చి పారేయంటున్నారు.. వెంటనే కాల్చి పారేయమని అనధికారికంగా ఆదేశాలు ఇస్తున్నారు. కాల్చేస్తే పోలీసులు మీద హత్యానేరం పెడుతున్నారు. కాల్చేయమని మనమే చెబుతున్నాం..కాల్చేస్తే దండలు వేస్తున్నాం. పోలీసులు నేరస్తులను శిక్షించడం పరిష్కారం కాదు. పరిష్కారం చాలా వేగంగా, సమర్థంగా, అవసరమైతే కఠినంగా, అవసరమైన చోట్ల న్యాయం అందుతుందన్న నమ్మకం కావాలి. అందువల్ల సమర్థంగా, నిష్పాక్షికంగా, జవాబుదారీతనంగా పనిచేసే ఏర్పాట్లపై దృష్టి పెట్టాలి. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ఇంట్లో సోదాలు చేస్తే వెంటనే ఆరోపణలు మొదలయ్యాయి. ఆ దేశంలో కూడా ఆరోపణలు చేసుకుంటున్నారు. అయితే రాజకీయానికి లోబడే సంస్కృతి లేదు కాబట్టి చెల్లదు. ఇప్పటికైనా కూడా అన్ని పార్టీల వాళ్లు ఒకర్ని ఒకరు దూషించుకోవడం కాకుండా వ్యవస్థను ఎలా మార్చాలి, దుర్వినియోగం కాకుండా మార్గాన్ని ఆలోచించాలి. కానీ ఒకర్ని ఇంకొకరు తిట్టుకోవడానికి మార్గంగా భావిస్తున్నారు..అదీ సమస్య.

**(ఇంకా ఉంది. . . )**








ఉన్నత విద్యలో మౌలిక మార్పు లక్ష్యంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్ అవకాశాలపై తెలంగాణ సి.ఐ.ఐ హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్













RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th March, 2024 Posting Date 15 &16th of every month

# 5 నిముషాల్లో తేల్చాల్సిన తీర్పుకి 25 ఏళ్లు



ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభల్లో ఓటు వేయటానికి, ప్రసంగించటానికి లంచాలు తీసుకోవటం నేరమని, ఆ ఆరోపణలపై విచారణ నుంచి వారికి మినహాయింపు ఉండదని జేఎంఎం లంచాల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానించాలి. ఆ కేసులో 1998లో ధర్మాసనం ఇచ్చిన తీర్పు పూర్తిగా తప్పు, లోపభూయిష్టమైనది. బాధల్లా ఏంటంటే, అయిదు నిమిషాల్లో తేల్చాల్సింది 25 ఏళ్లు పట్టింది. మన ద్వారా ఎన్నికైన ప్రతినిధులు, మన పేరుతో చట్టసభల్లో ఓటు వేస్తున్నప్పుడు డబ్బులు తీసుకుని సొంత లాభం కోసం వేయకూడదన్న మౌలికాంశం గ్రామంలోని పెద్దమనిషిని అడిగినా తెలుస్తుంది. కానీ ఈ విషయం గతంలో సుప్రీంకోర్టుకు అర్థం కాలేదంటే, చాలా దురదృష్టం. చట్టసభ సభ్యులకు కొన్ని ప్రత్యేక రక్షణలుంటాయి. ప్రజల ప్రతినిధులుగా సభలో మాట్లాడేటప్పుడు వాళ్లు మాట్లాడిన అంశాన్ని, సభలో వాళ్ల ప్రవర్తనను తీసుకుని దాన్ని మీద కోర్టుల్లో కేసులు వేస్తే ఇక సభ నడవదు. సభలో వాళ్లు ప్రజల అభిప్రాయాన్ని నిర్భయంగా వినిపించగలగాలి. అతని ప్రవర్తన సభలో వెకిలిగా, దారుణంగా ఉన్నట్లయితే, వాడరాని పదజాలం వాడితే స్పీకర్ లేదా సభ మొత్తం ఏ స్థాయి చర్య అయినా తీసుకోవచ్చు. సభ బయట దుష్ప్రవర్తన ఉంటే అప్పుడు కోర్టుకు వెళ్లవచ్చు, సభ కూడా నిర్ణయం చేయవచ్చు. ఎందుకంటే, సభ బయట సభ్యుల హుందాతనాన్ని కించపరిస్తూ, సభ ఔన్నత్యాన్ని భంగపరిస్తే, కచ్చితంగా సభకు చర్య తీసుకునే అవకాశం ఉంది. అంతేతప్ప, ఓటు వేసే అధికారం ఉంది కాబట్టి డబ్బులు తీసుకోవటం తప్పు కాదన్నది చాలా విడ్డూరమైన వాదన. అరగంట విచారణతో తేల్చాల్సిన న్యాయానికి పాతికేళ్లు తీసుకున్నారు. న్యాయవ్యవస్థ, చట్టసభలు, ప్రభుత్వాలు వేగంగా, సమర్థంగా, నిష్పాక్షికంగా, నిజాయతీగా స్పందించటం నేర్చుకోవాలి.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

(జేఎంఎం ముడుపుల కేసులో 1998లో ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ 2024 మార్చిలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై జేపీ పూర్తి స్పందన కోసం చూడండి https://www.youtube.com/@JPLoksattaOfficial )

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020